




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 4 గురువారం | సెప్టెంబర్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 351
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur






## భారత్‌కు బంపరాఫర్ ఇచ్చిన రష్యా!



9

## కవితకు హరీష్ రావు కౌంటర్ ఇస్తాడా? లేదా?



2

## కవిత రాజీనామా వెనుక అసలు కారణం ఇదే..



2

హరీష్‌రావు, సంతోష్‌రావు వెనక నేనెందుకు ఉంటాను..?

# మీ గొడవల్లోకి నన్ను లాగకండి

- కవిత ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటు స్పందన
- ప్రజలు తిరస్కరించిన వారి వెనుక నేనెందుకు వుంటాను
- బీఆర్ఎస్‌లో అంతర్గత కలహాలపై తీవ్ర విమర్శలు
- అవినీతి సొమ్ముపై కుటుంబ పంచాయితీలు: సీఎం విమర్శ
- నా బాధ్యత తెలంగాణ ప్రజల అభ్యున్నతి మాత్రమే
- టీడీపీ పతనానికి బీఆర్ఎస్ కుట్రలే కారణం
- ప్రజల తీర్పే నిర్ణయాత్మకం : రేవంత్ రెడ్డి
- పాలమూరు జిల్లాకు న్యాయం చేస్తామన్న హామీ
- సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం - రైతులకు భరోసా

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

హరీశ్ రావు, సంతోష్ రావు వెనుకాల రేవంత్ రెడ్డి ఉన్నారన్న కవిత ఆరోపణల పట్ల ముఖ్యమంత్రి స్పందించారు. ప్రజలు తిరస్కరించిన వారి వెనుకాల నేనెందుకు ఉంటాను.. అనవసరంగా మీ గొడవల్లోకి మమ్మల్ని లాగొద్దు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని వేముల గ్రామంలో ఫార్మా రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి హాజరైన ఆయన బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "రాజకీయాలు శాశ్వతం కావు. ఒకప్పుడు ఇతర పార్టీలను బతకనివ్వకుండా చేసిన వారు, ఇప్పుడు తమ కుటుంబం మధ్యే గొడవలకు దిగారు. చరిత్ర తిరగబడుతుంది. చేసిన పాపం ఎప్పటికీ వదలదు" అని వ్యాఖ్యానించారు.

నాటి పాలకులు శాసనసభ్యులను రాత్రికిరాత్రే కేసులు పెట్టి జైలులో పెట్టేవారు. అదే వ్యక్తులు ఇప్పుడు ఒకరినొకరు తట్టుకోలేని పరిస్థితిలో ఉన్నారు. విపరీతమైన అవినీతి సొమ్ము పంపకాలలో కుటుంబ పంచాయతీలు మొదలయ్యాయి. దాంతో ఒకరి మీద ఒకరు యాసిడ్ దాడులు చేసుకునే వరకు దిగజారిపోయారు. బయట నవ్వుకున్నా, లోపల కత్తులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.

రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇలాంటి వ్యక్తుల వెనుక నేను ఎందుకు ఉండాలి? ప్రజల తిరస్కారం పొందిన వారిని నిలబెట్టే బాధ్యత నాదేం కాదు. నా పని పాలమూరు జిల్లా సహా మొత్తం తెలంగాణ ప్రజలకు అండగా నిలబడటం. రాష్ట్రానికి న్యాయం జరిగేలా ముందుండి పని చేయడమే నా లక్ష్యం" అని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీడీపీ రాజకీయ ప్రాధాన్యంపై మాట్లాడారు. ఒకప్పుడు గొప్ప పేరున్న జనతా పార్టీ కనుమరుగైంది. ఆ తర్వాత, అనేక అవకాశాలను కల్పించిన అద్భుతమైన పార్టీ తెలుగుదేశం పార్టీ. ఆ పార్టీ నుండి అనేక మంది పెద్ద నాయకులు ఎదిగారు. అయితే తెలంగాణలో బీఆర్ఎస్ కుట్రల వలన టీడీపీ అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. ఒక శక్తివంతమైన పార్టీని సజీవంగా దెబ్బతీయడం ఆచరణలో జరిగిందని చరిత్రే చెబుతుంది" అని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఆ పార్టీ ఎలా మనుగడ సాగిస్తుందని మీరు అనుకుంటున్నారు? చరిత్రలో ఇదే తరచుగా జరిగిందని, చివరికి ప్రజల తీర్పే


క్రిమినల్ రికార్డు ఉంటే

విదేశీయులకు దేశంలోకి

# నో ఎంట్రీ

## రాష్ట్రాలకు కేంద్ర కీలక ఆదేశాలు

- అక్రమ వలసదారులకు అడ్డుకట్ట
- క్రిమినల్ రికార్డుతో వచ్చిన విదేశీయులకు నిషేధం
- రాష్ట్రాలకు కేంద్ర మార్గదర్శకాలు
- ప్రత్యేక హోల్డింగ్, డిటెన్షన్ కేంద్రాలు
- సరిహద్దు భద్రత కట్టుదిట్టం
- సున్నిత ప్రాంతాలకు విదేశీయులకు నో ఎంట్రీ
- ముఖ్య రంగాల్లో ఉద్యోగాలకు కొత్త షరతులు
- అడ్వెంచర్ పర్యాటకానికి కేంద్ర అనుమతి తప్పనిసరి



2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఈ ఏడాది బడ్జెట్ సమావేశాల్లో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. వలసదారులు, విదేశీయలు చట్టాన్ని సవరించింది. ఈ చట్టం ప్రకారం ఎవరైనా వీసాలు, సరైన పత్రాలు లేకుండా భారత్‌కు వస్తే తాట తీస్తారు. వారిని అదుపులోకి తీసుకుని నిర్బంధ కేంద్రాలకు తరలిస్తారు. సెప్టెంబరు 1 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చినట్టు కేంద్రం నోటిఫై చేసింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీచేసింది. దేశ భద్రతకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. క్రిమినల్ రికార్డులు ఉండే విదేశీయులను దేశంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ సెప్టెంబరు 2న (మంగళవారం) మార్గదర్శకాలను జారీచేసింది. గతంలో వచ్చి నేరాలకు పాల్పడినా, దేశ వ్యతిరేక చర్యలకు దిగిన విదేశీయులను మళ్లీ రాకుండా నిరోధించాలని స్పష్టమైన ఆదేశాలు వెలువరించింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. భారత్ వచ్చి గూఢచర్యం, తీవ్రవాద కార్యకలాపాలు, హత్యలు, అత్యాచారాలు, డ్రగ్స్ స్మగ్లింగ్ వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడి దోషులుగా నిర్ధారణ అయిన విదేశీయులను గుర్తించి, మళ్లీ వారిని దేశంలోకి ప్రవేశించకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని హోంశాఖ తేల్చిచెప్పింది. ఒకవేళ అలాంటి వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే తక్షణమే అదుపులోకి తీసుకోవాలని పేర్కొంది. ఇందుకోసం ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్

ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్‌కు

# కవిత రాజీనామా

## కవిత రాజీనామాలో ట్విస్ట్..!

- హరీశ్ రావుపై నిప్పులు చెరిగిన కవిత
- రేవంత్‌కు హరీశ్ లొంగిపోయారన్న కవిత
- నాశనం చేయడమే హరీశ్ పని అని మండిపాటు
- కేసీఆర్, కేటీఆర్‌లను దెబ్బతీస్తున్నారని వ్యాఖ్య
- నిజామాబాద్ ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా
- గుత్తా సుఖేందర్ రెడ్డితో కవిత ఫోన్ సంభాషణ
- నిర్ణయం తీసుకుంటా' - మండలి చైర్మన్ స్పష్టం



2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్ కు గురైన కేసీఆర్ తనయ కవిత సంచలన ప్రకటన చేశారు. ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఆమె ప్రకటించారు. హైదరాబాద్ లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ మేరకు తన నిర్ణయాన్ని వెలువరించారు. తన రాజీనామా లేఖలను మీడియా ముఖంగా చూపించారు. ఇదే సమయంలో మాజీ మంత్రి హరీశ్ రావుపై ఆమె నిప్పులు చెరిగారు. హరీశ్ రావు సీఎం రేవంత్ రెడ్డికి లొంగిపోయారని ఆరోపించారు. రేవంత్, హరీశ్ ఇద్దరూ ఒకే విమానంలో ఢిల్లీకి వెళ్లారని... ఆ ప్రయాణంలో రేవంత్ కాళ్లను హరీశ్ పట్టుకున్నారని చెప్పారు. ఆ ప్రయాణం తర్వాత హరీశ్ పూర్తిగా మారిపోయారని... రేవంత్ కు లొంగిపోయారని, ఆ తర్వాతే కుట్రలకు తెరలేచిందని తెలిపారు. నాశనం చేయడమే హరీశ్ రావు పని అని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ లను దెబ్బతీసి పార్టీని చేజిక్కించుకునే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. సంతోష్ రావు చేసిన పనుల వల్ల బీఆర్ఎస్ కు చెడ్డ పేరు వచ్చిందని కవిత అన్నారు. కూరలో ఉప్పు, చెప్పులో రాయి వంటి వాడు సంతోష్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ట్రబుల్ షూటర్ కాదని... బబుల్ షూటర్ అని విమర్శించారు. ఆయనే సమస్యను సృష్టించి, ఆ సమస్యను ఆయనే పరిష్కరించినట్టు బిల్డప్ ఇస్తారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కూడా ఎప్పుడూ కేసీఆర్, కేటీఆర్ లనే టార్గెట్ చేస్తారని... హరీశ్ రావును ఒక్క మాట కూడా అనరని అన్నారు.

**కవిత రాజీనామాలో ట్విస్ట్..!**

నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత చేసిన రాజీనామా లేఖను బుధవారం తెలంగాణ శాసన మండలి కార్యాలయంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఓఎస్డీకి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు. అయితే శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కల్వకుంట్ల కవిత ఫోన్ లో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై

# ఈసీ తాజా ఆదేశాలు

- నవంబర్‌లో పోలింగ్ అవకాశాలు
- బీఆర్ఎస్,కాంగ్రెస్,బీజేపీ మధ్య ప్రతిష్టాత్మక పోరు
- ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ విడుదల
- అభ్యంతరాల స్వీకరణకు సెప్టెంబర్ 17 వరకు గడువు
- తుది జాబితా సెప్టెంబర్ 30న ప్రకటింపు
- 3.92 లక్షల ఓటర్లు -407 పోలింగ్ స్టేషన్లు
- బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటే షెడ్యూల్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక నిర్వహణకపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు పూర్తి చేస్తోంది. అక్టోబర్ లో ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో- ఓటర్ల జాబితా పునః సమీక్ష, మార్పులు- చేర్పులు, ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు వంటి చర్యలపై దృష్టి సారించింది. నవంబర్ లో అక్టోబర్ చివరివారం/నవంబర్ లో పోలింగ్ నిర్వహించే అవకాశాలు లేకపోలేదు. భారత్ రాష్ట్ర సమితికి చెందిన శాసన సభ్యుడు

అమెరికాకు

# ఆర్థిక మాంద్యం ముప్పు

- ఆర్థిక నిపుణుడి హెచ్చరికతో ప్రపంచదేశాల్లో కలకలం
- 2008 సంక్షోభాన్ని ముందే ఊహించిన ఆర్థికవేత్త హెచ్చరిక
- మూడో వంతు రాష్ట్రాల్లో ఇప్పటికే మాంద్యం ఛాయలు
- సామాన్యులపై పెరగనున్న ధరల భారం, ఉద్యోగాలకు ముప్పు



న్యూయార్కు-నవభూమిబ్యూరో

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అమెరికా మాంద్యం అంచున ఉందని ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ 'మూడీస్' చీఫ్ ఎకనమిస్ట్ మార్క్ జాండి హెచ్చరించారు. గతంలో 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసిన ఆర్థికవేత్తలలో ఒకరైన జాండి తాజా విశ్లేషణ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. వివిధ రాష్ట్రాల ఆర్థిక గణాంకాలను పరిశీలించిన మీదట ఈ నిర్ధారణకు వచ్చినట్లు ఆయన తెలిపారు.

అమెరికా జీడీపీలో దాదాపు మూడో వంతు వాటా ఉన్న రాష్ట్రాలు ఇప్పటికే మాంద్యంలో ఉన్నాయని లేదా ఆ ప్రమాదంలోకి జారుకునే అంచున ఉన్నాయని జాండి తన విశ్లేషణలో పేర్కొన్నారు. మరో మూడో వంతు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి నిలకడగా ఉండగా, మిగిలినవి మాత్రమే వృద్ధి బాటలో ఉన్నాయని ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ మాంద్యం ప్రభావం సామాన్య అమెరికన్లపై రెండు విధాలుగా పడుతుందని ఆయన ఓ ఇంటర్వ్యూలో వివరించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు, ఆహారం, వస్తువులు, రవాణా వంటి రంగాల్లో ఉద్యోగాలకు ముప్పు తప్పదని హెచ్చరించారు.

ప్రస్తుతం 2.7 శాతంగా ఉన్న వార్షిక ద్రవ్యోల్బణం రేటు వచ్చే ఏడాది నాటికి 3 శాతం దాటి, 4 శాతానికి చేరువయ్యే ప్రమాదం ఉందని జాండి అంచనా వేశారు. "ధరలు ఇప్పటికే పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రజలు పట్టించుకోకుండా

# ఏవి చౌక? ఏవి ప్రియం?

## జీఎస్టీ కౌన్సిల్ కీలక భేటీ.. దీపావళి కానుక

- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 56వ జీఎస్టీ కౌన్సిల్ భేటీ
- పండగ సీజన్ ముందు వినియోగదారులకు 'దీపావళి గిఫ్ట్' ఇచ్చే యోచన
- 4 శ్లాబుల స్థానంలో 2 శ్లాబుల సరళమైన విధానంపై ప్రధానంగా చర్చ
- కార్లు, హోటళ్లు, నిత్యావసరాలు సహా పలు వస్తువుల ధరలు తగ్గే అవకాశం
- లగ్జరీ ఈవీలు, బొగ్గు, ఖరీదైన దుస్తులపై పెరగనున్న పన్ను భారం
- పొగాకు, లగ్జరీ కార్లపై 40 శాతం 'సిన్ ట్యాక్స్' విధించే ప్రతిపాదన

న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి

పండగ సీజన్ సమీపిస్తున్న వేళ వినియోగదారులకు, వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈరోజు జరుగుతున్న 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను రేట్లపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ గతంలో చెప్పినట్లుగా, ఈసారి 'దీపావళి గిఫ్ట్' రూపంలో పన్నుల తగ్గింపు ఉండవచ్చని మార్కెట్ వర్గాల్లో బలమైన అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఉన్న 5, 12, 18, 28 శాతం అనే నాలుగు అంచెల



పన్ను విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కేవలం రెండు శ్లాబులతో కూడిన సరళమైన విధానాన్ని తీసుకురావడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. వస్తువులు, సేవలను 'మెరిట్', 'స్టాండర్డ్' అనే రెండు కేటగిరీలుగా విభజించి,

బంగాళాఖాతంలో

# తీవ్ర అల్పపీడనం

## ఏపీలో పలు జిల్లాలకు వర్ష సూచన



అమరావతి-నవభూమి ప్రతినిది

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో రాగల 24 గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈ రోజు తీవ్ర అల్పపీడనంగా మారిందని తెలిపింది. అల్పపీడనం ఒడిశా వైపు కదులుతోందని వివరించింది. అల్పపీడనం ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

కవితకు కేఏ పాల్

# బంపర్ ఆఫర్

- బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కవిత
- ప్రజాశాంతి పార్టీలోకి రావాలని కేఏ పాల్ ఆఫర్
- బీజేపీ పంపిన బాణం కాదని రుజువు చేసుకో అని వ్యాఖ్య

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

బీఆర్ఎస్‌తో విభేదాల నేపథ్యంలో ఇవాళ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా సమర్పించిన కల్వకుంట్ల కవిత భవిష్యత్ రాజకీయాలపై ఆసక్తికర చర్చలు నడుస్తున్నాయి. ఆమె సొంత పార్టీ స్థాపించేందుకు సిద్ధమవుతున్నారని, ఇప్పటికే పేరు, ఇతర వివరాలు ఖరారు అయ్యాయని ప్రచారం సాగుతోంది. అదే సమయంలో ఇతర పార్టీల్లో చేరేది లేదని కూడా కవిత ప్రకటించడంతో ఈ వాదనకు బలం చేకూరుతోంది. ఇలాంటి సమయంలో ప్రజాశాంతి పార్టీ

## కేసీఆర్‌పై కుట్ర రేవంత్ రెడ్డి మాత్రమే కాదు... మరో ఇద్దరి హస్తం ఉంది: జగదీశ్ రెడ్డి



2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కేసీఆర్‌పై, బీఆర్ఎస్ పార్టీపై ప్రస్తుతం జరుగుతున్న కుట్రల వెనుక రేవంత్ రెడ్డి ఒక్కరే లేరని, ఆయనకు మోదీ, చంద్రబాబు



## కవితకు కేఏ పాల్ బంపర్ ఆఫర్



(1వపేజీ తరువాయి)అధ్యక్షుడు కేఏ పాల్ కవితకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయి ఆ తర్వాత పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తన పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఇవాళ ప్రకటించారు. తన పార్టీలో చేరితే త్వరలో జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోరాడుదామని ఆయన సూచించారు. నా పార్టీలో చేరి బీజేపీ వదిలిన బాణం కాదని కవిత నిరూపించుకోవాలని కేఏ పాల్ తెలిపారు. ప్రజల్లో మీపై ఆత్మవిశ్వాసం పెరగాలంటే గద్దర్ చేరిన ప్రజాశాంతిలో చేరాలని ఆమె కవితనుద్దేశించి వ్యాఖ్యానించారు. కవిత ప్రస్తుతం బీసీల కోసం పోరాడానని చెప్తున్నారని, కాబట్టి బీసీల కోసమే పనిచేస్తున్న ప్రజాశాంతి పార్టీలో చేరాలని ఆమెకు కేఏ పాల్ సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో టికెట్ ఇస్తానని, పోటీ చేసి గెలిచి తానేంటో నిరూపించుకునే అవకాశం ఆమెకు లభిస్తుందని కేఏ పాల్ తెలిపారు. బీజేపీ ఆరెస్సెస్ బ్రాహ్మణుల పార్టీ అని రామచంద్రరావు చెప్తున్నారని, కాంగ్రెస్ రెడ్ల పార్టీ అని 12 ముఖ్యమంత్రుల్ని చూస్తేనే తెలుస్తుందన్నారు. కాబట్టి బీసీల పార్టీ అయిన ప్రజాశాంతి పార్టీలో చేరి గెలిచి అందరి మనుసుల్నీ గెలుద్దామని సూచించారు.

## నవ వార్త



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఈసీ తాజా ఆదేశాలు

(1వపేజీ తరువాయి)మాగంటి గోపీనాథ్ కన్నుమూత వల్ల ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అవసరమైన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్ లో ఆయన తుదిశ్వాస విడిచారు. ఖాళీ అయిన ఈ స్థానాన్ని దక్కించుకోవడానికి మూడు పార్టీలు రంగంలోకి దిగాయి. దీన్ని నిలబెట్టుకోవడానికి బీఆర్ఎస్, తమ ఖాతాలో వేసుకోవడానికి అధికార కాంగ్రెస్ తో పాటు బీజేపీ వ్యూహ ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి. దీంతో రాజకీయ వేడి రాజుకుంది." ఈ పరిస్థితుల మధ్య తాజాగా ఈసీ ఆదేశాలు ఇచ్చింది. ఈ ఉప ఎన్నికను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులపై కసరత్తు పూర్తి చేస్తోంది. దీనికి సంబంధించిన తేదీలను వెల్లడించింది. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియ కిందటి నెల 28వ తేదీన ఆరంభమైంది. త్వరలో దీన్ని పూర్తి చేయనుంది. మంగళవారం నాడు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్ సైట్ లో ఈ ఓటర్ల జాబితా అందుబాటులోకి వచ్చింది. ఈ జాబితాకు సంబంధించి అభ్యంతరాలు, ఫిర్యాదులను ఏవైనా ఉంటే ఈ నెల 17వ తేదీ వరకు స్వీకరిస్తారు. స్వీకరించిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తవుతుంది. చివరిగా- తుది ఓటర్ల జాబితాను ఈ నెల 30వ తేదీన ప్రచురించనున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,04,288 మంది పురుషులు కాగా, 1,88,356 మంది మహిళలు. ఇతరుల కేటగిరీలో 25 మంది ఓటర్లు నమోదయ్యారు. నియోజకవర్గంలో 407 పోలింగ్ స్టేషన్లు 139 వేర్వేరు భవనాల్లో ఏర్పాటు చేయబడ్డాయి. ఇది పూర్తయిన తర్వాత షెడ్యూల్ వెలువడుతుంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటే దీన్నీ నిర్వహించనుంది ఈసీ.

## కేసీఆర్ పై కుట్ర

### రేవంత్ రెడ్డి మాత్రమే కాదు... మరో ఇద్దరి హస్తం ఉంది: జగదీశ్ రెడ్డి

(1వపేజీ తరువాయి)మద్దతు ఉందని విమర్శించారు. కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బతీయడానికి వీరు ముగ్గురూ కుట్ర పన్నుతున్నారని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌ను మానసికంగా బలహీనపరిచి, రాజకీయంగా ప్రయోజనం పొందాలన్నదే వారి ప్రధాన ఉద్దేశమని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఒకవేళ కేసీఆర్ మళ్లీ గెలిస్తే దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదుగుతారనే భయం వారిలో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ నేతల కంటే ఎక్కువగా రేవంత్ రెడ్డే కేసీఆర్ పేరును స్మరిస్తుంటారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్ పేర్లు తలుచుకుంటే కానీ ఆయనకు రాత్రి నిద్ర పట్టదని అన్నారు. చివరకు బడి పిల్లల ముందు కూడా కేసీఆర్ గురించి చిల్లర వ్యాఖ్యలు చేయడం సీఎం స్థాయికి తగదని మండిపడ్డారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. కనీసం రైతులకు అవసరమైన యూరియాను కూడా సరఫరా చేయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇదని దుయ్యబట్టారు. కేసులు, కమీషన్లంటూ రేవంత్ రెడ్డి అనవసర డ్రామాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు.

## జీఎస్టీ కౌన్సిల్ కీలక భేటీ.. ఏవి చౌక? ఏవి ప్రియం?

తదనుగుణంగా కొత్త పన్ను రేట్లను నిర్ణయించే అవకాశం ఉంది. ఈ మార్పుల వల్ల సామాన్యులు వాడే పలు వస్తువుల ధరలు గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**ఏవి చౌక కానున్నాయి?**

తాజా ప్రతిపాదనల ప్రకారం, 1200సీసీ లోపు చిన్న కార్లు, 350సీసీ లోపు మోటార్‌సైకిళ్లపై పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించవచ్చు. సబ్బులు, షాంపూలు, నూనెలు వంటి నిత్యావసరాలు 18 శాతం నుంచి 5 శాతం శ్లాబులోకి మారవచ్చు. పన్నీర్, ఐస్‌క్రీమ్, పండ్ల రసాలు, హోటల్ గదులు, సినిమా టికెట్లపై కూడా పన్ను భారం తగ్గనుంది. క్యాన్సర్ మందులపై జీఎస్టీని పూర్తిగా మినహాయించే అవకాశం ఉంది.

**ఏవి ప్రియం కానున్నాయి?**

అయితే, కొన్ని వస్తువులు, సేవల ధరలు పెరిగే సూచనలు కూడా ఉన్నాయి. రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల మధ్య ధర ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలపై జీఎస్టీని 5 శాతం నుంచి 18 శాతానికి పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. రూ. 2,500 కంటే ఎక్కువ విలువైన దుస్తులు కూడా ప్రియం కానున్నాయి. మరోవైపు, పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలా, లగ్జరీ ఆటోమొబైల్స్ వంటి వాటిపై 40 శాతం 'సిన్ ట్యాక్స్' విధించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది.ఈ మార్పుల వల్ల ప్రభుత్వానికి సుమారు రూ. 50,000 కోట్ల ఆదాయం తగ్గినా, దేశీయంగా కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ సమావేశంలో ఆమోదం పొందిన కొత్త జీఎస్టీ రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రావచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## మందు బాబులకు బిగ్ అలర్ట్.. నేటి నుంచి వైన్ షాప్స్ బంద్..

హైదరాబాద్-నవభూమి:గణేశ్ ఉత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో వైన్ షాపులు రెండు రోజులు మూసివేయాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 6వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే.. స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్ లకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు, భక్తులు ఇబ్బందులు లేకుండా నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొనేందుకు దోహదపడనున్నాయి.హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ ఇదే తరహా ఆంక్షలు అమలవుతున్నాయి. ఆదిలాబాద్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి.. అంటే రేపు ఉదయం 6 గంటల నుంచి.. 6వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్రాంతాలవారీగా వైన్ షాపులు బంద్ చేయాలని స్థానిక అధికారులు ఆదేశించారు. పెద్దపల్లితో సహా పలు జిల్లాల్లో ఈనెల 5న మద్యం దుకాణాలు మూసివేయాలని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయాలు నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు తీసుకున్నారు. గణేష్ నిమజ్జనం సమయంలో తాగి వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో.. ఈ చర్యలు రవాణా భద్రతకు కూడా తోడ్పడనున్నాయి. ఈ నెల 6, 7 తేదీలలో హైదరాబాద్ నగరంలో భారీగా వినాయక నిమజ్జనం జరగనుంది. ముఖ్యంగా ఖైరతాబాద్ బడా గణేష్ నిమజ్జనం సెప్టెంబర్ 6వ తేదీన జరగనుంది. ట్యాంక్ బండ్‌పై ఈ రెండు రోజులు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికి అనుగుణంగా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలను అమలు చేయనున్నారు.

## అమెరికాకు ఆర్థిక మాంద్యం ముప్పు

(1వపేజీ తరువాయి)ఉండలేని స్థాయిలో ఈ పెరుగుదల ఉంటుంది. ప్రతిరోజూ కొనే వస్తువుల్లోనే వారికి ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన అన్నారు. వినియోగదారుల వ్యయం, ఉద్యోగాల గణాంకాలు, తయారీ రంగం పనితీరు వంటి కీలక అంశాలు ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా పయనిస్తోందనడానికి సంకేతాలని తెలిపారు. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లు, హౌసింగ్ మార్కెట్‌లో కొనసాగుతున్న సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగాల కోతల కారణంగా ముఖ్యంగా వాషింగ్టన్ డీసీ పరిసర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని జాండి తెలిపారు. వ్యోమింగ్, మోంటానా, మిన్నెసోటా, మిసిసిపీ, కాన్సాస్, మసాచుసెట్స్ వంటి రాష్ట్రాలు మాంద్యం ప్రమాదంలో ఉన్నాయని ఆయన విశ్లేషణలో తేలింది. అయితే, దేశ జీడీపీలో ఐదోవంతు వాటా కలిగిన కాలిఫోర్నియా, న్యూయార్క్ వంటి పెద్ద రాష్ట్రాలు నిలకడగా ఉండటం వల్ల జాతీయ ఆర్థిక వ్యవస్థ ఇంకా పూర్తిగా కుప్పకూలలేదన్నారు. 2025 జులై నాటికి అమెరికా వినియోగదా రుల వ్యయం గత ఏడాదితో పోలిస్తే ఏమాత్రం పెరగకపోవడం, 2008-09 సంక్షోభం తర్వాత ఇంతటి బలహీనమైన పరిస్థితిని చూడలేదన్నారు.

## ఆ ఇద్దరిపైనే కవిత గురి.. ఏమై ఉంటుంది?



హైదరాబాద్-నవభూమి: తెలంగాణ రాజకీయాల్లో అంతర్గత విభేదాలు మళ్లీ తెరమీదకు వచ్చాయి. మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన సంచలన వ్యాఖ్యలు పార్టీ భవిష్యత్తుపైనే కాకుండా, కుటుంబ రాజకీయాలపైనా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. తాజాగా కల్వకుంట్ల కవిత మరోసారి తన దృష్టిని హరీశ్ రావు, సంతోష్ వైపు మళ్లించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారి తీసింది. గతంలో బీఆర్ఎస్ ను వీడిన కొండా సురేఖ హరీశ్ రావుపై చేసిన ఆరోపణలే ప్రస్తుతం కవిత కూడా చేయడం గమనార్హం. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, దానికి హరీష్ రావు ప్రత్యక్షంగా సంబంధముంటూ చేసిన ఆరోపణలు కేవలం వ్యక్తిగత స్థాయిలో కాకుండా, అటు బీఆర్ఎస్ పార్టీని ఇరకాటంలో పడేశాయి.. ఈ ఆరోపణలు అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయుధంగా మారాయనడంలో ఎలాంటి సందేహం లేదు. పైగా, ఆయన "ట్రబుల్ షూటర్ కాదు,.. బబుల్ షూటర్" అంటూ కవిత చేసిన వ్యాఖ్యలు, ఒకరిపై ఒకరు చేసే ఆరోపణలు ఎలాంటి స్థాయికి చేరుకున్నాయో స్పష్టంగా చూపిస్తోంది. అయితే ఈసారి కవిత కేవలం హరీష్ రావుతో ఆగలేదు. తన సొంత అన్న కేటీఆర్‌ను కూడా లక్ష్యంగా చేసుకోవడం పార్టీ వర్గాలను మరింత కుదిపేసింది. తనపై జరుగుతున్న కుట్రను కేటీఆర్ పట్టించుకోలేదని, 103 రోజులపాటు మాట్లాడకపోవడం ద్వారా నిర్లక్ష్యం చూపారని ఆమె ఆరోపించారు. ఇది కేవలం వ్యక్తిగత సంబంధాల సమస్య కాదుబీ పార్టీ నాయకత్వంలో ఉన్న లోతైన విభేదాలకు ప్రతిబింబం. తెలంగాణ సీఎంపైనా.. ఈ వాదనల్లో రేవంత్ రెడ్డి పేరు వినిపించడం మాత్రం రాజకీయ విశ్లేషకులను మరింత ఆలోచనలో పడేస్తోంది. అసలైన ప్రతిపక్ష నేతను ఎదిరించాల్సిన సమయంలో, కవిత మాత్రం "హరీష్ రావు రేవంత్‌కు ముందే లొంగిపోయాడు" అనే మాటతో చర్చల దిశను మార్చేశారు. దీని వెనుక నిజంగా ఏదైనా అవగాహన ఉందా, లేక ఇది కవిత వ్యూహాత్మక వ్యాఖ్యలు మాత్రమేనా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. సస్పెండ్ చేసిన అదే పంథా.. ఇదిలావుంటే, కవిత పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యాక కూడా తన పంథాను మార్చుకోకపోవడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆమె పోరాటం కేవలం తన స్థానాన్ని కాపాడుకోవడానికేనా, లేక పార్టీ భవిష్యత్తుపైనా అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. బయటపడ్డ బలహీనతలు మొత్తానికి, కవిత ఆరోపణలు బీఆర్ఎస్‌లోని అంతర్గత విభేదాలను పొడసూపుతున్నాయి. కుటుంబంలోనూ, పార్టీలోనూ ఎవరి మీద విశ్వాసం ఉంచాలో కేసీఆర్‌కు కూడా సవాల్‌గా మారుతోంది. అయితే ఆసక్తికరమేమిటంటే ‚ కవిత బాణాలు ఎప్పుడూ హరీష్ , సంతోష్ రావు వైపే దూసుకెళుతున్నాయి. ఇది కేవలం యాదృచ్ఛికమా, లేక లోతైన వ్యూహాత్మక గణాంకమా అనేది రాబోయే రోజులు నిర్ణయించనున్నాయి.

## కవితకు హరీష్ రావు కౌంటర్ ఇస్తాడా? లేదా?



హైదరాబాద్-నవభూమి:తనను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో కల్వకుంట్ల కవిత బరెస్ట్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములా టలను బయటపెట్టారు. హరీష్ రావు, జీ. సంతోష్ రావులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, బంతిని ఆయన కోర్టులోకి విసిరారు. ప్రస్తుతం హరీష్ రావు దీనిపై ఇంకా స్పందించలేదు. ఇది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. - కవిత చేసిన ప్రధాన ఆరోపణలు కవిత, కేసీఆర్, కేటీఆర్ మధ్య విభేదాలు సృష్టించడానికి హరీష్ రావు ప్రయత్నిస్తున్నారని కవిత ఆరోపించారు. హరీష్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య అంతర్గత ఒప్పందం ఉందని, దాని వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం హరీష్ రావుపై ఎలాంటి విచారణలు చేయట్లేదని కవిత పేర్కొన్నారు. హరీష్, సంతోష్ ల అవినీతి కారణంగానే కేసీఆర్ ప్రస్తుతం సీబీఐ విచారణలను ఎదుర్కొంటున్నారని అన్నారు. హరీష్ రావు పార్టీకి సమస్యలను పరిష్కరించే వ్యక్తి కాదని, సమస్యలను సృష్టించే వ్యక్తి అని ఎద్దేవా చేశారు. గతంలో కూడా కేసీఆర్ కు అడ్డుపడ్డారని, కీలక నేతలు పార్టీని వీడటానికి కారణమయ్యారని ఆరోపించారు. 2018 ఎన్నికల్లో పార్టీ గెలుస్తుందని నమ్మకం లేక 25 మందికి పైగా ఎమ్మెల్యేలకు నిధులు ఇచ్చి తన నియంత్రణలో ఉంచుకున్నారని కవిత ఆరోపించారు. హరీష్ రావు వ్యూహాత్మక మౌనం ప్రస్తుతం హరీష్ రావు మౌనంగా ఉండటం చర్చకు దారితీస్తోంది. దీని వెనుక కొన్ని కారణాలు ఉండొచ్చని పార్టీలో చర్చ సాగుతోంది. హరీష్ రావు కవిత ఆరోపణలకు సమాధానం ఇస్తే, పార్టీలో విభేదాలు మరింతగా బయట పడతాయి. ఇది పార్టీని మరింత బలహీనపరుస్తుంది. అందుకే హరీష్ రావు ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిలో ఉండొచ్చు. కవిత ఆరోపణలపై పార్టీ అధినాయకత్వం లేదా కేసీఆర్ ఎలా స్పందిస్తారో చూడాలనుకోవచ్చు. కవిత చేసిన ఆరోపణలు తీవ్రమైనవి. వాటికి సమాధానం చెప్పడానికి సరైన ఆధారాలు అవసరం. ఒకవేళ వాటికి సరైన సమాధానం ఇవ్వలేకపోతే, ఆరోపణలు నిజమని ప్రజలు నమ్మే అవకాశం ఉంది. ఇప్పుడు బంతి హరీష్ రావు కోర్టులో ఉంది. ఆయన స్పందిస్తారా లేదా అన్నది చూడాలి. ఒకవేళ హరీష్ రావు మీడియా ముందుకు వచ్చి కవిత ఆరోపణలను ఖండిస్తే, ఇది బీఆర్ఎస్ పార్టీలో బహిరంగ పోరుకు దారితీయవచ్చు. ఈ పరిణామాలు పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. హరీష్ రావు మౌనంగా ఉంటే, కవిత ఆరోపణలు నిజమేనన్న అభిప్రాయం బలపడే అవకాశం ఉంది. ఇది హరీష్ రావు రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపవచ్చు. ఈ పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీలో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. హరీష్ రావు తన మౌనాన్ని వీడుతారా లేక వ్యూహాత్మకంగా వేచి చూస్తారా అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

## విదేశీయులకు దేశంలోకి నో ఎంట్రీ

(1వపేజీ తరువాయి)సవరణ చట్టం (2025) ప్రకారం ప్రత్యేక హోల్డింగ్ సెంటర్లు లేదా డిటెన్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో సూచించింది. అలాగే, సరిహద్దుల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేయాలని హోంశాఖ ఆదేశాలు వెలువరించింది. అక్రమ వలసదారులు, చొరబాటుదారులను నిరోధించేందుకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, తీరంలో కోస్ట్ గార్డ్ దళాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించింది. ఇదే సమయంలో ఆఫ్ఘనిస్థాన్, చైనా, పాకిస్థాన్ పౌరులు దేశంలోని కొన్ని సున్నితమైన సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించడం నిషేధించింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని ప్రదేశాలకు వారు వెళ్లకుండా చూడాలని తెలిపింది.అంతేకాదు, భారత్‌లో ఉద్యోగం చేయడానికి వీసా, సరైన పత్రాలు ఉన్న విదేశీయులు కూడా స్థానిక అధికారుల అనుమతి లేకుండా విద్యుత్, జల, పెట్రోలియం వంటి ముఖ్యమైన రంగాల్లోని ప్రయివేట్ సంస్థల్లో చేరకూడదని కొత్త షరతు విధించింది. ట్రెక్కింగ్ వంటి అడ్వెంచర్లు చేపట్టాలంటే కూడా కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేసింది.ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది పంద్రాగస్టు ప్రసంగంలో అక్రమ వలసదారులకు అడ్డుకట్ట వేసేలా హైపవర్డ్ డెమొగ్రఫీ మిషన్‌ను తీసుకురానున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే కేంద్ర హోం శాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్ చట్టం 2025ను పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏప్రిల్ 4న సమ్మతి తెలపడంతో చట్టంగా మారింది.ఈ బిల్లుపై చర్చ సందర్భంగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. పర్యాటకం, విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపార ప్రయోజనాల కోసం భారతదేశానికి రావాలనుకునే వారిని స్వాగతించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే శరణార్థులకు ఇదేమీ ధర్మసత్రం కాదని అన్నారు. భారత్‌కు రావడానికి లేదా ఉండటానికి లేదా నిష్క్రమించడానికి నకిలీ పాస్‌పోర్ట్ లేదా వీసాను ఉపయోగించిన వారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష,రూ. 10 లక్షల వరకు జరిమానా విధిస్తారు.

## మీ గొడవల్లోకి నన్ను లాగకండి

(1వపేజీ తరువాయి)నిర్ణయాత్మకమవుతుందన్నారు. ప్రకృతి అనేది ఎప్పుడూ సమానంగా ఉండదు. ఎవరి మీదైనా శిక్ష విధించగల శక్తి ప్రకృతికి ఉంది. మీరు ఎంతకాలం వంచన, కుతంత్రాలతో ముందుకు సాగినా చివరికి న్యాయం గెలుస్తుందని స్పష్టం చేశారు. ఒక పార్టీని కూలదోయడానికి చేసిన కుట్రలు తాత్కాలికంగా ఫలితాలిచ్చినా, శాశ్వతంగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతాయి. ప్రజాస్వామ్యంలో నమ్మకాన్ని నిలబెట్టుకోలేని రాజకీయ శక్తులు ఎప్పటికీ బతకలేవన్నారు. అలాగే పాలమూరు జిల్లా ప్రాధాన్యం గురించి ప్రస్తావించారు. పాలమూరు జిల్లకు పక్కనే కృష్ణా నది పారుతున్నా.. ఈ ప్రాంతం ఎన్నో ఏళ్లుగా తాగునీరు, సాగునీటి సమస్యలతో బాధపడింది. గత ప్రభుత్వాలు ఎలాంటి కృషి చేయలేదు. అయితే ఇప్పుడు ప్రాజెక్టులకు గ్రీన్ చానల్ ద్వారా నిధులు కేటాయిస్తున్నాం" అని తెలిపారు. కొడంగల నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, సంగంబండ, బీమా వంటి పనులను పూర్తి చేయడమే తన లక్ష్యమని ఆయన అన్నారు. "భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందిస్తాం. ప్రతి రైతుతో నేరుగా మాట్లాడి వారికి సరైన ధర అందేలా చర్యలు తీసుకుంటాం. ఎవరికీ అన్యాయం జరగదు" అని హామీ ఇచ్చారు. పాలమూరు జిల్లా అభివృద్ధికి "ఇరిగేషన్ అండ్ ఎడ్యుకేషనే మై ఫస్ట్ ప్రయారిటీ' అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా పేర్కొన్నారు. ప్రాంతీయ సమస్యలపై మాట్లాడుతూ.. గతంలో మన వెనుకబాటు, పేదరికాన్ని ఒక ఎగ్జిబిషన్‌లా చూపించారు. విదేశీ ప్రతినిధులను తీసుకొచ్చి పాలమూరు దుస్థితిని చూపేవారు. కానీ భవిష్యత్‌లో మన అభివృద్ధిని చూసేందుకు వారు రావాల్సి ఉంటుంది. రాష్ట్రానికి వచ్చే ప్రతి అభివృద్ధి అవకాశంలో మొదటి ముద్ద పాలమూరుకే పెడతాం. ఇది నా నిబద్ధత అని స్పష్టం చేశారు.ప్రతిపక్షాలు ప్రాజెక్టులను అడ్డుకోవాలని చేస్తున్న తప్పుడు ప్రచారాలను మీడియా ఖండించాలని కోరారు. ఈ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు తర్వాత దాదాపు 75 ఏళ్లకు ముఖ్యమంత్రి వచ్చాడు. కాబట్టి ఇది చారిత్రాత్మక అవకాశం. మనం ఇప్పుడు వెనుకడుగు వేస్తే ఇక ఎప్పుడూ అవకాశమే ఉండదు" అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్‌కు కవిత రాజీనామా

(1వపేజీ తరువాయి)మాట్లాడారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. అయితే తాను అందుబాటులో లేనని, రేపు మరోసారి మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని గుత్తా తెలిపారు. తాజాగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అయితే రాజీనామా లేఖను బుధవారం తెలంగాణ శాసన మండలి కార్యాలయంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఓఎస్డీకి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు. ఈ క్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కల్వకుంట్ల కవిత ఫోన్ లో సంభాషించారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. అయితే తాను అందుబాటులో లేనని రేపు మరోసారి ఫోన్ లో మాట్లాడి రాజీనామాపై నిర్ణయం తీసుకుంటానని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపినట్లు సమాచారం. ఇక బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను తెలంగాణ భవన్ లో పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డికి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు. ఈ లేఖను స్వీకరించిన భవన్ సెక్రటరీ రిసీవ్డ్ కాపీ అందజేశారు. మరోవైపు త్వరలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు జరగనున్నాయి. అయితే కవిత ఈ ఎన్నికల్లో పోటీ చేసే ఛాన్స్ ఉందని ప్రచారం జరుగుతోంది. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అనారోగ్య కారణాల వల్ల మృతి చెందడంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. అలాగే కవిత కొత్త పార్టీ పెట్టనుందని ఇప్పటికే ఆమె సన్నిహితులు తెలిపారు. తెలంగాణ జాగృతి, తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి (బీఆర్ఎస్ పాత పార్టీ పేరు టీఆర్ఎస్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు స్పష్టం చేశారు.

### తెలంగాణలో సెప్టెంబర్ 6న ప్రభుత్వ సెలవు

హైదరాబాద్-నవభూమి: తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో ఈ నెల 6న ప్రభుత్వం సెలవు ప్రకటించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, కార్యాలయాలకు ఈ సెలవు వర్తించనుంది. సెప్టెంబర్ 6న సెలవు కారణంగా అక్టోబర్ 11వ తేదీ రెండో శనివారం రోజున పని చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

# కవిత రాజీనామా వెనుక అసలు కారణం ఇదే..



హైదరాబాద్-నవభూమి: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రాజీనామా తెలంగాణ రాజకీయాలను కుదిపేశాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటి నుంచి తెలంగాణ జాగృతి పేరిట కవిత చాలా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో బతుకమ్మ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆ తర్వాత తెలంగాణ ఏర్పాటు వివిధ హోదాల్లో ప్రభుత్వంలో, పార్టీలో కవిత వివిధ హోదాల్లో పని చేశారు. దాదాపు రెండు టర్మ్ లు ఆమె కొనసాగారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ తర్వాత ఆమె ఆమెపై పార్టీలో ప్రజల్లో ప్రభ తగ్గడం మొదలైంది. ఇదంతా అందరికీ తెలిసిందే. అయితే ఇటీవల ఆమె కామెంట్లకు విసుగుచెందిన బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. దీంతో ఆమె బుధవారం (సెప్టెంబర్ 3) మీడియా ముందుకు వచ్చింది. పార్టీలో జరుగుతున్న విషయాలను వివరించింది. ప్రెస్ మీట్ లో ప్రధానంగా హరీష్ రావు, సంతోష్ రావుపైనే విమర్శలు గుప్పించింది. పార్టీలో మొదటి నుంచి తనకు తన తండ్రి, అన్నకు మధ్య వీరే విభేదాలు సృష్టించారని మండిపడింది. హరీశ్ రావు పార్టీని నాశనం చేసేందుకే పని చేశారని, ఎప్పుడూ పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు పని చేయలేదని ఆరోపించింది. రేవంత్ రెడ్డితో అంటకాగుతూ తన తండ్రిని పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. దీంతో పాటు తన ఎమ్మెల్సీ పదవికి, తన పార్టీ అయిన బీఆర్ఎస్ సాధారణ సభ్యత్వానికి సైతం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.బీసీసీఐ ఇదేం పని? కవిత రాజీనామా వెనుక కథ.. ఢిల్లీ లిక్కర్ స్కాం తర్వాత కవిత ద్వారా పార్టీకి చెడ్డపేరు రావడం మొదలైంది. ఆమె జైలులో ఉన్న సమయంలో తండ్రి, అన్న పెద్దగా పట్టించుకోలేదని కారణం ప్రజల మద్దతు పోతుందని భయం అంటూ కొన్ని మీడియా సంస్థలు కథనాలు సైతం వెలువరించాయి. ఈ నేపథ్యంలో ఆమె అప్పటి నుంచి పార్టీపై అక్కసుతో ఉందని పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది. ఆమె బయటకు వచ్చిన తర్వాత తనకు పార్టీలో ముఖ్యమైన స్థానం ఇవ్వడం లేదని, తనను ఎవ్వరూ పట్టించుకోవడం లేదని చాలా సార్లు సన్నిహితుల తో తెలిపినట్లు పార్టీ వర్గాల నుంచి లీకులు వచ్చాయి. అయితే కవిత పార్టీలో కొనసాగితే మరిన్ని చీలికలు వచ్చే ప్రమాదం ఉందని అందుకే వీలైనంత తొందరగా సస్పెండ్ చేయాలని అధినాయకత్వం యోచించినట్లు అప్పట్లో చాలా లీకులు వచ్చాయి. దీనిపై గతంలోనే ఎంపీ రఘునందన్ లాంటి వారు కామెంట్లు కూడా చేశారు. కవిత పార్టీ నుంచి బయటకు రావడం ఖాయమని అన్నారు. ప్రముఖంగా వారి పేర్లే.. కుటుంబ పార్టీలో అంతర్గత విభేదాలపై ఇప్పుడు రాష్ట్రంలో చర్చ మొదలైంది. ఈ రోజు (బుధవారం, సెప్టెంబర్ 3) కవిత ప్రెస్ మీట్ లో తన కజిన్ సంతోష్ రావు, బావ హరీష్ రావులనే ఆమె టార్గెట్ చేశారు. హరీష్ రావు మొదటి నుంచి పార్టీని నాశనం చేసేందుకు చూశారని, హుజురాబాద్ ఎన్నికల ఓటమికి కూడా ఆయనే కారణం అంటూ.. ఇక సంతోష్ రావు హరితహారంలో కోట్లాది రూపాయలను నాశనం చేశారని చెప్పారు. వీరిద్దరితో జాగ్రత్తగా ఉండాలని తండ్రిని, అన్నను హెచ్చరించి మరీ రాజీనామా చేశారు. కాలేశ్వరం కథ మొత్తం కేసీఆర్ మెడకు చుట్టింది కూడా హరీష్ రావు అన్నారు. .కవితకు రేవంత్ కౌంటర్ తెలంగాణ జాగృతి పేరుతో తెలంగాణ రాజకీయాల్లో దాదాప పదేళ్లకు పైగా ప్రస్థానాన్ని కొనసాగించిన కల్వకుంట్ల కవిత సీనియర్ నాయకురాలిగా గుర్తింపు సంపాదించుకున్నారు. అనర్గళంగా ఇంగ్లిష్ మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ పార్టీలో కీలక పదవుల్లో కొనసాగారు. అయితే ఇటీవల పరిస్థితుల నేపథ్యంలో రాజీనామాలు తప్పలేదు. అయితే ఏ పార్టీలోకి వెళ్తారని జర్నలిస్టులు ప్రశ్నించగా.. కాంగ్రెస్ బీజేపీలోకి వెళ్లనని చెప్పారు. అయితే కవిత దశ, దిశ ఎటువైపు ఉంటుందని తెలంగాణ ప్రజలు చర్చించుకుంటున్నారు. పార్టీ, ఇతర సీనియర్ నాయకులు ఏమంటున్నారంటే...? ప్రస్తుతం పార్టీ నుంచి తొలగించిన కవిత ముందే ప్రకటించినట్లు బీజేపీ, కాంగ్రెస్ వైపు వెళ్లదని చెప్తున్నారు. అయితే తెలంగాణలో మరో పార్టీ పెడితే మనుగడ సాధించలేమని ఆమెకు తెలిసిందే. గతంలో షర్మిల పార్టీ సమయంలో ఆమె ఇతే విషయం చెప్పుకచ్చారు. కాబట్టి ఆమె మళ్లీ బీఆర్ఎస్ లోకే వెళ్తుందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పార్టీలోని కీలక నాయకులపై విషం చిమ్మిన కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ వేడి తగ్గిన తర్వాత ఆమె తిరిగి మళ్లీ అదే పార్టీలోకి వెళ్లే అవకాశం ఉందని చర్చ నడుస్తోంది. ప్రస్తుతం స్థానిక ఎన్నికలు వస్తున్నాయి. కాబట్టి పార్టీలో కుమ్ములాటలు లేకుండా చూడాలనే ఆమెను బయటకు పంపించారని, ఆ తర్వాత మళ్లీ చేర్చుకుంటారని కూడా కామెంట్లు వినిపిస్తున్నాయి. దేశాన్ని కుదిపేసిన ఢిల్లీ లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న ఆమెను కాంగ్రెస్, బీజేపీ చేరదీసినా పెద్దగా పట్టించుకోవని మళ్లీ ఆమె బీఆర్ఎస్ లోనే కొనసాగే ఛాన్స్ ఎక్కువగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు సైతం చెప్తున్నారు.

## చదువుకు వయసు అడ్డం కాదుగా.. 72 ఏళ్ల వయస్సులో..



**చెన్నై-నవభూమి:**చదువుకు వయస్సు అడ్డంకి కాదు, ఏ వయస్సులోనైనా ఆసక్తి, పట్టుదల ఉంటే చదువుకోవచ్చని మైలాడుదురైకి చెందిన ఓ వృద్ధుడు ఎలుగెత్తి చాటుతున్నారు. కడలూరు జిల్లా వడలూరు ప్రాంతంలో సెల్వమణి (72) అనే వృద్ధుడు నివసిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. వీరందరికి పెళ్లిళ్లు జరిగాయి. ప్రస్తుతం భార్యతోపాటు ఉంటున్నారు. ఐటీఐ చదివిన సెల్వమణి నైవేలి బొగ్గు సొరంగంలో పని చేస్తున్నప్పుడు ఎంకామ్, ఎంబీఏ పాసయ్యారు. రిటైర్ అయి పదేళ్లు దాటినా ఆయనకు చదువుపై ఆసక్తి ఏ మాత్రం తగ్గలేదు. మైలాడుదురై జిల్లా కొళ్లిడంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులో చేరి ప్రస్తుతం సెకెండ్ ఇయర్ చదువుతున్నారు. విద్యార్థులతో సమానంగా యూనిఫామ్ ధరించి పుస్తకాల బ్యాగ్ పట్టుకుని రోజూ కాలేజీకి వెళుతున్నారు. విద్యార్థులంతా ఆయనను 'తాతయ్యా' అని ఆప్యాయంగా పిలుస్తున్నారు.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ | గురువారం | 04 । సెప్టెంబర్ । 2025


## మరో యువతితో భర్త వివాహేతర సంబంధం.. వరకట్న వేధింపులకు మహిళ బలి



**బెంగళూరు-నవభూమి:**వరకట్న వేధింపులతో ఆత్మహత్య ఘటనలు ఇటీవలే పెరిగిపోయాయి. అధిక కట్నం కోసం వేధింపులు తాళలేక ఇటీవలే నోయిడా, బెంగళూరు నగరాల్లో గర్భిణులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా అలాంటి ఘటనే మరొకటి చోటు చేసుకుంది. దౌరి వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది . ఈ ఘటన కర్ణాటక రాజధాని బెంగళూరు లో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న పూజశ్రీ అనే 28 ఏండ్ల యువతికి నందీష్ అనే వ్యక్తితో మూడేండ్ల క్రితం వివాహమైంది. వారికి ఓ పాప కూడా ఉంది. వీరు బగలగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవనగర్‌లో నివాసం ఉంటున్నారు. అయితే, పెళ్లైన తర్వాత నుంచి భర్త అధిక కట్నం కోసం పూజశ్రీని వేధింపులకు గురి చేస్తున్నాడు. భర్త వేధింపులు తాళలేక పూజశ్రీ ఈ నెల 1వ తేదీన ఇంట్లో బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విక్టోరియా ఆస్పత్రికి తరలించారు.మరోవైపు నందీష్ వేరే యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని పూజశ్రీ తల్లి ఆరోపించింది. తన బిడ్డను నిరంతరం హింసించేవాడని ఆవేదన వ్యక్తం చేసింది. 'రూ.30 లక్షలు అప్పు చేసి బిడ్డకు పెళ్లి చేశాను. అప్పటి నుంచి పూజను నందీష్ హింసించేవాడు. అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేశాడు. భర్త వేధింపులు తాళలేక పూజ పుట్టింటికి వచ్చింది. చాలాసార్లు నచ్చజెప్పే ప్రయత్నం చేశాం. ఆ తర్వాత ఓ రోజు పూజను జాగ్రత్తగా చూసుకుంటానని పోలీసు స్టేషన్‌లో హామీ ఇచ్చాడు. అయినా వేధింపులు ఆగలేదు. పూజ మరణించిన రోజు ఉదయం 7:15 గంటల ప్రాంతంలో ఆమెను మా ఇంటి నుంచి తీసుకెళ్లాడు. 8:20 గంటలకు ఆత్మహత్య చేసుకుందని ఫోన్ చేసి చెప్పాడు. ఇదంతా అతని అక్రమ సంబంధం వల్లే జరిగింది. వాళ్లు నాబిడ్డను చంపేశారు' అంటూ పూజ తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది.పూజశ్రీ అమ్మమ్మ మాట్లాడుతూ.. 'నందీష్ మా కుటుంబాన్ని మోసం చేసి పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి తర్వాత ఇల్లు కావాలని డిమాండ్ చేశాడు. మేము బంగారు ఆభరణాలు ఇచ్చాము. కానీ పూజను నిత్యం హింసించేవాడు. అతనికి వివాహేతర సంబంధం కూడా ఉంది' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు బగలగుంట పోలీసులు వరకట్న వేధింపుల ఆరోపణల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన టీఆర్ఎఫ్‌కు నిధులు అందించినది వీరే



**బెంగళూరు-నవభూమి:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టుల ప్రాణాలు తీసిన లష్కరే ముసుగు సంస్థ 'ది రెసిస్టెంట్ ఫ్రంట్' కు ఏయే దేశాల నుంచి నిధులు అందుతున్నాయనే కీలక వివరాలను ఎన్ఐఏ తాజాగా వెలికితీసింది. పాకిస్థాన్, గల్ఫ్, మలేసియా నుంచి టీఆర్ఎఫ్‌కు నిధులు అందినట్టు ఎన్ఐఏ గుర్తించింది.లష్కరే తొయిబా ముసుగు సంస్థగా టీఆర్ఎఫ్ ఉగ్రసంస్థను పాకిస్థాన్ ఏర్పాటు చేసింది. దీనిని జమ్మూకశ్మీర్‌లో వేళ్లూనుకునేలా చేసి స్థానిక సంస్థగా ప్రాజెక్ట్ చేసింది. తద్వారా జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు కొనసాగించడం, ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) స్క్రూటినీలోకి రాకుండా చూసుకోవడం పాక్ వ్యూహంగా ఉన్నట్టు ఎన్ఐఏ పేర్కొంది.నంతరం టీఆర్ఎఫ్ ఆపరేషన్‌పై ఎన్ఐఏ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ క్రమంలో ముఖ్యంగా మలేసియా, గల్ఫ్ దేశాల నుంచి టీఆర్ఎఫ్‌కు నిధులు అందినట్టు గుర్తించింది. ఇందుకోసం 463 ఫోన్ కాల్స్‌ను విశ్లేషించింది. మలేసియాకు చెందిన యాసిర్ హయత్ అనే వ్యక్తి టీఆర్ఎఫ్‌కు రూ.9 లక్షలు ఇచ్చినట్టు గుర్తించింది. ఇతనికి లష్కరే మోస్ట్ వాంటెండ్ ఉగ్రవాది సాజిద్ మిర్ నెట్‌వర్క్‌కు చెందిన సంస్థలతో సంబంధం ఉందని వెలికితీసింది. ఫండ్స్ ఎరేంజ్ చేసేందుకు హయత్ పలుమార్లు మలేసియా వెళ్లినట్టు గుర్తించింది. ఇటీవల శ్రీనగర్, హంద్వార్‌లో జరిగిన దాడుల్లో టీఆర్ఎఫ్ విదేశీ నిధులకు సంబంబంధించిన కీలక పత్రాలు బయటకు రావడంతో టీఆర్ఎఫ్‌కు అందుతున్న టెర్రర్ ఫండింగ్‌పై మరింత లోతుగా విశ్లేషిస్తోంది.ఎన్ఐఏ వెలికితీసిన తాజా సమాచారంతో పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్ట్‌లో పెట్టాలని భారత్ బలంగా వాదించే అవకాశాలున్నాయి. 2018లో పాకిస్థాన్‌ను ఎఫ్ఏటీఎఫ్ గ్రేలిస్ట్‌లో చేర్చగా.. 2022లో ఎఫ్ఏటీఎఫ్ యాక్షన్ ప్లాన్ అమలు చేయడం ద్వారా గ్రేలిస్ట్ నుంచి పాక్ బయటపడిది. దీనిపై భారత్ గట్టి అభ్యంతరం తెలియజేసింది.

## యాంటీ నక్సల్స్ ఆపరేషన్లలో జవాన్ల సాహసాలను సువర్ణాక్షరాలతో లిఖించాలి

**న్యూఢిల్లీ-నవభూమి:** ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ లో భద్రతా బలగాల సాహసాలను కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ప్రశంసించారు. నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్లలో భద్రతా బలగాల సాహసాలను చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలని ప్రశంసించారు. హెూం మంత్రి బుధవారంనాడు తన నివాసంలో సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, డీఆర్‌జీ, కోబ్రా బెటాలియన్లను, వారి కుటుంబ సభ్యులను సన్మానించారు.అనంతరం అమిత్‌షా ఈ విషయాన్ని సోషల్ మీడియా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో నక్సల్స్‌తో పోరాడిన సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, డీఆర్‌జీ, కోబ్రా జవాన్లను వారి కుటుంబ సభ్యులతో సహా కలుసుకుని సన్మానించినట్టు ఆ పోస్ట్‌లో అమిత్‌షా తెలిపారు.యాంటి-నక్సల్ ఆపరేషన్లలో అతిపెద్దదైన కర్రెగుట్ట ఆపరేషన్ 19 రోజుల పాటు ఆగకుండా సాగిందని, సాహస జవాన్లు ఒక్కరుకూడా గాయకుండా 30 మందికి పైగా నక్సల్స్‌ను మట్టుబెట్టారని, నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్లలో బలగాల సాహసాలను చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలని అన్నారు. నక్సలైట్లు లొంగిపోవడం కానీ, పట్టుబడటం కానీ, తుదముట్టించేంత వరకూ కానీ మోదీ ప్రభుత్వం విశ్రాంతి తీసుకోరని, మోదీ నాయకత్వంలో నక్సల్స్ నుంచి దేశానికి విముక్తి కల్పిస్తామని చెప్పారు. యాంటీ నక్సల్స్ ఆపరేషన్ కారణంగా పశుపతినాథ్ నుంచి తిరుపతి ప్రాంతం వరకూ 6.5 కోట్ల మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఈ ఆపరేషన్లలో గాయపడిన భద్రతా బలగాల జీవితాలు సాఫీగా సాగేందుకు మోదీ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

# ఇంద్రాణీ ముఖర్జి కొడుకులు రూ.7 కోట్లు, బంగారం దొంగతనం చేశారు



**న్యూఢిల్లీ-నవభూమి:**షీనా బోరా హత్య కేసు ఏళ్ల తరబడి సాగుతూనే ఉంది. ఈకేసులో ఇంద్రాణీ ముఖర్జియా, ఆమె మాజీ భర్త సంజీవ్ ఖన్నా నిందితులుగా ఉన్నారు. ఇక ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న ఇంద్రాణీ ముఖర్జియా కుమార్తె విధి ముఖర్జియా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో భాగంగా తాను సీబీఐ ఎదుట ఎలాంటి వాంగ్మూలం ఇవ్వలేదని ఆమె వెల్లడించారు. అంతేకాక ప్రస్తుతం సీబీఐ చూపుతున్న వాంగ్మూలాలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. విచారణ అధికారులు తన చేత కొన్ని పేపర్ల మీద బలవంతంగా సంతకాలు పెట్టించుకున్నారని విధి ఆరోపించారు. అవన్నీ పూర్తిగా ఫోర్జరీ చేసినవని తెలిపారు. అలానే ఈ కేసును వాదించుకోవడానికి ప్రస్తుతం ఇంద్రాణీ వద్ద రూపాయి కూడా లేదంటూ విధి ముఖర్జియా తెలిపారు.ప్రస్తుతం ఇంద్రాణీ ముఖర్జియా వద్ద రూపాయి కూడా లేదని.. పీటర్ ముఖర్జీ కొడుకులు రాహుల్, రాబిన్ ఆమె డబ్బులు, నగలు దొంగిలించారని విధి చెప్పుకొచ్చింది. సుమారు ఏడు కోట్ల రూపాయలు దొంగతనం చేశారని వెల్లడించింది. తాజాగా విధి ముఖర్జీ సీబీఐ ప్రత్యేక కోర్టులో సాక్షిగా వాంగ్మూలం ఇచ్చింది. జడ్జి జె.పి. దారేకర్ ముందు ఆమె మాట్లాడింది. ఈ సందర్భంగా విధి ముఖర్జియా మాట్లాడుతూ.. సీబీఐ ఛార్జ్ షీట్‌లో ఉన్న పత్రాలు కొన్ని నకిలీవి, వాటిని తయారు చేశారని ఆమె కోర్టుకు తెలిపింది. అలానే సీబీఐ అధికారులు చూపించిన కొన్ని డాక్యుమెంట్లు నిజమైనవి కావని ఆమె చెప్పింది. కావాలనే ఇంద్రాణీ ముఖర్జియాను ఈ కేసులో ఇరికించారని ఆమె ఆరోపించింది. అలానే ఇంద్రాణీ ముఖర్జియాను అరెస్ట్ చేసినప్పుడు తాను మైనర్ అని.. ఆ ఘటనను ఇంకా మరిచిపోలేకపోతున్నా అని విధి ముఖర్జియా చెప్పుకొచ్చింది. అలానే ఈ కేసు విచారణ నిమిత్తం తాను ముంబై పోలీసుల ఎదుట హజరై.. సాక్షిగా ఉన్న విషయాన్ని ఆమె అంగీకరించింది. అయితే ప్రస్తుతం సీబీఐ అధికారులు చూపుతున్న వాంగ్మూలాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవన్నీ ఫోర్జరీ చేసినవి అని ఆమె కొట్టి పారేసింది. తన బయోలాజికల్ తల్లిదండ్రులైన ఇంద్రాణీ, సంజీవ్‌ను కావాలనే ఈ కేసులో ఇరికించాలనే కొందరు ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.అలానే షీనా బోరాతో తన పరిచయాన్ని ఈ సందర్భంగా విధి ముఖర్జియా గుర్తు చేసుకున్నారు. షీనా తనను తాను ఇంద్రాణీ ముఖర్జియాకు సోదరిగా తనకు పరిచయం చేసుకుందని విధి గుర్తు చేసుకుంది. అలానే ప్రారంభంలో ఇంద్రాణి, షీనా చాలా బాగా ఉండేవారని.. కానీ పీటర్ కొడుకు రాహుల్ ముంబైలోని వర్లీ ఫ్లాట్‌కు రావడం మొదలైన తర్వాతే షీనా, ఇంద్రాణీల మధ్య విభేధాలు తలెత్తాయని పేర్కొన్నారు. అలానే షీనా, రాహుల్ డ్రగ్స్ తీసుకుంటారనే విషయం తెలిశాక పరిస్థితి మరింత దిగజారిపోయిందని వివరించింది.తాను 2011లో చివరిసారి గోవాలో జరిగిన ఓ పెళ్లిలో షీనాను కలిశానని విధి గుర్తు చేసుకుంది. ఇంద్రాణీ అరెస్టు తర్వాత ఆమె వస్తువుల కోసం కొందరు బంధువులు ఇంటికి వచ్చి గొడవ చేశారని విధి వివరించారు. విలువైన ఆభరణాలు, రూ.7 కోట్లు బ్యాంకు నిల్వలు దోచుకున్నారని ఆమె ఆరోపించారు.

ఇంద్రాణీ ముఖర్జియా, ఆమె మొదటి భర్త సిద్దార్థ్ దాస్‌లకు జన్మించిన సంతానం షీనా బోరా. 2012లో అమె అనుమానాస్పద రీతిలో అదృశ్యమైంది. షీనా ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిందని నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే 2015లో ఇంద్రాణీ డ్రైవర్ శ్యామ్‌వర్ రాయ్ ఓ కేసులో పోలీసులకు పట్టుబడటంతో.. షీనా హత్య కేసు వెలుగులోకి వచ్చింది.


## మరోసారి పూరీ ఆలయ గోపురం జెండాపై గరుడ పక్షి.. శుభసంకేతమా? చెడు జరగబోతుందా?



**న్యూఢిల్లీ-నవభూమి:**హిందువులు పరమ పవిత్రంగా భావించే ఆలయాల్లో పూరీ జగన్నాథ ఆలయం ముందు వరుసలో ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇక్కడ నిర్వహించే రథయాత్రలో పాల్గొనేందుకు లక్షలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. దేశంలో మరే ఆలయానికి లేని పలు ప్రత్యేకతలు పూరీ ఆలయానికి ఉన్నాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది పూరీ జగన్నాథ ఆలయంలో ఒక వింత సంఘటన చోటు చేసుకుంది. ఆలయ గోపురంపై ఓ గరుడ పక్షి ప్రదక్షిణలు చేసిన సంగతి తెలిసిందే. నాలుగు నెలల తర్వాత తాజాగా నేడు గురువారం నాడు మరో అద్భుతం వెలుగులోకి వచ్చింది. ఈ సారి గరుడ పక్షి పూరీ జగన్నాథుడి ఆలయ గోపురం మీద కూర్చుని ఉంది. పూరీ ఆలయ గోపురంమీద ఉండే జెండా మీద గరుడ పక్షి కూర్చుని ఉన్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజనులు కొందరు ఇది దైవ సందేశమని కామెంట్స్ చేస్తుండగా మరి కొందరు మాత్రం ఏదో ప్రమాదం జరగబోతుందనే దానికి ఇది హెచ్చరిక అంటూ కామెంట్స్ చేస్తున్నారు. చాలా మంది దీన్ని పహల్గాం ఉగ్రదాడితో కనెక్ట్ చేసి కామెంట్స్ చేస్తున్నార.కొన్ని విషయాల గురించి చెప్పడానికైనా మన లైఫ్‌లో టీచర్స్ ఉండాల్సిందే, వారి ద్వారా తెలుసుకోవాల్సిన ముఖ్య పాఠాలేంటో తెలుసాఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో 12 తారీఖున గరుడ పక్షి ఒకటి నోట జెండా పట్టుకుని పూరీ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన తర్వాత సముద్రంవైపు ఎగిరిపోయింది. ఇందుకు సంబంధించిన వీడియో అప్పట్లో తెగ వైరల్ అయ్యింది. వాస్తవానికి వీడియోలో ఉన్నది గ్రద్ద అని.. దీన్ని గరుడ పక్షిగా భావిస్తారని.. ఇది సాక్షాత్తు శ్రీమహావిష్ణువుకు వాహనం అని.. అలాంటి గరుడ పక్షి ఆలయం చుట్టూ చక్కర్లు కొట్టడం దైవ సంకేతం అని కామెంట్స్ చేశారు.


అయితే ఈ సంఘటన జరిగిన పది రోజులకే పహల్గాం ఉగ్రదాడి జరిగింది. అమాయకులైన పర్యాటకుల మీద ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు బదులుగా మోదీ సర్కార్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించింది. ఈ సారి గరుడ పక్షి పూరి ఆలయం శిఖరం మీద కూర్చుని కనిపించడంతో.. ఈసారి ఏ ప్రమాదం జరగబోతుందో అని నెటిజనులు కామెంట్స్ చేస్తున్నారు. గరుడ పక్షి ఆలయ జెండాపై కూర్చొన్న వీడియో ఒడియా మీడియాలో ప్రసారమైంది.పూరీ ఆలయ గోపురం మీద ఉండే జెండాకు చాలా ప్రత్యేకత ఉంది. మామూలుగా ఆలయాల మీద ఏర్పాటు చేసిన ఏ జెండా అయినా సరే గాలి దిశనుబట్టి ఎగురుతుంది. కానీ పూరీ ఆలయం మీద ఉన్న జెండా మాత్రం గాలి ఎటువైపు వీచినా కానీ వ్యతిరేక దిశలోనే ఎగురుతుంది. 45 అంతస్తుల ఎత్తున్న ఈ ఆలయంపైకి నిత్యం పూజారి ఎక్కి ఈ జెండాను రోజూ మారుస్తుంటారు. క్రీ.శ. 1800 సంవత్సరం నుంచి ఈ ఆచారం అమల్లో ఉంది. పొరపాటున ఒక్క రోజు జెండా మార్చకపోయినా..18 సంవత్సరాల వరకు ఆలయాన్ని మూసి వేయాలని నమ్ముతారు.

## పాముకు పాలు పోసి పూజలు..



**బెంగళూరు-నవభూమి:** నాగుల చవితి సందర్భంగా విగ్రహాలుగా ఉన్న నాగదేవతలకు పుట్టల వద్ద పాములుపూసి పూజించడం ఆనవాయితీ. ఎక్కడైనా నిజమైన పాము కనిపిస్తే వెంటనే కొట్టి చంపే ప్రయత్నం చేయడం సహజం. ఏకంగా బతికున్న పాముకు పూజలు చేసి అందరినీ అశ్చర్యంలో ముంచారు. ఈ వింత సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సంఘటన మంగళవారం జిల్లాలోని లింగసుగూరు తాలూకా జంగిరాంపూర్ తండాలో చోటు చేసుకుంది.తండాకు చెందిన సునీల్ పవార్ తన ఇంటి వద్ద కనిపించిన నాగుపాముకు ప్రత్యేక్షంగా పూజలు నిర్వహించి కొబ్బరి కాయకొట్టి దండాలు పెట్టడం అందరిని ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. అనంతరం ఆయనే స్వయంగా పాములు పట్టే వారిని పిలిపించి పామును అడవికి తరలించారు.

## ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ 'లక్కీ భాస్కర్' అరెస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ రంగ సంస్థ నిధులను తారుమారు చేసిన కేసులో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్‌ను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. రూ.232 కోట్లకు పైగా ప్రభుత్వ రంగ సంస్థ నిధులను తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించారనే ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. డెహ్రాడూన్ విమానాశ్రయంలో తన పోస్టింగ్ సమయంలో మూడు సంవత్సరాలలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో పనిచేసే రాహుల్ విజయ్ ఈ అక్రమాలకు పాల్పడ్డారు. బూటకపు అకౌంటింగ్ ఎంట్రీల ద్వారా సంస్థ సొమ్ములు తన వ్యక్తిగత ఖాతాల్లోకి బదిలీ చేశారని అధికారులు తెలిపారు.అధికారిక, ఎలక్ట్రానిక్ రికార్డులను తారుమారు చేయడం ద్వారా విజయ్ ఈ మోసానికి పాల్పడ్డారు. ఒక క్రమ పద్ధతిలో, ప్లాన్ ప్రకారం నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.'దర్యాప్తు సమయంలో, 2019-20 నుండి 2022-23 మధ్య కాలంలో, నిందితుడు డెహ్రాడూన్ విమానాశ్రయంలో విధులు నిర్వర్తిస్తుండగా ఈ మోసాలకు పాల్పడినట్టు తేల్చారు. నకిలీ, కల్పిత ఆస్తులను సృష్టించడంతో పాటూ ఎంట్రీలకు సున్నాలను జోడించడం ద్వారా ఎలక్ట్రానిక్ రికార్డులను తారుమారు చేసినట్లు తేలింది' అని ఆమె చెప్పారు.బ్యాంకు లావాదేవీల ప్రాథమిక విశ్లేషణలో తేలిన విషయం ఏంటంటే.. విజయ్ అలా జమ చేసిన నిధులను 'ట్రేడింగ్ ఖాతాలకు' బదిలీ చేశారని, తద్వారా ప్రజా ధనాన్ని స్వాహా చేశారని ఏజెన్సీ కనుగొంది. సంస్థ నిర్వహించిన అంతర్గత ఆడిట్‌లో అవకతవకలు బయటపడ్డ తర్వాత AAI ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కల్పిత అకౌంటింగ్ ఎంట్రీల ద్వారా అధికారిక ఖాతాల నుండి విజయ్ వ్యక్తిగత ఖాతాలకు అనధికార నిధుల బదిలీల విషయాన్ని కమిటీ బయటపెట్టింది. దీంతో సీనియర్ మేనేజర్ (ఫైనాన్స్) చంద్రకాంత్ ఆగస్టు 18న %CBI%కి అధికారిక ఫిర్యాదు చేశారు. దీంతో సీబీఐ రంగంలోకి దిగి ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టింది.

## గవర్నమెంట్ జాబ్ వచ్చి మూడేళ్లే.. దండం పెట్టి మరీ రిజైన్ చేసిన యువతి



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రభుత్వం ఉద్యోగం.. దాదాపు చదువుకున్న ప్రతి విద్యార్థి కల. గవర్నమెంట్ జాబ్ అంటే అదేదో అక్షయ పాత్ర అన్నట్లు భావిస్తారు చాలా మంది యువత. ఎప్పుడు తీసేస్తారో అనే భయం ఉండదు.. ఫస్టు తారీఖున కచ్చితంగా అకౌంట్‌లో జీతం పడుతుంది.. ప్రమోషన్ల గురించి ఎవరిని కాకా పట్టాల్సిన అవసరం లేదు.. వీటన్నింటికి తోడు సమాజంలో మంచి గౌరవం. ఇన్ని ప్రయోజనాలు ఉండటం వల్లే చాలా మంది యువత ప్రభుత్వ కొలువు కోసం కలలు కంటారు. ఏళ్ల తరబడి రేయింబవళ్లు కష్టపడి చదువుతారు. అయితే ప్రతి ఒక్కరికి ఉద్యోగం వస్తుందా అంటే రాదు. గవర్నమెంట్ కొలువు రావాలంటే కష్టంతో పాటు కాస్తంత అదృష్టం కూడా ఉండాలి. మరి ప్రభుత్వ ఉద్యోగం కోసం ఒక్కొక్కళ్లు ఇంత కష్టపడుతుంటే.. ఓ యువతి మాత్రం గవర్నమెంట్ జాబ్‌కు ఓ దండం అంటూ రిజైన్ చేసింది. అందుకు ఆమె చెప్పిన కారణం వింటే కచ్చితంగా షాకవుతారు. ఆ వివరాలు..ఢిల్లీకి చెందిన వాణి అనే 29 ఏళ్ల యువతి.. ఎంతో కష్టపడి.. బ్యాంకు కొలువు సాధించింది. నేటి కాలంలో బ్యాంక్ జాబ్ తెచ్చుకోవడం అంటే మాటలు కాదు. వాణి కూడా ఏడాదంతా ఐబీపీఎస్ పరీక్షల కోసం ట్రైనింగ్ కూడా తీసుకుంది. ఎంతో కష్టపడి చదివితే.. మూడేళ్ల క్రితం అనగా 2022లో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జాబ్ వచ్చింది. ఉద్యోగం వచ్చిన తర్వాత స్కేల్ వన్ ఆఫీసర్‌గా ఆమెకు మీరట్‌లో పోస్టింగ్ వేశారు. లోన్ల విభాగంలో ఆమె పని చేసేది.మరి ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ.. ఉద్యోగంలో చేరిన మూడేళ్లకే రాజీనామా చేసింది. ఆమె నిర్ణయం ప్రతి ఒక్కరిని షాక్‌కు గురి చేసింది. ఇంత మంచి ఉద్యోగాన్ని ఎందుకు వదిలేసుకుందనే ప్రశ్నలు తెర మీదకు వచ్చాయి. దీనిపై వాణి మాట్లాడుతూ.. 'నేను బ్యాంక్ ఉద్యోగంలో చేరక ముందు ఎంతో సంతోషంగా, జాలీగా ఎంజాయ్ చేసేదాన్ని. కానీ ఉద్యోగంలో చేరిన ఈ మూడేళ్లలో నా జీవితం పూర్తిగా మారిపోయింది. ఎంతలా అంటే నన్ను నేను అసహ్యించుకునే స్థాయికి చేరుకున్నారు. చిరాకు, విసుగు కలుగుతున్నాయి. అస్సలు మనశ్శాంతి లేకుండా పోయింది. వీటన్నింటికి కారణం జాబ్. అందుకే ఉద్యోగం మానేశాను. ఈ నిర్ణయం పట్ల నాకేం బాధ లేదు. చెప్పాలంటే ఇప్పుడే నేను చాలా సంతోషంగా ఉన్నాను' అని చెప్పుకొచ్చింది.వాణి మాట్లాడుతూ.. 'మనది కానీ ప్రదేశాన్ని విడిచి పెట్టినప్పుడు కలిగే సంతోషం అంతా ఇంతా కాదు. నా నిర్ణయం గురించి నేనేం బాధపడటం లేదు. వాస్తవానికి ఇది నా డ్రీమ్ జాబ్.. దీని కోసం నేను చాలా కష్టపడ్డాను. కానీ వాస్తవం వేరేలా ఉంది. చాలా మంది దూరం నుంచే ఏం చూడకుండానే జడ్జ్ చేస్తుంటారు. అలాంటి వారి మాటలు పట్టించుకోకండి. ఇబ్బంది పడుతూ మనల్ని కష్టపెట్టుకుంటూ జీవించడం వల్ల ఎవరికి ఉపయోగం.. ధైర్యంగా నిర్ణయం తీసుకోండి' అంటూ ఇన్‌స్టాలో ఒక వీడియో పోస్ట్ చేసింది. ఇది ప్రస్తుతం తెగ వైరల్ అవుతోంది.

## భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై పీయూష్ గోయల్ ఆసక్తికర వ్యాఖ్యలు..



**న్యూఢిల్లీ-నవభూమి:**డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపుతో అమెరికా-భారత్ దేశాల మధ్య వాణిజ్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టారిఫ్‌ల అంశం మీద ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు సాగినా.. లాభం లేకుండా పోయింది. ఈక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. నవంబర్ నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలానే పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ వివరాలు..

ప్రతీకార సుంకాల విధింపు నేపథ్యంలో అమెరికా-భారత్ మధ్య వాణిజ్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రష్యా వద్ద నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ప్రతీకారంగా ట్రంప్ భారత్ మీద 25 శాతం అధిక సుంకాలు విధించడంతో... ప్రస్తుతం ఇండియా మీద అమెరికా సుంకాలు 50 శాతానికి చేరాయి. అయితే ట్రంప్ బెదిరింపులకు మోదీ సర్కార్ ధీటుగా బదులిస్తోంది. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం గురించి కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా ముంబైలో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో పీయూష్ గోయల్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ వివరాలు...నవంబర్ కల్లా పూర్తవుతుందని తెలిపారు. అమెరికాతో వాణిజ్య చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే దీనిపై ఇరు దేశాల మధ్య ఒక ఒప్పందం కుదురుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం నవంబరు నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని పీయూష్ గోయల్ అభిప్రాయపడ్డారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత్‌తో వ్యాపార సంబంధాల పెంచుకోవడానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. దీనిలో భాగంగానే.. యూరోపియన్ యూనియన్‌తో కూడా త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని చెప్పుకొచ్చారు.టారిఫ్‌ల అంశం మీద అమెరికాతో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని పీయూష్ గోయల్ చెప్పుకొచ్చారు. అయితే, ఇండియా ఎప్పుడూ కూడా గడువు తేదీలు పెట్టుకుని చర్చలు జరపదని ఆయన స్పష్టం చేశారు. దీని గురించి ఆయన మాట్లాడుతూ.. భారతదేశం ఎన్నడు కూడా డెడ్‌లైన్స్ పెట్టుకొని వాణిజ్య చర్చలు జరపదు. ఇరు వర్గాలకు ప్రయోజనకరంగా ఉండే ఒప్పందాలపై మాత్రమే చర్చిస్తుంది అని పీయూష్ గోయల్ చెప్పుకొచ్చారు. మన దేశం సరఫరా వ్యవస్థ చాలా బలంగా ఉందని.. మన ఇతర దేశాల మీద ఆధారపడాల్సిన అవసరం కూడా లేదని పీయూష్ గోయల్ స్పష్టం చేశారు.కాగా ఈ సంవత్సంర అనగా 2025లో అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ సుంకాల విధింపు నేపథ్యంలో.. మార్చి నుంచి భారత్, అమెరికా.. ఇరు దేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి. ఇప్పటివరకు 5 రౌండ్ల చర్చలు పూర్తయ్యాయి. ఆరో రౌండ్ చర్చల కోసం అమెరికా ప్రతినిధుల బృందం 2025, ఆగస్టు 25న ఇండియాకు రావాల్సి ఉంది. కానీ వారు రాలేదు. ఆగస్టు 27 నుంచి ఇండియా మీద 50 శాతం సుంకాలు అమల్లోకి వచ్చాయి. ఆరో దశ చర్చలకు ఇంకా కొత్త తేదీలను ప్రకటించలేదు. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## రద్దీ ప్రాంతాల్లో మాస్కు ధరించండి..



**చెన్నై-నవభూమి:** రద్దీ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు మాస్క్ ధరించాలని ఆరోగ్యశాఖ సూచించింది. వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగలు ఎండ తీవ్రత, రాత్రి వేళల్లో వర్షం కురుస్తోంది. ఈ కారణంగా చెన్నై సహా పలు జిల్లాల్లో వైరల్ జ్వరాల(%ఎఱతీఖశ్రీ ఖీవజవతీం%) వ్యాప్తి అధికంగా ఉంది. నగరంలో కూడా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య అధికమవుతోంది. ఈ క్రమంలో, ఆరోగ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని,జ్వరాలు నిరోధించేలా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించింది. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు రద్దీ ప్రాంతాలకు వెళ్లొద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని పేర్కొంది. జ్వర లక్షణాలున్న వారు అలసత్వం చూపకుండా సత్వరం ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య శాఖ సూచించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
గురువారం
04 । సెప్టెంబర్ । 2025



## సంతోషకరమైన క్షణం.. విషాదంగా మారింది.. తొక్కిసలాట ఘటనపై కోహ్లీ భావోద్వేగం

బెంగళూరు-నవభూమి: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ టైటిల్ విజయోత్సవాల సందర్భంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తాజాగా స్పందించారు. ఫ్రాంచైజీ చరిత్రలోనే అత్యంత సంతోషకరమైన రోజు విషాదంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్




4న జరిగిన ఈ దుర్ఘటన జీవితంలో మర్చిపోలేనిదంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ మేరకు ఆర్సీబీ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ ప్రకటన విడుదల చేశారు. జూన్ 4న జరిగిన హృదయ విదారక ఘటన ఎవరూ ఊహించనిది. మా ఫ్రాంచైజీ చరిత్రలోనే అత్యంత సంతోషకరమైన క్షణంగా ఉండాల్సిన రోజు విషాదంగా మారింది. తొక్కిసలాటలో చనిపోయిన, గాయపడిన అభిమానుల కోసం ప్రార్థిస్తున్నా. ఈ నష్టం ఇప్పుడు మనలో ఒక భాగం. మేమంతా జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ముందుకు సాగుతాం' అని కోహ్లీ తన ప్రకటనలో రాసుకొచ్చారు.పద్దెనిమిదేండ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ టైటిల్‌ని గెలుచుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టును సత్కరించేందుకు కాంగ్రెస్ సారథ్యంలోని కర్ణాటక ప్రభుత్వం జూన్ 4న నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తీవ్ర విషాదాంతమైన విషయం తెలిసిందే. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట జరిగి 11 మంది మరణించగా, సుమారు 50 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే.

## "కవిత వర్సెస్ బీఆర్ఎస్ నేతలు కవిత కన్నీటి వ్యాఖ్యలు

భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) లో అంతర్గత విభేదాలు, అధికార పోరాటాలు ఇప్పుడు ఒక కొత్త మలుపు తిరిగాయి. పార్టీ అధినేత కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవితను సస్పెండ్ చేయడం, ఆ నిర్ణయంపై ఆమె బహిరంగ విమర్శలు చేయడం, విస్తృత రాజకీయ చర్చలకు దారితీసింది. "జై తెలంగాణ" నినాదంతో ప్రారంభించిన ఆమె ప్రెస్ మీట్ లో చేసిన వ్యాఖ్యలు, కేవలం ఒక నాయకురాలి వ్యక్తిగత అసంతృప్తి కాదని, తెలంగాణ రాజకీయాల్లో నూతన సంక్షోభానికి సంకేతమని చెప్పవచ్చు.కవిత తన ప్రసంగంలో రెండు ప్రధాన అంశాలను ప్రస్తావించారు. మొదటిది, తనపై పెట్టిన అక్రమ కేసులు, తాను తీహార్ జైలులో గడిపిన అయిదున్నర నెలలు, ఆ తర్వాత ప్రజా క్షేత్రంలో తిరిగి ప్రవేశించి చేపట్టిన పోరాటాలు. రెండవది, బీఆర్ఎస్ లో తనకు జరిగిన అన్యాయం, పార్టీ నేతల కుట్రలు. ఆమె ప్రకటనల్లో స్పష్టంగా కనిపించినది – పార్టీ అధినేత కుటుంబంలోనే బేధాలు ఉద్ధృతమవుతున్నాయన్న విషయం.

కవిత మాటల ప్రకారం, జైలు నుండి బయటకొచ్చిన తర్వాత ఆమె చేసిన ఉద్యమాలు కేవలం వ్యక్తిగత పునరావాసం కోసం కాకుండా సామాజిక తెలంగాణ సాధన కోసం అన్నది. గురుకులాల్లో జరిగిన అక్రమాలు, బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ సాధన, మహిళలకు ఆర్థిక సాయం కోసం చేసిన పోస్టుకార్డు ఉద్యమం ఇవన్నీ ఆమెను ఒక విభిన్న స్వరంగా నిలబెట్టాయి. కానీ ఈ స్వరం పార్టీ లోని కొందరికి అసహనం కలిగించిందని, అందుకే కుట్రలు జరిగాయని ఆమె ఆరోపణలు చేస్తోంది.

### కేటీఆర్‌పై నేరుగా ప్రశ్నలు

కవిత తన ప్రసంగంలో అత్యంత స్పష్టంగా కేటీఆర్‌ను టార్గెట్ చేశారు. "మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు, నాపై జరుగుతున్న కుట్రలపై ఎందుకు స్పందించలేదని" ఆమె అడిగిన ప్రశ్నలు, కేవలం కుటుంబ అంతర్గత గొడవలు కాదు. ఇవి బీఆర్ఎస్ భవిష్యత్తును ప్రశ్నించే స్వరాలు. కేటీఆర్ మౌనం, హరీష్ రావుతో ఆయన సంబంధాలు, పార్టీ లోని నిర్ణయాలు అన్నింటినీ ఆమె బహిర్గతం చేశారు. ఇది ఒక కుటుంబం లోని విభేదాలు రాజకీయ రంగస్థలంపై ఎలా ప్రతిఫలిస్తాయో చూపిస్తుంది.

### హరీష్ రావుపై కఠిన విమర్శలు

ప్రెస్ మీట్‌లో కవిత చేసిన అత్యంత సంచలన వ్యాఖ్యలు హరీష్ రావుపైనే. ఆయనపై పాల వ్యాపారం, హాస్టళ్లకు పాలు సరఫరా, కోట్ల రూపాయల కుంభకోణం, కాంగ్రెస్‌తో గోప్య ఒప్పందాలు అన్న ఆరోపణలు చేసింది. కేసీఆర్ పై జరిగిన సీబీఐ విచారణలకు కూడా హరీష్ రావే కారణమని చెప్పడం, అంతర్గత విభేదాలను బహిరంగంగా ప్రదర్శించడమే. ఒక దశలో "హరీష్ రావు ట్రబుల్ షూటర్ కాదు, డబుల్ షూటర్" అని చెప్పిన వ్యాఖ్య, ఆయనను కట్టప్ప లాంటి వ్యక్తిగా చిత్రీకరించడం – ఇవి పార్టీ లోని ద్వంద్వ విశ్వాసాలను బహిర్గతం చేశాయి.

### పార్టీకి చేసిన సేవలు – నిష్క్రమణ బాధ

"నా 20 ఏళ్ల జీవితాన్ని బీఆర్ఎస్ కోసం వెచ్చించాను. నాకు పదవులపై ఆశ లేదు. అయినా పార్టీ నుంచి నన్ను బహిష్కరించారు" అని కవిత చెప్పడం, ఆమె వ్యక్తిగత నిబద్ధతను చూపుతుంది. అయినప్పటికీ, ఈ వాక్యాలు ఒక పెద్ద రాజకీయ వాస్తవాన్ని గుర్తు చేస్తున్నాయి – తెలంగాణ ఆవిర్భావంలో ముఖ్యపాత్ర పోషించిన నేతలు, నేడు తమకే ఆ రాష్ట్ర రాజకీయాల్లో స్థానం లేకుండా పోతున్నారన్న విషయం.

### రాజీనామా నిర్ణయం

కవిత కేవలం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మాత్రమే కాకుండా ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయడం ఒక ప్రధాన పరిణామం. ఇది బీఆర్ఎస్‌కు పెద్ద షాక్ అని చెప్పవచ్చు. తాను వేరే పార్టీలో చేరనని స్పష్టంగా చెప్పినా, భవిష్యత్ కార్యాచరణను "జాగృతి కార్యకర్తలతో" చర్చించి నిర్ణయిస్తానన్న వ్యాఖ్య, కొత్త రాజకీయ వేదిక ఏర్పడే అవకాశాన్ని సూచిస్తోంది.కవిత ప్రసంగంలో పదే పదే వినిపించిన పదం – "సామాజిక తెలంగాణ". ఆమె దృష్టిలో సామాజిక న్యాయం, వర్గాల సమానత్వం, మహిళల భాగస్వామ్యం ప్రధాన అంశాలు. ఈ ఆలోచనను బీఆర్ఎస్ వ్యతిరేకంగా చిత్రీకరించడం అన్యాయం అని ఆమె వాదన. కానీ పార్టీ లోని అంతర్గత వర్గాలు ఈ సిద్ధాంతాన్ని అంగీకరించకపోవడం, విభేదాల మూల కారణం అని అర్థమవుతోంది.కవిత వ్యాఖ్యలు ఒక పెద్ద ప్రశ్నను ముందుకు తెచ్చాయి – కుటుంబ ఆధిపత్యంపై నడిచే పార్టీలు ఎంతకాలం నిలబడతాయి? బీఆర్ఎస్ లో కేసీఆర్ కుటుంబం కేంద్రంగా నిలిచినా, ఇప్పుడు ఆ కుటుంబంలోనే విభేదాలు బహిర్గతం కావడం, పార్టీ స్థిరత్వాన్ని కదిలిస్తోంది. కవితకు జరిగిన అన్యాయం, కేటీఆర్ మౌనం, హరీష్ రావు పై ఆరోపణలు ఇవన్నీ ఒకే సమయంలో బయటపడటం, బీఆర్ఎస్ భవిష్యత్తుకు ముప్పు.

కవిత ప్రసంగంలో మరో ముఖ్యాంశం "నాకు ప్రజలున్నారు. వాళ్ల దగ్గరికే వెళ్తా" అన్న వ్యాఖ్య. ఇది కేవలం భావోద్వేగం కాదు. ప్రజల్లో ఆధారం కోసం చేసే ప్రయత్నం. బీఆర్ఎస్ లో స్థానం కోల్పోయినా, ప్రజా స్థాయిలో తనకున్న మద్దతును కొత్త దిశగా మలచాలని ఆమె యోచిస్తున్న సంకేతం.

ఈ పరిణామం బీఆర్ఎస్ కు తీవ్రమైన సవాలు. పార్టీ లోని విభేదాలు బహిర్గతం కావడం, ప్రజల ముందు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం, అంతర్గత ఐక్యతను బలహీనపరుస్తుంది. 2029 ఎన్నికల దిశగా సాగుతున్న రాష్ట్ర రాజకీయాల్లో బీఆర్ఎస్ స్థానం ఏంటి అన్న ప్రశ్న ఇక్కడి నుంచి మరింత గట్టిగా వినిపించనుంది.

కవితపై సస్పెన్షన్, ఆమె చేసిన సంచలన వ్యాఖ్యలు, బీఆర్ఎస్ లోని అంతర్గత విభేదాలను పూర్తిగా బయటపెట్టాయి. ఇది ఒక కుటుంబ సమస్యగా మిగిలిపోకుండా, తెలంగాణ రాజకీయాల దిశను మార్చే పరిణామంగా మారే అవకాశముంది. కవిత తన భవిష్యత్ కార్యాచరణను ప్రజలతో, జాగృతి కార్యకర్తలతో చర్చించి నిర్ణయిస్తానని చెప్పడం, కొత్త రాజకీయ శక్తి అవతరణకు బాటలు వేస్తుందేమో చూడాలి. బీఆర్ఎస్ భవిష్యత్తు ఇప్పుడు కేవలం కేసీఆర్ లేదా కేటీఆర్ నిర్ణయాలపై కాకుండా, ప్రజల్లో ఉన్న అసంతృప్తి, కొత్త వర్గాల ఎదుగుదల, మరియు కవితలాంటి నాయకుల భవిష్యత్ దిశపై ఆధారపడి ఉంది.

# భారత్, చైనా మైత్రి స్థిరమేనా

భారత్-చైనా సంబంధాలు దశాబ్దాలుగా పగటి పూట వెలుగులోనూ, అర్ధరాత్రి చీకటిలోనూ పయనిస్తూ వచ్చాయి. సరిహద్దు ఘర్షణలు, వాణిజ్య పోటీలు, వ్యూహాత్మక బంధాలు, ప్రాంతీయ సమీకరణలు %-% ఇవన్నీ ఈ రెండు మహా దేశాల సంబంధాలను నిరంతరం కొత్త మలుపులకు నెట్టాయి. తాజాగా షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సు వేదికగా ప్రధాని నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య చోటుచేసుకున్న సయోధ్య ప్రయత్నాలు మరోసారి ఈ సంబంధాల భవిష్యత్తుపై చర్చలను రేకెత్తించాయి. 'డ్రాగన్-ఏనుగు కలిసి నర్తిస్తే' అనే జిన్‌పింగ్ వ్యాఖ్య ఒక ఆశాజనక భవిష్యత్తు సూచనలాగే కనిపించినా, చరిత్రలోని చేదు అనుభవాలు, భూక్షేత్ర వాస్తవాలు ఈ సయోధ్య స్థిరత్వంపై ప్రశ్నార్థకాలు మిగులుస్తున్నాయి.

1962 యుద్ధం నుంచి ఇప్పటి వరకూ భారత్-చైనా సంబంధాలపై అత్యంత ప్రతికూల ప్రభావం చూపిన అంశం సరిహద్దు సమస్య. లడాఖ్ నుంచి అరుణాచల్ వరకు వేల కిలోమీటర్ల సరిహద్దు గీత అనిశ్చితిలోనే ఉంది. డోక్లామ్, గల్వాన్ ఘటనలు ఈ అనిశ్చితికి కొత్త ముద్రలు వేశాయి. గత ఐదేళ్లలోనే అనేకసార్లు ఇరుదేశాల సైన్యాలు ఒకరిపై ఒకరు నిలబడి ఉద్రిక్త వాతావరణం సృష్టించాయి. మోదీ, జిన్‌పింగ్ పలుమార్లు ద్వైపాక్షిక చర్చలు జరిపినా, సరిహద్దు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకలేదు. ఇలాంటి వాతావరణంలో నేడు ఏర్పడిన సయోధ్య కేవలం అవసరార్థమే గానీ, దీర్ఘకాల శాంతి కోసం పునాదులు వేస్తుందా అనే అనుమానం తప్పదని చెప్పాలి.

చైనా ప్రపంచ వాణిజ్య శక్తిగా ఎదిగిన తర్వాత భారతదేశానికి అతిపెద్ద దిగుమతి మూలంగా మారింది. ఎలక్ట్రానిక్స్, మొబైల్ పరికరాలు, మెడికల్ ఎక్విప్‌మెంట్, ఇంజనీరింగ్ గూడ్స్ %-% ఇవన్నీ భారత మార్కెట్‌లో చైనా ఉత్పత్తుల ఆధిపత్యాన్ని చూపుతున్నాయి. ఒకవైపు "ఆత్మనిర్భర్ భారత్" అనే నినాదం వినిపిస్తున్నా, మరోవైపు వాణిజ్యంలో చైనాపై ఆధారపడుతున్నాం. ఈ ఆధారపడ్డ వాస్తవం మాకు వ్యూహాత్మక బలహీనతగా మారుతోంది. చైనా మార్కెట్లు తెరవడం, భారత ఉత్పత్తులకు అవకాశమివ్వడం %-



% ఇవన్నీ స్వాగతించదగిన పరిణామాలే అయినప్పటికీ, అవి కూడా ఒక ఆర్థిక వ్యూహం మాత్రమే. ఈ వాణిజ్య సయోధ్య, రాజకీయ విశ్వాసానికి పునాది వేయగలదా అన్నది సందేహాస్పదం.

### అమెరికా అంశ- మూడో శక్తి ప్రభావం

భారత్-చైనా సంబంధాలపై ఎప్పటినుంచీ అమెరికా ప్రభావం అధికంగా ఉంది. 21వ శతాబ్దంలో భారత్ అమెరికాతో సన్నిహిత సంబంధాలు పెంచుకుంది. రక్షణ, సాంకేతిక, పెట్టుబడి రంగాల్లో అమెరికా మిత్రుడిగా నిలిచింది. కానీ ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలు, వాణిజ్య అవరోధాలు, అంతర్జాతీయ ఒత్తిడులు భారత్‌నే కాక చైనాను కూడా అసహనానికి గురిచేశాయి. ఈ పరిస్థితుల్లో ఇరుదేశాలు ఒకరిని ఒకరు ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది నిజానికి సయోధ్యకు ప్రధాన కారణం. అంటే, భారత్-చైనా స్నేహం అంతర్గత విశ్వాసం మీద కాకుండా, అమెరికా ఒత్తిడుల వలన ఏర్పడిన అవసరం. ఆ అవసరం తీరిన తర్వాత ఈ స్నేహం కొనసాగుతుందా అన్నది పెద్ద ప్రశ్న.

భారత్, చైనా మధ్య రష్యా ఎప్పటినుంచీ ఒక బంధకుడిగా, మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. బ్రిక్స్, ఎస్సీవో వంటి వేదికలు రష్యా ఉనికిని చూపిస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా ఒంటరిపడిన సమయంలో భారత్, చైనాతో మైత్రి బలపరచడం దాని అవసరం. ఈ అవసరాలు మూడు దేశాలను ఒక వేదికపైకి తీసుకువచ్చాయి. కానీ రష్యా స్వీయ సమస్యల్లో మునిగిపోతున్న సమయంలో దీర్ఘకాలిక స్థిరత్వం కల్పించగలదా అన్నది సందేహం.

ప్రధాన సమస్య ఒకటే పరస్పర విశ్వాస లోపం. చైనా తరచూ పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తూ భారత్ ఆందోళనకు గురిచేస్తుంది. భారత్ కూడా ఇండో-పసిఫిక్ వ్యూహంలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కలిసి పనిచేస్తూ చైనాకు అనుమానం కలిగిస్తుంది. ఇలాంటి ద్వంద్వ వ్యూహాల మధ్య ఏర్పడిన సయోధ్య పైపైకి మైత్రిలా కనిపించినా, లోతులో అనుమానాల విత్తనాలతో నిండిపోయి ఉంటుంది. డ్రాగన్, ఏనుగు కలిసి నర్తించడం ఒక చక్కటి రూపకం మాత్రమే. కానీ నిజ జీవితంలో ఈ రెండు మహా జంతువులు ఒకే రంగస్థలంపై సహజీవనం చేయగలవా అన్నది ప్రాక్టికల్ సమస్య.

చైనా పట్ల భారత ప్రజల్లో అనుమానం గాఢంగా ఉంది. గల్వాన్ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా 'బాయ్‌కాట్ చైనా' ఉద్యమం సాగింది. ఇదే సమయంలో చైనా ప్రజల్లో కూడా భారతదేశంపై ప్రత్యేకమైన విశ్వాసం లేదు. ఇలాంటి ప్రజాభిప్రాయ వాతావరణంలో రాజకీయ నాయకుల సయోధ్య ఎంతకాలం నిలుస్తుందో అనిశ్చితి. ప్రజాస్వామ్యం ఉన్న భారత్‌లో ప్రజాభిప్రాయం ప్రాధాన్యం ఎక్కువ. ఒక ప్రతికూల ఘటనతోనే ఈ స్నేహం చల్లబడే అవకాశం ఉంది.

చైనా ఆర్థిక శక్తి ప్రబలమవుతున్నప్పటికీ, భారత్ కూడా వేగంగా ఎదుగుతోంది. ప్రపంచ ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఇప్పటికే గుర్తింపు పొందింది. 2030 నాటికి మూడవ స్థానంలోకి ఎదగవచ్చని అంచనాలు ఉన్నాయి. ఈ ఎదుగుదల చైనాకు ఒక సవాలుగా మారుతోంది. అందుకే చైనా భారత్‌ను ప్రత్యర్థిగా కాకుండా, సహచరునిగా మలచాలనుకుంటోంది. కానీ చైనాకు ఉన్న ఈ వ్యూహాత్మక లెక్కలు, భారత్‌కు ఉన్న ఆత్మవిశ్వాసం రెండూ కలిసి దీర్ఘకాలిక బంధానికి పునాది వేయగలవా అన్నది మిగిలిన ప్రశ్న.

### సరిహద్దు సమస్య పరిష్కారమే కీలకం

అన్ని అంశాలు పక్కనపెడితే, భారత్-చైనా మధ్య నిజమైన సయోధ్య సాధ్యమయ్యేది సరిహద్దు సమస్య పరిష్కారం ద్వారానే. సరిహద్దులో శాంతి నెలకొన్నప్పుడే వాణిజ్యం, సాంస్కృతిక మార్పిడి, వ్యూహాత్మక మైత్రి బలపడుతుంది. లేకపోతే ఎంత పెద్ద వేదికలపై ఆలింగనాలు, చిరునవ్వులు పంచుకున్నా, ఒక చిన్న చొరబాటు సంఘటనతోనే సంబంధాలు చల్లబడిపోతాయి.

### చచచచ ముగింపు – సయోధ్యకు గడువు

ఈ సయోధ్య ఒక సానుకూల సంకేతం అనడంలో సందేహం లేదు. కానీ ఇది స్థిరమైన శాంతి వైపు అడుగు కాదు. అమెరికా ఒత్తిడులు, రష్యా అవసరాలు, వాణిజ్య ప్రయోజనాలు %-% ఇవన్నీ కలిపి సృష్టించిన ఒక తాత్కాలిక బంధమే. శాశ్వత సయోధ్య సాధ్యమయ్యేది పరస్పర విశ్వాసం, సరిహద్దు పరిష్కారం, నిజమైన గౌరవం ఉంటేనే. లేని పక్షంలో ఇది కూడా చరిత్రలోని మరో తాత్కాలిక మలుపుగానే మిగిలిపోతుంది.

# భారతదేశంలో ప్రాంతీయ పార్టీల భవిష్యత్తు



భారతదేశ రాజకీయ పరిణామాలలో ప్రాంతీయ పార్టీల స్థానం ఎల్లప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి సంవత్సరాల్లో కాంగ్రెస్ ఒకే ఒక్క ఆధిపత్య శక్తిగా ఉండగా, ఆ తర్వాతి కాలంలో ప్రాంతీయ రాజకీయ శక్తులు క్రమంగా వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా 1960ల తర్వాత, భాషా రాష్ట్రాల ఏర్పాటు పూర్తికాగానే, ఆ రాష్ట్రాల ప్రత్యేక సమస్యలను ప్రతిబింబించే రాజకీయ వేదికల అవసరం పెరిగింది. దానివల్లే ద్రవిడ ఉద్యమం నుంచి తమిళనాడులో డీఎంకే, అనంతరం అన్నాడీఎంకే పుట్టుకొచ్చాయి. ఆ తర్వాతి దశాబ్దాల్లో క్రమంగా ఉత్తర భారతదేశంలో సమాజ్‌వాదీ శక్తులు, బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్, పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ, ఒడిశాలో బీజేడీ, మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ, జార?ండ్‌లో జేఎంఎం వంటి పార్టీలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో 2001లో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి, తర్వాతి కాలంలో భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెందింది. ఈ ప్రాంతీయ శక్తులన్నీ దేశ రాజకీయాల్లో కేంద్ర బిందువులుగా మారిన సందర్భాలు అనేకం ఉన్నాయి.ప్రాంతీయ పార్టీల భవిష్యత్తు ఉందా అనే ప్రశ్న ఇవాళ అనేక కారణాల వల్ల మళ్లీ ముందుకొచ్చింది. ముఖ్యంగా తెలంగాణలో ఒకప్పుడు అపార శక్తిని ప్రదర్శించిన బీఆర్ఎస్ ఇవాళ అంతర్గత సంక్షోభంతో తడబడుతుండటమే ఈ సందేహానికి మూలం. అయితే బీఆర్ఎస్ పరిస్థితి అన్నది అన్ని ప్రాంతీయ పార్టీల పరిస్థితి కాదు. కానీ ఈ ఉదాహరణ ద్వారా ప్రాంతీయ పార్టీలు, వాటి నాయకత్వం తప్పక నేర్చుకోవలసిన పాఠాలు ఉన్నాయనేది వాస్తవం.ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యతను మరోసారి రుజువు చేశాయి. భారతీయ జనతా పార్టీకి పూర్తి మెజార్టీ రాకపోవడంతో ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రాంతీయ పార్టీల మద్దతు అత్యవసరమైంది. మరోవైపు ఇండియా కూటమిలో కాంగ్రెస్ బలం తక్కువగానే ఉన్నా, ప్రాంతీయ పార్టీలు కలిపి పెద్ద శక్తిగా నిలిచాయి. ఇది ప్రాంతీయ పార్టీలకు దేశ రాజకీయాలలోని అవసరాన్ని స్పష్టంగా చూపిస్తుంది. అయినప్పటికీ, ప్రాంతీయ పార్టీల పరిస్థితి స్థిరంగా ఉందని చెప్పడానికి వీల్లేదు. అనేక పార్టీలు క్షీణించాయి, కొన్ని అంతరించి పోయాయి. కొన్ని కొత్తగా పునరుద్ధరించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.ఈ పరిస్థితుల్లో ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. సిద్ధాంతం, చరిత్ర, ప్రజా వర్గాలతో అనుసంధానం లేని ప్రాంతీయ పార్టీలు ఎక్కువకాలం నిలవవు. దీనికి బీఆర్ఎస్ ఉదాహరణ. తెలంగాణ రాష్ట్ర సమితి పుట్టుక పూర్తిగా తెలంగాణ ఉద్యమంపై ఆధారపడి ఉంది. ఆ లక్ష్యం నెరవేరిన తర్వాత ఆ పార్టీకి కొత్త దిశ, కొత్త సిద్ధాంతం నిర్దేశించాల్సిన అవసరం ఉంది. కానీ కేసీఆర్ అలా చేయకుండా, జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించాలని భావించడం వల్ల ఆ పార్టీ మూలాలను కోల్పోయింది.


మరోవైపు డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, ఎన్సీపీ, శివసేన వంటి పార్టీలు తమకు ఉన్న సిద్ధాంతం, చరిత్రను నిలబెట్టుకోవడం వల్లే ఇవాళ్టికీ బలంగా ఉన్నాయి.ప్రాంతీయ నాయకుల వ్యక్తిత్వం కూడా ఈ పార్టీల భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తుంది. శిబూ సోరెన్ వంటి నాయకులు ఒక సమాజం హక్కుల కోసం పోరాడుతూ ఎదిగారు. కరుణానిధి, అన్నాదురైలు ద్రవిడ ఆత్మగౌరవం కోసం కదిలారు. మమతా బెనర్జీ బెంగాల్ ఆత్మగౌరవం ప్రతీకగా నిలిచారు. చంద్రబాబునాయుడు తెలుగువారి గౌరవం కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలదొక్కుకున్నారు. ఈ నాయకులందరికీ ఒక స్థిరత్వం ఉంది, లక్ష్యబద్ధత ఉంది, ప్రజా వర్గాలతో మమేకం ఉంది. అందువల్లే వారి పార్టీలు ఎదురుదెబ్బలు తిన్నా నిలబడ్డాయి. కేసీఆర్‌కి ఈ లక్షణాలు లేకపోవడం వల్ల బీఆర్ఎస్ ఇంత త్వరగా దుస్థితిలో పడింది.ప్రాంతీయ పార్టీల భవిష్యత్తు గురించి మాట్లాడేటప్పుడు మరో అంశం గమనించాలి. కుటుంబ వారసత్వం అనే విషయం ఎక్కువ ప్రాంతీయ పార్టీల్లో ఉంది. డీఎంకేలో కరుణానిధి తర్వాత స్టాలిన్, సమాజ్‌వాదీ పార్టీ లో ములాయం తర్వాత అఖిలేశ్, ఆర్జేడీలో లాలూ తర్వాత తేజస్వి, జేఎంఎంలో శిబూ సోరెన్ తర్వాత హేమంత్, అన్నాడీఎంకేలో జయలలిత తర్వాత ససికళ వర్గం ప్రయత్నాలు, ఇవన్నీ వారసత్వ రాజకీయాలే. కానీ ఈ వారసత్వం కారణంగా పార్టీలు కూలిపోలేదు. ఎందుకంటే అక్కడ నాయకత్వం వారసులకు దారి చూపింది, మార్గదర్శకత్వం ఇచ్చింది. కానీ బీఆర్ఎస్‌లో కేసీఆర్ తన కుటుంబ సభ్యుల పాత్రను సరిగా నిర్దేశించకపోవడం, అదుపులో పెట్టకపోవడం వల్ల అంతర్గత సంక్షోభం తీవ్రతరం అయింది.భవిష్యత్తులో ప్రాంతీయ పార్టీలకు అవకాశాలు లేకపోవడం లేదు. భారతదేశం విస్తారమైనది, భిన్న సాంస్కృతిక, సామాజిక, భాషా వర్గాలతో కూడినది. ఇలాంటి దేశంలో జాతీయ పార్టీలు అన్ని ప్రాంతాల అవసరాలను సమానంగా తీర్చలేవు. ప్రతి ప్రాంతం తన ప్రత్యేక సమస్యలు, ఆందోళనలు ప్రతిబింబించుకోవడానికి ప్రాంతీయ పార్టీల అవసరం ఉంటుంది. కాబట్టి ప్రాంతీయ పార్టీలు నిలుస్తాయి, ఎదుగుతాయి. కానీ అవి నిలవాలంటే మూడు అంశాలు తప్పనిసరి. ఒకటి సిద్ధాంతం, చరిత్ర, ప్రజా వర్గాలతో అనుసంధానం. రెండు నాయకత్వంలో లక్ష్యబద్ధత, ప్రజాస్వామ్య విలువల పట్ల కట్టుబాటు. మూడు అధికార దాహం కన్నా ప్రజా ప్రయోజనాలు ప్రథమం అనే స్ఫూర్తి.ప్రాంతీయ పార్టీల భవిష్యత్తు అంతిమంగా వాటి నాయకుల ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది. అధికారం కోసమే పార్టీని ఉపయోగించే నాయకులు తమకే కాకుండా ఆ పార్టీకి కూడా ప్రమాదాన్ని తెచ్చిపెడతారు. కేసీఆర్ విషయంలో ఇది స్పష్టమైంది. కానీ అదే సమయంలో ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ, ఒక సమాజానికి వాణిగా నిలిచే నాయకులు తమ పార్టీలను నిలబెట్టగలరు. ఇందుకు ఉదాహరణలు మమతా బెనర్జీ, స్టాలిన్, చంద్రబాబు, అఖిలేశ్, తేజస్వి.అందువల్ల ప్రాంతీయ పార్టీల భవిష్యత్తు ఉన్నదా అన్న ప్రశ్నకు సమాధానం ఒకటే. ఉన్నది. కానీ అది అన్ని పార్టీలకూ సమానంగా ఉండదు. సిద్ధాంతం లేని, దిశ లేని, ప్రజా అనుసంధానం లేని పార్టీల భవిష్యత్తు లేదు. కానీ తమ చరిత్రను నిలబెట్టుకుంటూ, ప్రజా ప్రయోజనాలను కాపాడే పార్టీలకు మాత్రం భారతదేశ రాజకీయాల్లో ఎల్లప్పుడూ స్థానం ఉంటుంది.

## వినాయకుడు -విఘ్నేశ్వరుని విశ్వవ్యాప్తి

భక్తి



భారతీయ సంస్కృతిలో గణపతి, వినాయకుడు, విఘ్నేశ్వరుడు, గణాధిపతి అనే పేర్లతో పూజించబడే దేవుడు ఎంతో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉన్నాడు. ఏ శుభకార్యాన్నైనా ఆరంభించే ముందు గణపతిని ఆరాధించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఎందుకంటే ఆయనే విఘ్నాలను తొలగించే శక్తి కలవాడు. ఆయనను స్మరించకుండానే ఏ శుభకార్యమూ, ఏ యజ్ఞమూ, ఏ ప్రార్థనయూ ప్రారంభం కాని స్థితి ఏర్పడింది. అందుకే వినాయకుడు "ఆది పూజ" పొందే దేవుడిగా నిలిచాడు.హిందూ పురాణాల్లో వినాయకుని పుట్టుకకు అనేక కథనాలు ఉన్నాయి. ఒక పురాణ కథనం ప్రకారం, పార్వతీ దేవి తన శరీరంలోని గంధంతో ఒక చిన్న వానరాకార శిశువును సృష్టించి, దానికి ప్రాణం పోశారని చెబుతుంది. ఆ బాలకుడే వినాయకుడు. పార్వతీ స్నానం చేస్తున్న సమయంలో శివుడు లోపలికి రావద్దని ఆ బాలకుడు అడ్డుకోవడంతో, ఆగ్రహంతో శివుడు అతని తలను నరికి వేయగా, పార్వతీ ఆవేదనను చూసి గణపతికి ఏనుగు తలను అమర్చాడని కథనం. అందువల్ల గణపతి ఏనుగు తలతో, మానవ దేహంతో ఆవిర్భవించాడని చెప్పబడింది. ఈ రూపం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టింది.గణపతికి అనేక పేర్లు ఉన్నాయి వినాయకుడు, విఘ్నేశ్వరుడు, గణనాథుడు, లంబోదరుడు, గజాననుడు, ఏకదంతుడు మొదలైనవి. ఈ పేర్లన్నీ ఆయన ప్రత్యేకతలను తెలియజేస్తాయి. ఉదాహరణకు, "ఏకదంతుడు" అనే పేరు ఆయన ఒక దంతంతో మాత్రమే ఉండడాన్ని సూచిస్తుంది. "లంబోదరుడు" అనే పేరు ఆయన పెద్ద పొట్టను సూచిస్తుంది. ఆయన పెద్ద పొట్టలో సకల విశ్వమూ నిండి ఉందని ప్రతీకార్థం.గణపతి ప్రతిమలో ప్రతీ భాగానికీ ఒక ప్రతీక ఉంది. ఏనుగు తల జ్ఞానం, మేధస్సు, ధైర్యాన్ని సూచిస్తుంది. పెద్ద చెవులు ఎక్కువ వింటూ తక్కువ మాట్లాడే గుణాన్ని సూచిస్తాయి. చిన్న కళ్ళు ఏకాగ్రతకు ప్రతీక. పెద్ద పొట్టలో విశ్వాన్ని మోసే శక్తి ఉంది. కుడిచేతిలో ఉన్న మోదకం జ్ఞానం ఫలితమని భావిస్తారు. ఎలుక వాహనంగా ఉండటం కూడా ఒక గొప్ప ప్రతీక. చిన్నదైన ఎలుక కూడా పెద్ద పనులు చేయగలదని, వినాయకుడు తన భక్తుల లోపాలను, లోక బంధనాలను అదుపులో పెడతాడని అర్థం.వినాయకుని పూజలో గణేశ చతుర్థి అత్యంత ముఖ్యమైనది. భాద్రపద శుక్ల చతుర్థి రోజున ఆయనకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. మహారాష్ట్రలో గణేశ చతుర్థి అత్యంత వైభవంగా జరుపుకుంటారు. లోకమాన్య తిలక్ ఈ పండుగను సామూహిక ఉత్సవంగా మార్చి, స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక వేదికగా ఉపయోగించారు. అప్పటి నుంచి గణేశ చతుర్థి సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఉత్సవంగా విస్తరించింది.భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ వినాయకునికి ప్రత్యేక స్థానం ఉంది. దక్షిణ భారతంలో గణపతి పూజలు విస్తృతంగా జరుగుతాయి. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో వినాయక నవరాత్రులు, గణేశ నిమజ్జనోత్సవాలు విభిన్న సాంస్కృతిక రంగుల సమ్మేళనంగా జరుగుతాయి. ముంబైలో లల్బాగ్ చా రాజా వంటి గణేశ మండపాలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ఈ ఉత్సవం భక్తులలో భక్తి, ఐక్యత, ఉత్సాహాన్ని కలిగిస్తుంది.వినాయకుడు కేవలం హిందువుల ఆరాధ్య దేవుడే కాదు. బౌద్ధం, జైనం వంటి మతాలలో కూడా గణపతి ప్రస్తావన ఉంది. ఆగ్నేయాసియాలోని అనేక దేశాల్లో నేపాల్, థాయిలాండ్, కంబోడియా, ఇండోనేషియా గణపతి విగ్రహాలు దర్శనమిస్తాయి. ఆయన జ్ఞానం, విజయానికి ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా ఆరాధించబడుతునాడు.వినాయకుని పూజలో మంత్రాల ప్రాముఖ్యత అధికం. "ఓం గం గణపతయే నమః" అనే గణేశ మంత్రం ప్రతి పూజలోనూ వినిపిస్తుంది. విద్యారంభ సమయంలో "గణపతి స్మరణ" ఒక సంప్రదాయంగా ఉంది. పాఠశాలల్లో పిల్లలు మొదటి అక్షరం రాయడం గణపతి ఆరాధనతోనే ప్రారంభిస్తారు. ఇది జ్ఞానానికి గణపతి ఆధారమని సూచిస్తుంది.వినాయకుని తత్త్వం విస్తృతమైనది. ఆయన మనకు చెప్పే బోధలు అనేకం. అడ్డంకులు అనేవి జీవితంలో సహజం. కానీ వాటిని తొలగించే శక్తి మనలోనే ఉందని ఆయన రూపం మనకు తెలియజేస్తుంది. వినయంతో, జ్ఞానంతో, ఏకాగ్రతతో మనం ముందుకు సాగితే ప్రతి విఘ్నమూ తొలగిపోతుందనేది గణపతి పాఠం.ఆధునిక కాలంలో కూడా వినాయకుని పూజ ప్రాముఖ్యత తగ్గలేదు. ఒకప్పుడు కేవలం దేవాలయాల్లో మాత్రమే జరిగే పూజలు ఇప్పుడు గృహాల్లో, సంఘ స్థాయిలో, జాతీయ స్థాయిలో జరుగుతున్నాయి. ఈ పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీకగా మారింది. గణేశ చతుర్థి సందర్భంగా ముస్లింలు, క్రైస్తవులు కూడా భక్తిపూర్వకంగా పాల్గొనడం కనిపిస్తుంది. ఇది వినాయకుడి విశ్వవ్యాప్తిని చూపిస్తుంది.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
గురువారం
04 ၊ సెప్టెంబర్ ၊ 2025

## 'పంజాబ్ డబ్బు పంజాబ్ ప్రజలకే'.. రూ.3.25 కోట్ల నిధులు ప్రకటించిన రాఘవ్ చదా




చండీగఢ్: భారీ వర్షాలు, వరదలకు ప్రభావితమైన పంజాబ్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ రాఘవ్ చద్దా రూ.3.25 కోట్ల నిధులు ప్రకటించారు. పంజాబ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఆయన తన ఎంపీలాడ్స్ నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 'ఇది పంజాబ్ డబ్బు. పంజాబ్ ప్రజల కోసం' అని భావోద్వేగంతో అన్నారు. ఒక వీడియో ద్వారా పంజాబ్ ప్రజలకు సంఘీభావం తెలిపారు. ప్రతి ఒక్కరి భద్రత కోసం ప్రార్థించారు. వరదల కారణంగా 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినందుకు సంతాపం తెలిపారు.కాగా, పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయం, పునరావాసం కోసం ఈ నిధులు వినియోగిస్తామని రాఘవ్ చద్దా తెలిపారు. రూ.3.25 కోట్ల సహాయాన్ని పంజాబ్‌లోని రెండు అత్యంత ప్రభావిత జిల్లాలైన గురుదాస్‌పూర్, అమృత్‌సర్‌కు కేటాయించినట్లు చెప్పారు. గురుదాస్‌పూర్ జిల్లాలోని వరద రక్షణ కట్టలను బలోపేతం చేయడానికి, మరమ్మతుల కోసం రూ.2.75 కోట్లు, అమృత్‌సర్ జిల్లాలో సహాయ, పునరావాస పనులకు రూ.50 లక్షలు ఇస్తానని ఆయన తెలిపారు.

## పంజాబ్ స్ఫూర్తి అంటే ఇదే.. నడుము లోతు నీటిలోనూ సహాయ బృందాలకు టీ అందించిన వృద్ధుడు..



శ్రీనగర్-నవభూమి: భారీ వర్షాలు, వరదలతో ఉత్తర భారతం అతలాకుతలం అవుతున్నది. అనేక రాష్ట్రాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఢిల్లీ, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో కుంభవృష్టి కురిసింది. ఊర్లకు ఊర్లు చెరువులను తలపిస్తుండగా రోడ్లు నీటమునిగిపోయాయి. అనేక ఇళ్లు కొట్టుకుపోయాయి. డజన్ల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడ్డారు. ఇక ఇటీవలే కురిసిన వర్షాలకు పంజాబ్ రాష్ట్రం అతలాకుతలమైన విషయం తెలిసిందే.భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించడంతోపాటు డ్యాంల నుంచి నీటిని విడుదల చేయడంతో పంజాబ్‌లోని 10కిపైగా జిల్లాలు వరదల్లో చిక్కుకున్నాయి. గడచిన 25 ఏళ్లలో మొట్టమొదటిసారి సాధారణం కన్నా 74 శాతం అధిక వర్షపాతం నమోదైంది. వారం రోజుల్లో 30 మందికిపైగా మరణించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 23 జిల్లాల్లోని 1,300 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సాయం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. నడుము లోతు నీటిలో వాలంటీర్లు బాధితులకు సాయంగా నిలుస్తున్నారు.ఈ క్రమంలో తమకు సాయం చేసేందుకు వచ్చిన వాలంటీర్లకు ఓ వృద్ధుడు టీ అందించడం ) అందరినీ ఆకర్షిస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియోను మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. వరదల్లో సర్వం కోల్పోయినా.. సాయం చేసేందుకు వచ్చిన వారికి ఓ కుటుంబం టీ అందించినట్లు పేర్కొన్నారు. పంజాబ్ స్ఫూర్తి అంటే ఇదే.. అంటూ వీడియోకి క్యాప్షన్‌గా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతోంది.ఇక ఈ వర్షాలు, వరదలకు పంజాబ్‌లో భారీ నష్టం వాటిల్లింది. సుమారు 3.5 లక్షలకు పైగా నివాసితులు ప్రభావితమయ్యారు. 20,000 మందిని లోతట్టు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదలు, వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం 122 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసింది. అందులో వేలాది మంది ఆశ్రయం పొందుతున్నారు. వర్షాలు, వరదలకు రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో వరదలో చిక్కుకుపోయిన వారికి ఆహారం, మందులు అందించేందుకు డ్రోన్‌లను మోహరించారు. ఇక ఈ వరదలకు 61,000 హెక్టార్లకు పైగా వ్యవసాయ భూములు నీట మునిగాయి. 2.32 లక్షల ఎకరాలకు పైగా వరి పంట దెబ్బతిన్నది. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## కలకలం రేపిన తెగిన మహిళ తల.. భర్త అరెస్ట్



ముంబై- నవభూమి:ఒక ప్రాంతంలో మహిళ తెగిన తల కనిపించింది. స్థానికంగా కలకలం రేపిన ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేశారు. భార్యను హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికి పడేసిన నిందితుడైన భర్తను అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని భివాండిలో ఈ సంఘటన జరిగింది. నగరంలోని ఈద్గా కాంప్లెక్స్ సమీపంలో మహిళ తెగిన తల కనిపించింది. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. హతురాలి వయస్సు 25 నుంచి 28 ఏళ్ల మధ్య ఉంటుందని అంచనా వేశారు. నరికి పడేసిన మహిళ తలను పోస్ట్‌మార్టం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మరోవైపు ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంట్లో గొడవల కారణంగా భార్యను భర్త దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికి పలు చోట్ల పడేసినట్లు దర్యాప్తులో తెలుసుకున్నారు. నిందితుడైన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ మహిళ మిగతా శరీర భాగాల కోసం వెతుకుతున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## విమానంలో తప్పతాగి వికృత చేష్టలు.. మతపరమైన నినాదాలు చేసిన లాయర్




ముంబై- నవభూమి: విమాన ప్రయాణంలో చోటు చేసుకునే కొన్ని ఘటనలు ప్రముఖంగా వార్తల్లో నిలుస్తుంటాయి. ముఖ్యంగా ప్రయాణికుల ప్రవర్తన చర్చకు దారితీస్తుంటుంది. కొందరు వ్యక్తులు తప్పతాగి వికృతచేష్టలకు పాల్పడుతుంటారు. మరికొందరు తోటి ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటారు. తాజాగా ఓ వ్యక్తి ఇండిగో విమానంలో హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో మతపరమైన నినాదాలు చేస్తూ తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేశారు. ఈనెల 1వ తేదీన (సోమవారం) ఢిల్లీ నుండి కోల్‌కతాకు వెళుతున్న ఇండిగో విమానం 6%E%6571లో ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో గందరగోళం సృష్టించాడు. 31డీ సీటులో కూర్చున్న ప్రయాణికుడు విమానం గాల్లో ఉండగా 'హర హర మహాదేవ' నినాదాలతో హోరెత్తించాడు. క్యాబిన్ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించాడు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో క్యాబిన్ సిబ్బంది అతడిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం విమానం కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోగానే సదరు ప్రయాణికుడిని భద్రతా సిబ్బందికి అప్పగించారు. అతడు ఓ లాయర్‌గా అధికారులు గుర్తించారు.

## శబరిమలలో మహిళల ప్రవేశంపై ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కీలక వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ-నవభూమి:దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో శబరిమల ఆలయం ఒకటి. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెల నుంచి జనవరి నెలల మధ్య శబరిమల ఆలయానికి భక్తులు భారీ ఎత్తున వెళ్తుంటారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా అయ్యప్ప దీక్షలు తీసుకుంటున్న వారి సంఖ్య ప్రతి ఏటా పెరుగుతుంది. మరీ ముఖ్యంగా మకర సంక్రాంతి సమయంలో శబరిమలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. మకరజ్యోతి దర్శనం చేసుకుంటే జన్మ ధన్యం అవుతుందని భావిస్తారు.

అయితే ఇంత ప్రసిద్ధి గాంచిన శబరిమల ఆలయంలోకి మహిళలకు అనుమతి లేదు. పది సంవత్సరాల్లోపు బాలికలు, ఆపై 50 ఏళ్లు పైబడిన వారినే అయ్యప్ప దర్శనానికి అనుమతిస్తారు. దీనిపై ఎప్పటి నుంచో వివాదం నడుస్తోంది. చాలా మంది శబరిమల ఆలయంలోకి ఆడవారిని కూడా అనుమతించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో ఈ అంశంపై తాజాగా శబరిమల దేవస్థాన బోర్డు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ వివరాలు..కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి ఆడవారిని అనుమతించే అంశం మీద ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కీలక వ్యాఖ్యలు చేసింది. భక్తులను మనోభావాలను దృష్టిలో పెట్టుకుంటామని.. అలానే శబరిమల ఆచారాలను పరిరక్షిస్తామని దేవస్థానం బోర్డు తెలిపింది. ఈక్రమంలో ఈ విషయంలో సుప్రీంకోర్టును ఒప్పించడానికి ప్రయత్నిస్తామని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ తెలిపారు. దేవస్థానం బోర్డు కూడా మహిళల ప్రవేశం మీద తన వైఖరిని మార్చుకుందని దీన్ని బట్టి అర్థం అవుతోంది.శబరిమల ఆలయంలోకి మహిళలను అనుమతించే వియషంపై త్వరలోనే న్యాయ నిపుణులతో సంప్రదిస్తామని పీఎస్ ప్రశాంత్ తెలిపారు. ఆ తర్వాత ఆలయంలోకి మహిళల ప్రవేశానికి సంబంధించిన పిటిషనులో కొత్త అఫిడవిట్‌ను సుప్రీంకోర్టులో సమర్పించాలని ట్రావెన్‌కోర్ బోర్డ్ భావిస్తోంది. గతంలో సుప్రీంకోర్టు.. శబరిమల ఆలయంలోకి ఆడవారి ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆలయంలోకి రాకుండా మహిళలపై నిషేధం విధించడం రాజ్యాంగ విరుద్ధమంటూ ఏడు సంవత్సరాల క్రితం అనగా 2018లో సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. అయితే సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ పలుచోట్ల నిరసనలు తెర మీదకు రావడంతో.. విస్తృత ధర్మాసనం దీన్ని సమీక్షిస్తోంది.అయితే శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు వెనకడుగు వేయడం సంచలనంగా మారింది. గతంలో మహిళల ప్రవేశాన్ని అనుమతించిన దేవస్థానం బోర్డు.. ఇప్పుడు వెనకడుగు వేయడం గమనార్హం. అలానే ఈ నెల అనగా సెప్టెంబరు 20న పంబా నది ఒడ్డున 'గ్లోబల్ అయ్యప్ప సమావేశం' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ప్రకటించారు. కేరళ సీఎం పినరయి విజయన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని.. కేవలం ప్రత్యేక ఆహ్వానితులకు మాత్రమే దీనిలో ప్రవేశం ఉంటుందని తెలిపారు.

## మహిళలకు శుభవార్త.. ప్రతి ఒక్కరికి రూ.10 వేలు..



బిహార్ -నవభూమి:మహిళలకు ఇది నిజంగా పండగలాంటి వార్తే అని చెప్పవచ్చు. ప్రతి మహిళకు నెలకు పది వేల రూపాయలు అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం ప్రతి రాష్ట్రంలో మహిళలకు ఆర్థిక స్వాలంభన కలిగించే దుకు అనేక పథకాలు అమలవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాలతో పాటుగా.. నెలకు 2500 రూపాయలు ఇస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇలాంటి హామీలే ఇప్పుడు దేశమంతా విస్తురిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ అడుగు ముందుకు వేసి ఈ మొత్తాన్ని భారీగా పెంచుతున్నారు. తాజాగా బిహార్‌లో కూడా ఇదే విధానాన్ని అమలు చేయబోతున్నారు. త్వరలోనే ఎన్నికలు రాబోతున్న బిహార్‌లో మహిళా ఓటర్లను ఆకట్టుకోవడం కోసం అక్కడి రాష్ట్ర ప్రభుత్వం జీవిక దీదీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆ వివరాలు..బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్.. తాజాగా రాష్ట్రంలోని మహిళల కోసం ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గర్ యోజన పథకాన్ని ప్రకటించారు. మంత్రివర్గం దీన్ని ఆమోదించించడంతో మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ పథకంలో భాగంగా స్వయం ఉపాధి పొందాలని భావించే ప్రతి మహిళకు రూ.10 వేలు ప్రారంభ సహాయంగా అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ పథకం రాష్ట్రంలోని 2.7 కోట్ల కుటుంబాలలోని ప్రతి మహిళకు వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం మహిళలకు ఉపాధి కల్పనతో పాటుగా.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు.ఈ పథకానికి సంబంధించి బిహార్ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి.. దీని ద్వారా కుటుంబంలోని ఒక మహిళ మాత్రమే ప్రయోజనం పొందుతారు.దీని ద్వారా లబ్ధి పొందాలంటే.. సదరు మహిళ తప్పనిసరిగా జీవికా దీదీ స్వయం ఎస్‌హెచ్‌జీలో చేరాలి. స్వయం ఉపాధి పొందాలనుకు మహిళలకు ముందుగా రూ. 10 వేలు ఇస్తారు. ఆరు నెలల తర్వాత సదరు మహిళ తన వ్యాపారంలో విజయం సాధించిందని భావిస్తే.. దాన్ని విస్తరించడానికి రూ.2 లక్షల వరకు రుణం ఇవ్వనున్నారు.ఈ పథకంలో భాగంగా మొదటి దశలో రూ.10 వేలు అందజేస్తారు. ఆ తరువాత వ్యాపార పరిస్థితిని బట్టి రూ.15 వేలు, రూ.75 వేలు లేదా గరిష్టంగా రూ.2 లక్షల రుణం ఇవ్వనున్నారు. వడ్డీ రేటు సంవత్సరానికి 12% ఉంటుంది. అయితే మహిళలపై భారం పడకుండా ఉండటానికి తిరిగి చెల్లించే వ్యవధి 1-3 సంవత్సరాల మధ్య నిర్ణయించారు.జీవికా దీదీ యోజనను బీహార్ గ్రామీణ జీవనోపాధి ప్రమోషన్ కమిటీ నిర్వహిస్తుంది. ఇది 2006లో ప్రపంచ బ్యాంకు సహాయంతో ప్రారంభమైంది. ప్రస్తుతం రాష్ట్రంలో 10.81 లక్షల స్వయం సహాయక బృందాల్లో 1.34 కోట్ల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందాలు వ్యవసాయం, పశుసంవర్ధకం, హస్తకళలు, కిరాణా దుకాణాలు, కుట్టు-ఎంబ్రాయిడరీ, చిన్న పరిశ్రమల నుంచి మహిళల ఆదాయాన్ని పెంచుతున్నాయి. ఇటీవల ఈ స్వయం సహాయక బృందాలు జీవికా నిధి క్రెడిట్ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కింద ఏర్పడ్డాయి. ఇది బ్యాంకు లాగా చౌక ధరలకు మహిళలకు రుణాలు అందిస్తుంది.


## సీఏఏ కింద ముగ్గురు విదేశీయులకే పౌరసత్వం కల్పించాం: అస్సాం సీఎం



గౌహతి-నవభూమి: అస్సాంలో కేవలం ముగ్గురు విదేశీయులకు మాత్రమే పౌరసత్వ సవరణ చట్టం 2019 కింద భారతీయ పౌరసత్వాన్ని కల్పించినట్లు సీఎం హిమంత బిశ్వ శర్మతెలిపారు. మొత్తం 12 మంది దరఖాస్తు చేసుకోగా, దాంట్లో ముగ్గురికే పౌరసత్వం ఇచ్చినట్లు చెప్పారు. సీఏఏ ద్వారా లక్షల సంఖ్యలో విదేశీయులు పౌరసత్వం పొందే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో అస్సాం సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మరో 9 మంది అంశం పర్యశీలినలో ఉన్నట్లు సీఎం వెల్లడించారు. సుమారు 20 నుంచి 25 లక్షల మందికి అస్సాంలో పౌరసత్వం ఇస్తారని ఆరోపణలు వస్తున్నాయని, కానీ ఇప్పటికి 12 దరఖాస్తులే అందాయని, దీన్ని బట్టి మీరే అర్థం చేసుకోవాలని సీఎం అన్నారు. కొత్త సీఏఏ చట్టం కింద పౌరసత్వం పొందిన తొలి వ్యక్తిని దులన్ దాస్‌గా గుర్తించారు. అతని వయసు 50 ఏళ్లు. ఆగస్టు 2024లో ఆయనకు భారతీయ పౌరసత్వం వచ్చింది.బంగ్లా, పాక్, ఆఫ్ఘన్ దేశాల్లో మతపరమైన వేధింపులకు గురై భారత్‌లో ఆశ్రయం కోసం వచ్చిన హిందువులు, సిక్కులు, జైనులు, క్రైస్తవులు, బౌద్ధులకు పౌరసత్వం కల్పించేందుకు సర్కారు సీఏఏ చట్టాన్ని తయారు చేసింది. అయితే 2014, డిసెంబర్ 31వ తేదీ లోపు ఇండియాలోకి ప్రవేశించి, అయిదేళ్లు పూర్తి చేసుకున్న వారికి పౌరసత్వం ఇవ్వనున్నారు.

### అమెరికా మరింత రగిలిపోయేలా..

## భారత్‌కు బంపరాఫర్ ఇచ్చిన రష్యా!



రషా-నవభూమి:రష్యా నుంచి క్రూడాయిల్ కొనుగోలు చేస్తుందనే వంకతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలతో కక్షసాధింపులకు దిగింది. అయితే, అగ్రరాజ్యాన్ని మరింత రెచ్చగొట్టేలా.. భారత్‌కు రష్యా బంపరాఫర్ ఇచ్చింది. ఆయిల్ ధరలపై మరింత డిస్కౌంట్ ప్రకటించింది. ఇప్పటికే భారత్‌కు డిస్కౌంట్ ధరలకు ఆయిల్ అమ్ముతోన్న రష్యా.. తాజాగా బ్యారెల్‌కు 3 నుంచి 4 డాలర్ల మేర తగ్గించింది. భారత్ కొనుగోలు చేసే క్రూడాయిల్‌పై రష్యా ఉరల్ గ్రేడ్ ధరలు తగ్గించినట్టు ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. నివేదిక ప్రకారం.. సెప్టెంబర్ చివరి, అక్టోబర్‌లలో లోడ్ అయ్యే కార్గోలకు రష్యా తక్కువ ధరకు అందిస్తోంది.

రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్ యుద్ధానికి ఆర్థిక వనరుగా భారత్ మారిపోయిందని ఆరోపిస్తూ డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం అదనపు సుంకాలు ఆగస్టు 27 నుంచి అమల్లోకి వచ్చాయి. ఉక్రెయిన్‌పై దండయాత్ర తర్వాత రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు దిగుమతి చేసుకుంటోన్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. దీనిపై అమెరికా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సుంకాలతో బెదిరింపులకు దిగింది. దీంతో గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతంగా భారత్, అమెరికాల మధ్య వాణిజ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.చైనాలోని తియాంజిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సదస్సులో కూడా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా-భారత్ మధ్య ఉన్న సంబంధం 'ప్రత్యేకమైనది' అని పేర్కొన్నారు. అలాగే, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, మోదీ మధ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెండు దేశాలు ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని ప్రతిజ్ఞ చేశాయి. ముగ్గురు నేతలూ ఒకే వేదికపై కలవడంతో అమెరికా మరింత రగిలిపోతుంది. భారత్‌పై విమర్శలను తీవ్రతరం చేసింది. ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో.. రష్యా ఆయిల్ వల్ల భారత్‌లో (బ్రాహ్మణ్' వర్గాలు (సంపన్న వర్గాలు) లాభాలు గడిస్తున్నాయని ఆరోపించారు.ఉక్రె యిన్‌పై యుద్ధం ప్రారంభానికి ముందు రష్యా నుంచి కనీసం తన దేశీయ అవసరాల్లో ఒక్క శాతం కూడా చమురు దిగుమతి చేసుకోని భారత్.. ఫిబ్రవరి 2022 తర్వాత అతిపెద్ద దిగుమతి దారుగా మారిపోయిందని దుయ్యబట్టారు.రష్యా కోసం భారత్ లాండ్రీ షాపు నడుపుతోందని, తక్కువ ధరకు ఆయిల్ కొంటూ దానిని శుద్ధిచేసి ఐరోపా, ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని దేశాలకు అధిక లాభాలకు అమ్ముతోందని నవారో ఆరోపణలు చేశారు. రష్యాపై ఆంక్షలు విధించినా.. భారత్ మాత్రం నిబంధనలు ఉల్లంఘించి దిగుమతి చేసుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు.

## గణేష్ ఊరేగింపులోకి దూసుకెళ్లిన వాహనం.. ముగ్గురు మృతి, 22 మందికి గాయాలు



రాయ్‌పూర్-నవభూమి:గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం కోసం ఊరేగింపుగా తీసుకెళ్తున్న జనంపైకి వాహనం దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించారు. 22 మంది గాయపడ్డారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని జాష్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం రాత్రి జురుదండ్ గ్రామంలో నిర్వహించిన గణేష్ ఊరేగింపులో వంద మందికిపైగా స్థానికులు పాల్గొన్నారు.కాగా, మద్యం మత్తులో డ్రైవ్ చేసిన వ్యక్తి ఎస్‌యూవీతో ఆ ఊరేగింపులోకి దూసుకెళ్లాడు. ఈ సంఘటనలో ముగ్గురు మరణించగా, 22 మంది గాయపడ్డారు. మృతులను 17 ఏళ్ల విపిన్ ప్రజాపతి, 19 ఏళ్ల అరవింద్ కెర్కెట్టా, 32 ఏళ్ల ఖిరోవతి యాదవ్‌గా గుర్తించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. సుర్గుజా జిల్లాలోని అంబికాపూర్ మెడికల్ కాలేజీకి వారిని తరలించినట్లు చెప్పారు.మరోవైపు మద్యం సేవించి డ్రైవ్ చేసిన ఎస్‌యూవీ డ్రైవర్ అయిన 40 ఏళ్ల సుఖ్‌సాగర్ వైష్ణవ్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## రిజర్వేషన్లపై మరాఠాలకు విజయం.. 'హైదరాబాద్ గెజిట్' అమలుకు ప్రభుత్వం ఆమోదం



రిజర్వేషన్ల పోరాటంలో మరాఠాలు విజయం సాధించినట్టు సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే ప్రకటించారు. మరాఠాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై మహారాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉప-సంఘం తమ డిమాండ్లలో చాలావరకు ఆమోదించినట్టు ఆయన వెల్లడించారు. అర్హులైన మరాఠాలకు క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీ కూడా అందులో ఉందని తెలిపారు. అయితే, ఆందోళనలు కొనసాగిస్తోన్న ముంబయిలోని ఆజాద్ మైదానాన్ని ఖాళీ చేసేందుకు సెప్టెంబరు 3 ఉదయం వరకు జరాంగేకు బాంబే హైకోర్టు గడువు ఇచ్చింది. మరాఠాలకు రిజర్వేషన్లు కోరుతూ మనోజ్ జరాంగే నాలుగు రోజుల కిందట నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో ఆజాద్ మైదానానికి మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ నేతృత్వంలోని ఉప-సంఘం చేరుకుని ఆయనను కలిసింది. మరాఠా కోటాకు సంబంధించిన 'హైదరాబాద్ గెజిట్'ను అమలు చేయాలనే డిమాండ్‌ను అంగీకరించింది. గతంలో పెట్టిన కేసులను ఈ నెలాఖరుకి ఉపసంహరించుకుంటామని సబ్-కమిటీ తెలిపింది. అంతేకాదు, ఆందోళనల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం, వారి కుటుసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వనున్నట్టు హామీ ఇచ్చింది.కున్బీల మాదిరిగా మరాఠాలను ఓబీసీలుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీకి చట్టపరమైన అవకాశాలను పరిశీలిస్తున్నామని, ఇందుకు రెండు నెలల సమయం పడుతుందని మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ వివరించారు. తమను ఓబీసీలుగా గుర్తించి విద్యా, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 29న జరాంగే నిరాహార దీక్షను ప్రారంభించారు. తాజాగా, ప్రభుత్వం వారి డిమాండ్లకు అంగీకరించినట్టు ప్రకటించడంతో ఆజాద్ మైదానం, పరిసరాల్లోని మరాఠా నిరసనకారుల్లో సంబరాలు చేసుకున్నారు. మంగళవారం రాత్రి 9 గంటలకు ముంబయిను వీడుతున్నట్టు ఆందోళనకారులు ప్రకటించారు.మరాఠా కోటా కోసం హైదరాబాద్ గెజిట్ అమలుకు క్యాబినెట్ సబ్-కమిటీ అంగీకరించిందని పాటిల్ చెప్పారు. మరాఠ్వాడా ప్రాంతంలోని మరాఠాలను అధికారికంగా వెనుకబడిన వర్గమైన కున్బీలుగా గుర్తించాలని, అందుకు హైదరాబాద్ గెజిట్‌ను జారీ చేయాలని పాటిల్ పట్టుబడుతున్నారు. రిజర్వేషన్లను రాజకీయ చర్యగా కాకుండా, చారిత్రక గుర్తింపు పునరుద్ధరణగా గెజిట్ సహకరిస్తుందనేది ఆయన విశ్వాసం. మహారాష్ట్రలోని కున్బీ సమాజం ఓబీసీలు. మరాఠ్వాడా ప్రాంతం ఒకప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉండేది. దీంతో మరాఠాలు 'హైదరాబాద్ గెజిట్' అమలుకు డిమాండ్ చేస్తున్నారు.

## వాళ్లు పాస్‌పోర్టు లేకున్నా మన దేశంలో ఉండవచ్చు.. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు

న్యూఢిల్లీ-నవభూమి:పొరుగు దేశాల నుంచి వచ్చిన మైనారిటీలకు భారత ప్రభుత్వం పాస్‌పోర్టుల విషయంలో ఊరటనిచ్చింది. బంగ్లాదేశ్ ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్‌దేశాల్లో మతపరమైన పీడనను భరించలేక భారత్‌కు వచ్చిన మైనారిటీలు (హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రిస్టియన్ మతస్తులు) మన దేశంలో పాస్‌పోర్టుగానీ, ఎలాంటి ట్రావెల్ డాక్యుమెంట్లుగానీ లేకుండా ఉండేందుకు కేంద్ర హోంశాఖ అనుమతినిచ్చింది.అయితే గత ఏడాది అమల్లోకి వచ్చిన సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ ఆక్ట్ ప్రకారం.. 2014 డిసెంబర్ 31 కంటే ముందు పాక్, ఆఫ్ఘన్, బంగ్లాదేశ్‌ల నుంచి భారత్‌కు వచ్చిన మైనారిటీలకు మాత్రమే పాస్‌పోర్టు లేకున్నా నివాసం ఉండే అవకాశం ఉంటుంది. కానీ 2014 తర్వాత కూడా వచ్చిన చాలామంది మైనారిటీల పరిస్థితి దయనీయంగా మారుతుంది. అందుకే కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ 2025' కింద తాజా ఆదేశాలు జారీచేశారు.తాజా ఆదేశాల ప్రకారం.. 2024 డిసెంబర్ 31 వరకు భారత్‌కు వచ్చిన అందరికీ పాస్‌పోర్టు రిలీఫ్ లభిస్తుంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి 2024 డిసెంబర్ 31 కంటే ముందు భారత్‌కు వచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రిస్టియన్ మైనారిటీలు ఎలాంటి పాస్‌పోర్టులు, ట్రావెల్ డాక్యుమెంట్‌లు లేకుండా ఉన్నా, కలిగి ఉన్నా, లేదంటే ఆ డాక్యుమెంట్‌లు కాలం చెల్లినవి అయి ఉన్నా వారు ఇక్కడ ఉండేందుకు అర్హులని ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ 2025 చెబుతోందని హోంశాఖ తెలిపింది.



## కాలిపోయే కాఫీలతో క్యాన్సర్

మనలో చాలా మందికి ఉదయాన్నే పొగలు కక్కే కాఫీ గొంతు దిగందే రోజు మొదలవ్వదు. అయితే 65 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించిన కాఫీలు, టీలతో నోరు కాలితే ఫర్వాలేదు. అత్యంత ప్రమాదకరమైన అన్నవాహిక క్యాన్సర్ ముప్పు పెరుగుతుందనే ఒక అధ్యయనం నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ అండ్ గ్లోబల్ స్టడీసలో ప్రచురితమైంది. పదే పదే అన్నవాహిక వేడి పానీయాలకు బహిర్గతమైనప్పుడు, ఇన్‌ఫ్లమేషన్ తలెత్తి, కణాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. నిజానికి వేడి పానీయాలు క్యాన్సర్ ముప్పును పెంచుతాయనే విషయం ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కానీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గత కొన్నేళ్లుగా వేడి పానీయాలకూ, క్యాన్సర్‌కూ మధ్య ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేస్తోంది. ఈ సంస్థ, 65 డిగ్రీలకు మించిన వేడి పానీయాలను క్యాన్సర్ కారకాలుగా వర్గీకరించింది. ఇక్కడ తాగే పానీయంతో సంబంధం లేదు. టీ, కాఫీ, గ్రీన్ టీ, సూప్, వేడి నీళ్లు... ఇలా 65 డిగ్రీలకు మించి వేడిగా ఉన్న ఏ పానీయాన్ని తాగినా అన్నవాహిక లోపలి పొర దెబ్బతిని, కణాల్లో మార్పులు చోటుచేసుకుని, ఆ పరిస్థితి క్యాన్సర్‌కు దారి తీస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. వేడి టీ లేదా నీళ్లు ఎక్కువగా తాగే అలవాటున్న ఇరాన్, చైనా, దక్షిణమెరికా ప్రజల్లో అత్యధికంగా అన్నవాహిక క్యాన్సర్ బయల్పడడాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సందర్భంగా ప్రస్తావిస్తోంది. ఇలాంటప్పుడు ఎంత వేడి పానీయాలు తాగడం సురక్షితం అనే ప్రశ్న తలెత్తవచ్చు. పెదవులు కాలేంత వేడిగా ఉండే టీ లేదా కాఫీ కచ్చితంగా అన్నవాహికను కూడా కాలుస్తుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి.



# నారీ యువ శక్తి గెలుస్తుంది





'లే.. మేలుకో... లక్ష్యం చేరుకునే దాకా విశ్రమించకు' అన్నారు స్వామి వివేకానంద. 'వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం' అన్నాడాయన. మన దేశంలో 15%--%25 ఏళ్ల మధ్య యువత 20 కోట్లు. వీరిలో 10 కోట్ల మంది యువతులు. ఇంటర్ వయసు నుంచి ఉద్యోగ వయసు మీదుగా వివాహ వయసు వరకు అమ్మాయిలకు ఎన్నో సవాళ్లు. వివక్షలు. ప్రతికూలతలు. కాని నారీ యువశక్తి వీటిని ఛేదించి ముందుకు సాగుతోంది. జనవరి 12%--% స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జరుపుకునే 'జాతీయ యువజన దినోత్సవం' యువతులకు స్ఫూర్తినివ్వాలి. మార్గం చూపాలి. అంతరిక్షాన్ని చుంబించాలనుకున్న ఒక తెలుగు యువతి ఆ ఘనతను సాధించడం చూశాం. ఇంటి నుంచి బస్టాప్ వరకూ వెళ్లి కాలేజీ బస్సెక్కడానికి పోకిరీల బెడదను ఎదుర్కొంటున్న యువతి నిస్సహాయతను కూడా చూస్తున్నాం. ఇద్దరూ యువతులే. ఒకరు సాధిస్తున్నారు. మరొకరు సాధించడానికి అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. ఈ రెండు బిందువుల మధ్యే భారతీయ టీనేజ్ అమ్మాయిలు, యువతులు తమ గమనాన్ని కొనసాగిస్తున్నారు. 'కెరటం నాకు ఆదర్శం లేచినా పడినందుకు కాదు... పడినా లేచినందుకు' అంటారు స్వామి వివేకానంద. గత మూడు నాలుగు దశాబ్దాలలో భారతీయ యువతులు పడినా లేచే ఈ సంకల్పాన్నే ప్రదర్శిస్తున్నారు. బాల్య వివాహాలను నిరాకరిస్తున్నారు. చదువు వైపు మొగ్గుతున్నారు. ఆ తర్వాత ఉద్యోగాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇంకా చెప్పాలంటే జీవిత భాగస్వామి ఎంపికలో ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. అయితే ఈ పరిస్థితి మధ్యతరగతి, ఆ పై తరగతుల్లో ఎక్కువగా ఉంటే దిగువ, పేద వర్గాలలో సంఘర్షణ కొనసాగించాల్సి వస్తోంది. దేశంలో ఇంకా చాలాచోట్ల సరైన టాయిలెట్లు లేని బడులు, సురక్షితం కాని రహదారులు, శానిటరీ నాప్‌కిన్‌లు అందుబాటులో లేని పరిస్థితులు ఆడపిల్లలను స్కూల్ విద్యకు దూరం చేస్తున్నాయి. కాలేజీ వయసులోకి రాగానే తల్లిదండ్రులు తమ అమ్మాయి 'ఎటువంటి ప్రభావాలకు లోనవుతుందో' అనే భయంతో పెళ్లి చేసేయడానికి ప్రయత్నిస్తున్నారు. కాని నేటి యువతులు చిన్న చిన్న ఉద్యోగాలు చేసైనా సరే ముందు మేము నిలదొక్కుకోవాలి... తర్వాతే వివాహం వైపు రావాలి అని చాలాచోట్ల గట్టిగా గొంతు విప్పగలుగుతున్నారు.

'నీ వెనుక ఏముంది... ముందు ఏముంది నీకనవసరం... నీలో ఏముంది అనేది ముఖ్యం' అన్నారు వివేకానంద. ఇవాళ యంగ్ అడల్ట్స్‌లోగాని, యువతులలోగాని ఉండాల్సింది ఈ భావనే. ముందు తమను తాము తెలుసుకోవాలి. ఆ సంగతి తల్లిదండ్రులకు తెలియచేయాలి. ఆ తర్వాత ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి. దానిని అందుకోవడానికి ప్రయత్నించాలి. కాని నేటి సమస్య ఏమిటంటే యువతులకు తాము ఏమిటో తెలిసినా తల్లిదండ్రుల ఆకాంక్షలకు తల వొంచాల్సి వస్తోంది. మరోవైపు వారి మీద అటెన్షన్, నిఘా, వేయి కళ్ల కాపలా... ఇవన్నీ వారిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. 'అదొద్దు ఇది చెయ్' అని అమ్మాయికి చెప్పినంత సులువుగా అబ్బాయికి చెప్పలేని పరిస్థితి నేటికీ ఉందన్నది వాస్తవం. దాంతో పాటు తల్లిదండ్రులు, చుట్టాలు, సమాజం ఆడపిల్లల విషయంలో వారు అన్ని విధాలుగా పర్‌ఫెక్ట్‌గా ఉండాలన్న అంచనా వారిని బాధిస్తోంది. కాని వారికి ఇంట్లో, విద్యాలయాల్లో సరైన దిశ దొరికితే వారు ఆకాశమే హద్దుగా ఎదుగుతున్నారు. ఇవాళ టెక్నికల్ విద్యలో, మెడిసిన్‌లో అమ్మాయిలు రాణిస్తున్నారు. ఎంచుకుని మరీ ర్యాంకులు సాధిస్తున్నారు. మరోవైపు మేనేజ్‌మెంట్ రంగాల్లో, సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో యువతులు రాణిస్తున్నారు. కళారంగాలను ఎంచుకుంటున్నారు. సినిమా రంగ దర్శకత్వ శాఖలో గతంలో యువతులు కనిపించేవారు కాదు. ఇవాళ చాలామంది పని చేస్తున్నారు. విదేశాలకు వెళ్లి చదవడానికి, ఉన్నత ఉద్యోగాలు చేయడానికి వారి దగ్గర పుష్కలంగా ప్ర తి భ ఉంది. మనం చేయవలసిందల్లా వారు కనుగొన్న మార్గంలో వారిని వెళ్లనివ్వడమే. 'జీవితంలో రిస్క్ తీసుకో. గెలిస్తే విజేత అవుతావు. ఓడితే ఆ అనుభవంతో దారి చూపగలుగుతావు' అన్నారు వివేకానంద. 'ఆడపిల్ల... రిస్క్ ఎందుకు' అనే మాట గతంలో ఉండేది. ఇవాళ కూడా ఉంది కాని ఎందరో యువతులు ఇవాళ పోలీస్, రక్షణ దళాలలో పని చేస్తున్నారు. విమానాలు, హెలికాప్టర్లు ఎగరేస్తున్నారు. యుద్ధ ఓడలు నడుపుతున్నారు. ఈ స్ఫూర్తి కొనసాగుతూ ఉంది. ఈ స్ఫూర్తి కొనసాగాల్సి ఉంది. పర్వతారోహకులుగా, సోలో ట్రావెలర్సుగా, హెవీ వెహికిల్స్ డ్రైవర్లుగా, ప్రమాదకరమైన అసైన్‌మెంట్లు చేసే జర్నలిస్టులుగా ఇలా నేటి యువతులు అద్భుతాలు సాధిస్తున్నారు. యుద్ధ ట్యాంకర్లు మోగుతున్న చోట నిలబడి వారు రిపోర్టింగ్ చేసే సన్నివేశాలు స్ఫూర్తినిస్తున్నాయి. స్వామి వివేకానంద ఆశించిన యువత ఇదే. ఇలాంటి యువతకు సమాజం, కుటుంబం దన్నుగా నిలవడమే చేయాల్సింది. 'మనం ధనం కోల్పోతే కొంత కోల్పోయినట్టు కాని వ్యక్తిత్వం కోల్పోతే సర్వం కోల్పోయినట్టు' అన్నారు వివేకానంద. స్త్రీ వ్యక్తిత్వ నిర్మాణం కుటుంబ నిర్మాణం అవుతుంది. తద్వారా సమాజ నిర్మాణం అవుతుంది. ఆపై దేశ నిర్మాణం అవుతుంది. నేటి యువతులు కేవలం విద్య, ఉపాధి రంగాలలో రాణించడం కాకుండా ప్రపంచ పరిజ్ఞానం కలిగి, సామాజిక పరిణామాలు గమనిస్తూ, పాటించవలసిన విలువలను సాధన చేస్తూ వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలి. నాయకత్వం వహించడానికి ముందుకు రావాలి. చట్ట సభలలో కూచునే శక్తి సామర్థ్యాలు పుణికి పుచ్చుకోవాలి. యువశక్తి దేశాన్ని నడిపించాలి. కాని నేటి సోషల్ మీడియా వారిని విపరీతంగా కాలహరణం చేయిస్తోంది. 'హ్యాపెనింగ్'గా ఉండమని ఛోటామోటా సరదాలకు ఆకర్షిస్తోంది. మిగిలినవారిని ఇమిటేట్ చేయమంటోంది. అలా ఉండాలేమోనని కొంతమంది యువతులు డిప్రెషన్‌లోకి వెళ్లాల్సి వస్తోంది. 'మీరెలా ఆలోచిస్తే అలాగే తయారవుతారు. బలహీనులుగా భావిస్తే బలహీనులే అవుతారు. శక్తిని స్మరిస్తే శక్తిమంతులే అవుతారు' అన్నారు వివేకానంద. నేటి యువ మహిళా శక్తి ఈ మాటను తప్పక గుర్తు పెట్టుకుని ముందుకు సాగాలి. మరిన్ని విజయాలు సాధించాలి. మొదటి అడుగులోనే...సక్సెస్ అయ్యాక సొసైటీ నుంచి పొగడ్తలు వస్తాయి. అదే, ముందే ప్రోత్సాహం ఉంటే అమ్మాయిలు ఎదగడానికి మంచి అవకాశాలు లభిస్తాయి. నేను, నా బిజినెస్ పార్టనర్ శ్రుతి బీటెక్‌లో స్నేహితులం. ఇద్దరం కలిసి 'మాయాబజార్' అని ఫొటోషూట్ స్టూడియోను ప్రారంభించాం. మేం ప్రారంభించినప్పుడు ఈ బిజినెస్‌లో పెద్దగా పోటీ లేదు. ఇప్పుడు మేం సక్సెస్ అయ్యాం. అందరూ వచ్చి అమ్మాయిలు ఇంత బాగా చేశారు. ఎంత కష్టపడ్డారు... అని అంటుంటారు. కానీ, దీని ప్రారంభంలో మేం పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మా ఇద్దరి అమ్మానాన్నలు నమ్మారు. డబ్బుల విషయం ఒక్కటే కాదు. అమ్మాయిలు సొంతంగా ఏదైనా పని చేయాలనుకుంటే అందుకు చుట్టుపక్కల అంతా మంచి మద్దతు లభించాలి. మా టెక్నీషియన్స్, వర్కర్స్.. ఇప్పుడు సపోర్ట్ చేస్తున్నారు. కానీ, మొదట్లో లేదు. 'వీళ్లు అమ్మాయిలు కదా ఏం చేస్తారు?' అనే ఆలోచన ఉంది. మమ్మల్నే నేరుగా అనేవారు. డబ్బులు పెట్టినా సరే, దాదాపు పదిమందిని అడిగితే ఒకరు ముందుకు వచ్చేవారు. హార్డ్‌వర్క్ చేయడానికి అమ్మాయిలు ముందుకు వచ్చినప్పుడు సమాజం నుంచి 'మీరు అమ్మాయిలు కదా! ఎందుకు మీకు కష్టం..' అనే అభిప్రాయం వస్తుంది. మొదటి వ్యక్తి నుంచే సరైన రెస్పాన్స్ వస్తే.. అ వ మ్మా ం ు ు ల ు సొ ం త ం గా ఎదగడానికి మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. అనూష, శ్రుతి..'అమ్మాయి కదా' అని...అమ్మాయిలు వర్కర్స్‌తో పనిచేయించాలన్నా, ఆర్డర్స్ తీసుకునేటప్పుడు, పేమెంట్ తిరిగి రాబట్టుకోవడానికి.. అన్ని విధాల రకరకాల సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. 'అమ్మాయి కదా, ఏం కాదులే!' అని తేలికగా తీసుకుంటారు. సింగిల్‌గా ఎదగాలంటే అబ్బాయిలకు ఉన్నంత సపోర్ట్ ఈ సొసైటీలో అమ్మాయిలకు లేదు. అందుకే ప్రతిభ ఆధారంగానే నా పనితనాన్ని చూపుతాను. మార్కెట్‌ను బట్టి 3%--%4 చ ా ం ు ు న్ ల ు వి ని యో గ దా ర ు ల కు ఇస్తాను. ఇంటీరియర్‌లో అబ్బాయిల కన్నా అమ్మాయిలకే ఎక్కువ తెలుసు. ఎందుకంటే ఇంట్లో ఎక్కడ ఏ వస్తువును ఎలా సర్దుకోవాలో అమ్మాయిలకే బాగా తెలుసు. ఆ విధంగా కూడా నా వర్క్‌ను చెప్పుకోవాల్సి ఉంటుంది.

అ భి న ం ద న ల ు తెలియజేస్తూ 'హిస్టరీ ఇన్ మేకింగ్' అని ట్విట్ చేసింది సీఆర్పీఎఫ్. 2012లో వరల్డ్ ఫస్ట్ 'ఆల్ ఉమెన్ పారామిలటరీ పైప్‌బ్యాండ్'ను ఏర్పాటు చేసింది సీఆర్‌పీఎఫ్.

# స్త్రీ శక్తి.. మరో అడుగు

శిక్షణలో ఉమెన్ వారియర్స్

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్) స్త్రీసాధికారత, శక్తియుక్తులకు సంబంధించి మూడు చారిత్రక అద్భుతాలకు వేదిక అయింది.

**కొన్ని నెలలు వెనక్కి వెళితే...**


నక్సల్స్‌ను ఎదుర్కోవడం కోసం ఏర్పాటు చేసిన 'కోబ్రా కమాండో'లో మహిళల ప్రాతినిధ్యం లేదు. అయితే 34 మంది మహిళలతో 'కోబ్రా' దళాన్ని ఏర్పాటు చేసి మహిళలు లేని లోటును పూరించారు. 'కోబ్రా'కు ఎంపికైన వారియర్స్ మూడు నెలల పాటు అడవుల్లో కఠినమైన శిక్షణ తీసుకున్నారు. గుర్‌గ్రామ్ కదార్‌పూర్‌లో కోబ్రా వుమెన్ వారియర్స్ ప్రదర్శించిన యుద్ధవిన్యాసాలు అబ్బురపరిచాయి. వారి మాటల్లోని ఆత్మవిశ్వాసం ఆకట్టుకుంది. శిక్షణ పూర్తి

ఇక తాజా విషయానికి వస్తే...

సీఆర్పీఎఫ్ జడ్‌ప్లస్ కేటగిరి కోసం విధులు నిర్వహించడానికి ఎంపికైన 32 మంది ఉమెన్ వారియర్స్ వివిధ విభాగాల్లో పదివారాల పాటు శిక్షణ పొందారు. ఈ నెలలోనే కొత్త బాధ్యతల్లోకి వెళ్లనున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్... మొదలైన వారికి రక్షణగా నిలవనున్నారు. రాబోయే అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో వీఐపీ రాజకీయ నాయకుల రక్షణ బాధ్యతల్లో పాలుపంచుకోనున్నారు. గతంలో జడ్‌ప్లస్ కమాండో విభాగంలో పురుషులు మాత్రమే ఉండేవారు. తాజా అడుగుతో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది సీఆర్పీఎఫ్.



# కల్తీ లేని నెయ్యి దొరుకుతుందా?



మంది ఎంత పెరిగినా, బజార్లో దొరికే నేతి మిఠాయిలకు కొదవుండదు. ఇక్కడే నెయ్యి తాజాదనం గురించి తార్కికంగా ఆలోచించాలి. స్వచ్ఛమైన నెయ్యిని పొందడం కోసం కల్తీలను పసిగట్టడంతో పాటు, ఇంట్లో స్వయంగా నేతిని తయారుచేసుకోగలిగే మెలకువల గురించి తెలుసుకోవాలి.

**కల్తీ లేని నెయ్యి దొరుకుతుందా?**

మంది ఎంత పెరిగినా, బజార్లో దొరికే నేతి మిఠాయిలకు కొదవుండదు. ఇక్కడే నెయ్యి తాజాదనం గురించి తార్కికంగా ఆలోచించాలి. స్వచ్ఛమైన నెయ్యిని పొందడం కోసం కల్తీలను పసిగట్టడంతో పాటు, ఇంట్లో స్వయంగా నేతిని తయారుచేసుకోగలిగే మెలకువల గురించి తెలుసుకోవాలి. మనం కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు పెంచుకుంటాం. పప్పుధాన్యాలు పండించుకుంటాం. కోళ్లు, మేకలను పెంచుకుంటాం! తిరగళ్లతో పిండ్లు ఇసురుకుం టాం! కానీ ఘన, ద్రవ రూపాల్లోని కొవ్వులను మాత్రం బయటి నుంచే కొనుక్కుంటూ ఉంటాం! వంటల కోసం, రుచి కోసం ఉపయోగించే నూనెలు, నెయ్యిలను ఇళ్లలో తయారు చేసుకునే సంప్రదాయం క్రమేపీ అడుగంటింది. అవసరం పెరగడం, ఉత్పత్తులు తగ్గడం వల్ల కల్తీలు సర్వత్రా సర్వసామాన్యపోయాయి. నెయ్యిలోని పోషక విలువల గురించి అవగాహన పెరిగిన తర్వాత, తాజా నెయ్యి కోసం వెంపర్లాట ఊపందుకుంది. కానీ కల్తీ లేని నెయ్యి బజార్లో దొరుకుతుందా? నిజానికి ఎంత ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నా, నూరు శాతం స్వచ్ఛమైన నెయ్యి దొరకని పరిస్థితి నెలకొని ఉంది. అయినా పిండి వంటల తయారీ కోసం, భోజనంలో రుచిని పెంచుకోవడం కోసం తరచూ నెయ్యి మీద ఆధారపడక తప్పడం లేదు. దాంతో మార్కెట్లో దొరికే బ్రాండెడ్ ఫీల మీద ఆధార పడుతున్నాం. లేదంటే గ్రామాల్లో గాలించి తెచ్చుకుంటు న్నాం. అయితే ఇలా మనం స్వచ్ఛమైన నెయ్యినే కొంటున్నామా?

కల్తీ నెయ్యిని ఇలా కనిపెట్టాలి


నెయ్యి విషయంలో కళ్లు, ముక్కు మనల్ని మోసం చేయలేవు. ఘుమఘుమలాడుతూ, లేత బంగారు రంగులో కనిపించేది మాత్రమే స్వచ్ఛమైన నెయ్యి. రంగు, వాసనలు, గాఢతలో తేడాలు కనిపిస్తే, కొన్ని తేలికపాటి పరీక్షలతో నెయ్యిలో జరిగిన కల్తీని సునాయాసంగా కనిపెట్టవచ్చు.

అదెలాగంటే...పాల అవక్షేప పరీక్ష: తెల్ల పేపర్ లేదా ప్లేటు మీద ఒక స్పూను నెయ్యిని వేసి, కొన్ని గంటల పాటు అలాగే వదిలే యాలి. తర్వాత పేపర్, లేదా ప్లేటు మీద ఏవైనా మలినాలు, అవక్షేపాలు కనిపిస్తే ఆ నెయ్యి కల్తీదని అర్థం చేసుకోవాలి. స్వచ్ఛమైన నెయ్యితో ఎలాంటి మరకలు ఏర్పడవు.

స్పష్టత, ఆకృతి: స్వచ్ఛమైన నెయ్యి పారదర్శకంగా ఉంటుంది. నున్నని టెక్స్చర్‌ను కలిగి ఉంటుంది. మసకగా ఉన్నా, కణుపులు కనిపించినా, ముద్దగా ఉన్నా దాన్లో కల్తీ జరిగిందని అర్థం చేసుకోవాలి. స్వచ్ఛమైన నేయి, గది ఉష్ణోగ్రతలో ద్రవ రూపంలో ఉంటుంది.

బర్న్ టెస్ట్: ఒక టీ స్పూను నెయ్యిని ప్యాన్‌లో వేడి చేసి అది కల్తీదో కాదో కనిపెట్టవచ్చు. స్వచ్ఛమైన వేడి తగిలిన వెంటనే ఎలాంటి పొగలు, మాడు వాసనలను వెలువరించకుండా క్షణాల్లో కరిగిపోతుంది. మలినాలు కలిసిన నెయ్యి పొగలు, దుర్వాసనలను వెలువరిస్తుంది. నీళ్ల పరీక్ష: గోరువెచ్చని నీళ్లలో కొద్ది పాటి నెయ్యిని వేయాలి. నెయ్యి స్వచ్ఛమైనదైతే వెంటనే నీళ్లలో కరిగిపోతుంది. నీళ్లు కూడా స్పష్టంగా ఉంటాయి. ఒకవేళ ఏదానా మడ్డి, మలినాలు నెయ్యి నుంచి వేరుపడితే, అది కల్తీదని అర్థం చేసుకోవాలి. ఫ్రిజ్ పరీక్ష: నెయ్యిని కొన్ని గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. స్వచ్ఛమైన నెయ్యి హెచ్చుతగ్గులు లేకుండా సమంగా గడ్డకడుతుంది. దీన్లో వేర్వేరు పొరలు, స్ఫటికాలూ కనిపించవు. హెచ్చుతగ్గులతో కూడిన పొరలు, స్ఫటికాలూ కనిపిస్తే అది కల్తీ నెయ్యని అర్థం. రుచి పరీక్ష: స్వచ్ఛమైన నెయ్యి నోట్లో వేసుకున్నప్పుడు వెన్నలా తగులుతుంది. కల్తీ నెయ్యి తేలికగా గొంతులోకి జారకుండా, దంతాలకూ, నాలుకకూ అంటుకుంటుంది. మరక పరీక్ష: స్వచ్ఛమైన నెయ్యి ఎలాంటి మరకలనూ ఏర్పరచదు. వస్త్రం మీద నెయ్యి మరక ఏర్పడినా, ఏవైనా అవక్షేపాలు మిగిలిపోయినా ఆ నెయ్యి కచ్చితంగా కల్తీదే!

# ఒబెసిటీ.. అధిక బరువే కాదు అంతకు మించి



ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న సమస్య ఒబెసిటీ. వ్యక్తుల ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం వంటి అనేక కారణాలతో ఇప్పుడు ఇదొక జీవనశైలికి సంబంధించిన అంశంగా మారింది. అందరూ దీనిని కేవలం అధిక బరువుతోనే కొలుస్తుంటారు. అయితే ఇది అంతకు మించిన తీవ్రమైన పరిస్థితిగా పరిగణించి పూర్తి స్థాయి చికిత్స చేయాలి అంటున్నారు కేర్ ఆసుపత్రికి చెందిన డా.బిపిన్ సేథీ. రోజువారీ జీవనం మీద ఒబెసిటీ ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. హృద్రోగం, డయాబెటిస్, హై బ్లడ్ ప్రెషర్, కీళ్ల నొప్పులు.. ఇంకా అనేక ఇతర తీవ్రమైన అనారోగ్యాలతో పాటు కొన్ని రకాల కేన్సర్‌లకూ కారణమవుతుంది. కేవలం శారీరకమైనవే కాకుండా డిప్రెషన్, న్యూనతాభావం తదితర మానసిక సమస్యలకూ ఇది దోహదం చేస్తుంది.

సరైన కారణం గుర్తించాలి

ఒబెసిటీ విషయంలో వ్యక్తిగత బాధ్యతా రాహిత్యం, విల్‌పవర్ లోపించడం.. వంటివి చూపిస్తూ బాధితులపైనే పూర్తిగా నెపం వేస్తుంటారు. అలాగే కేవలం ఎక్కువ తినడం, వ్యాయామం లేకపోవడం వంటివి మాత్రమే ఒబెసిటీకి కారణం కావనేది అర్థం చేసుకోవాలి. దీనికి జన్యుపరమైన సమస్యలతో పాటు పరిసరాలు, వాతావరణం, ప్రవర్తన... ఇవన్నీ కూడా కారణాల్లో ఉండొచ్చు.. ఒబెసిటీ కారణాల గురించి మనకు తక్కువ అవగాహన ఉంది. హార్మోనల్ కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఏదేమైనా దీనిని సరైన రీతిలో అర్థం చేసుకునే దశలోనే మనం ఉన్నాం. కాబట్టి త్వరపడి ఏదోఒక కారణాన్ని నిర్ధారించుకుని చికిత్స సరికాదు.

**చికిత్సకు నిర్ణీత వ్యవధి**

ఒబెసిటీ బాధితులు కూడా తామేదో హార్మోనల్ సమస్య అని భావిస్తూ సరైన క్రమపద్ధతిలో కాకుండా త్వరితంగా సమస్య నుంచి బయటపడే మార్గాలు వెతుకుతుంటారు. అది సరైంది కాదు ఈ సమస్య నుంచి కోలుకోవడానికి జీవిత కాలపు ఆరోగ్య నిపుణుల అవసరం ఉంటుంది. వ్యక్తులకు సంబంధించిన డైట్ మాత్రమే కాకుండా తినే ఆహారం, అలాగే వ్యాయామాలను పరిశీలించాల్సి ఉంది. నెగిటివ్ కేలరీ బ్యాలెన్స్‌తో పాటు ఇదొక దీర్ఘకాలికం కొనసాగాల్సిన ప్రక్రియ, అంతే తప్ప శరవేగంగా ఫలితాలను ఆశించడం, వెంటనే బరువు తగ్గాలని కోరుకోవడం, పెళ్లి వంటి వేడుకల కోసం హడావుడిగా సర్జరీ ప్లాన్స్ ఎంచుకోవడం వల్ల సరైన ఫలితం రాదు.

**తీవ్రతకు తగ్గ చికిత్స**

వ్యక్తిగత ఒబెసిటీ తీవ్రతపై ఆధారపడి దీనికి చికిత్స ఉండాలి. అలాగే వ్యక్తిగత ఆరోగ్య ప్రమాదాలు, మానసిక ప్రవర్తన శైలులు, మెటబాలిక్ క్యారెక్టరిస్టిక్స్‌లతో పాటు గతంలోని అధిక బరువు తగ్గించుకునే యత్నాలు వాటి ఫలితాలు కూడా దీనిలో పరిగణనలోకి తీసుకోవాలి. వ్యక్తిగత చికిత్సా పద్ధతులు అనుసరిస్తూ మల్టీ లెవల్ ఒబెసిటీ మేనేజ్‌మెంట్ నెట్‌వర్క్‌తో సమన్వయంతో పనిచేస్తే లక్ష్యం చేరుకోవడానికి వీలవుతుంది. ఒబెసిటీ మేనేజ్‌మెంట్‌లో నైపుణ్యం కలిగిన బృందం పనిచేయాలి.

చికిత్సలో భాగంగా అన్ని రకాల ప్రోగ్రామ్స్ నిర్వహించాలి. రోగి జీవనశైలికి, ప్రాధామ్యాలకు నప్పేలా దీనిని డిజైన్ చేస్తారు. మందుల వాడకాన్ని సమీక్షించడం, మార్పు చేర్పులు, పోషకాల సహకారం, శారీరక కార్యకలాపాలు పెంచడం, కౌన్సిలింగ్, రోగికి నప్పేదైతే బేరియాట్రిక్ సర్జరీ.. వంటివన్నీ ఇందులో భాగంగా ఉంటాయి. పలువురు భావిస్తున్నట్టు ఇది ఒంటరిగా పోరాడే పరిస్థితి కాదు. వైద్య నిపుణుల పర్యవేక్షణ సహకారం అవసరం.

# వృద్ధాప్య లక్షణాలకు చెక్ !



వ యం స్ు పెరుగుతున్నా కొద్దీ సహజసిద్ధంగా వ ృద్ధాప్య లక్షణాలు కనిపిస్తుంటాయి. అయితే కొంతమంది వయసులో ఉండగానే ఈ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు ఇంట్లోనే ఈ ఏజింగ్ లక్షణాలకు చెక్ చెప్పొచ్చు.

ముఖానికి పట్టించాలి. ఏజ్ స్పాట్స్ వద్ద కొంచెం ఎక్కువగా రాయాలి. 15 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి.

–కొద్దిగా నిమ్మరసాన్ని తీసుకొని ముఖంపై ఏజింగ్ లక్షణాలు కనిపిస్తున్న దగ్గర రాయాలి. కొద్దిసేపటి తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఈ చిట్కా పాటిస్తున్నప్పుడు ఎండకు వెళ్లకూడదు.

–ఆపిల్ సైడర్ వెనిగర్‌లో కొద్దిగా తేనె కలిపి ఆ మిశ్రమాన్ని కొద్దిగా ఆముదాన్ని ముఖానికి రాసి, మర్దనా చేయాలి. తర్వాత రోజూ వాడే సబ్బుతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. పాలను ముఖానికి పట్టించి, మర్దన చేస్తే.. సున్నితంగా మారుతుంది. మ ృతకణాలను తొలిగించడంలో పాలు మేలు చేస్తాయి. పాలలో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మ రక్షణకు ఉపయోగపడుతుంది. తాజా టమోట ముక్కలతో ముఖాన్ని మర్దన చేయాలి. రసం ముఖానికి పట్టేంత వరకూ ఆగాలి. తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. పసుపులో కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి.. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఇలా ప్రతిరోజూ చేస్తుంటే ముఖం కాంతివంతంగా మెరుస్తుంది.





నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ గురువారం
04 । సెప్టెంబర్ । 2025


## ఫ్లాట్‌గా ట్రేడ్ అవుతున్న సూచీలు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

**ముంబై-నవభూమి:**గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారం కాస్త సానుకూలంగా చలిస్తున్నాయి. సోమ, మంగళవారాలు భారీ లాభాలను ఆర్జించిన స్టాక్ మార్కెట్లు బుధవారం మాత్రం ఫ్లాట్‌గా ట్రేడ్ అవుతున్నాయి. జీఎస్టీ నూతన సంస్కరణలపై బుధవారం, గురువారం మండలిలో చర్చించబోతున్నారు. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో కొనసాగుతున్నాయి (%దీబంఱఅవం చీవషం). మంగళవారం ముగింపు (80, 157)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభ నష్టాలతో దోబూచులాడుతోంది. ఒక దశలో 200 పాయింట్లకు పైగా లాభపడి మళ్లీ వెనక్కి వచ్చింది. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 20 పాయింట్ల లాభంతో 80, 177 వద్ద కొనసాగుతోంది.





మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 9 పాయింట్ల లాభంతో 24, 589 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో పిరామిల్ ఫార్మా, మనప్పురం ఫైనాన్స్, యెస్ బ్యాంక్, డెలివరీ, గ్లెన్‌మార్క్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇండస్ టవర్స్, ఫియోనిక్స్ మిల్స్, ఎంఫసిస్, ఇన్ఫోసిస్, కోఫోర్జ్ లిమిటెడ్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 175 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 125 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది.

## పుణెలో యాపిల్ రిటైల్ స్టోర్.. రేపే ఓపెనింగ్





**పుణె-నవభూమి:**యాపిల్(సంస్థ కొత్త రిటైల్ స్టోర్‌ను ఓపెన్ చేయనున్నది. పుణెలో సెప్టెంబర్ 4వ తేదీన ఆ స్టోర్‌ను ఓపెన్ చేస్తున్నారు. యాపిల్ కోరేగావ్ పార్క్‌లో ఈ స్టోర్ ఉంది. రేపు మధ్యాహ్నం ఒంటి గంటకు కొత్త యాపిల్ స్టోర్‌ను ఓపెన్ చేయనున్నారు. గత వారమే బెంగుళూరులో కొత్త యాపిల్ స్టోర్‌ను ఆ కంపెనీ ఓపెన్ చేసిన విషయం తెలిసిందే. దీనికి పూర్వం ఈ మధ్యనే ముంబై, ఢిల్లీ నగరాల్లో రిటేల్ స్టోర్లను ఓపెన్ చేసింది. కొత్త స్టోర్‌లో యాపిల్ సంస్థకు చెందిన అన్ని ప్రోడక్ట్స్ అందుబాటులో ఉంటాయి. సర్వీస్‌ను కూడా కల్పిస్తున్నారు.టీమ్ సభ్యుల నుంచి పర్సనల్ సపోర్టు ఉంటుందని యాపిల్ సంస్థ తన ప్రకటనలో చెప్పింది. యాపిల్ కోరేగావ్ పార్క్‌లో మొత్తం 68 మంది సభ్యులు ఉంటారని యాపిల్ రిటేల్ శాఖ వైస్ ప్రెసిడెంట్ డెయిర్‌డ్రీ ఓ బ్రియాన్ పేర్కొన్నారు. ఐఫోన్ 16 లైనప్, ఐప్యాడ్ ఎయిర్ విత్ యాపిల్ పెన్సిల్ ప్రో, ఎం4 పవర్డ్ మాక్‌బుక్ ఎయిర్ ఉత్పత్తుల గురించి కస్టమర్లకు వివరిస్తారన్నారు.

## చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం.. సోషల్ మీడియా ద్వారా యూజర్లు ఫిర్యాదు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌బాట్ సేవల్లో అంతరాయం ఏర్పడింది ఫలితంగా భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యూజర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. చాట్‌బాట్‌ను యాక్సెస్ చేయడంలో సమస్యలను ఎదుర్కొన్నారు. దీనిపై యూజర్లు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం నుంచి ఈ సమస్య తలెత్తింది. భారత్ నుంచే దాదాపు 500కిపైగా ఫిర్యాదులు వచ్చాయి. మొబైల్ యాప్, వెబ్ రెండింటిలోనూ ఈ సమస్యను ఎదుర్కొన్నట్లు యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. ఏదైనా ప్రశ్నలు వేయగా దాన్ని స్వీకరించేందుకు చాట్ జీపీటీ నిరాకరిస్తోందని, ప్రశ్న తీసుకున్నా స్పందించడం లేదని యూజర్లు పేర్కొంటున్నారు. అంతేకాదు కొందరు లాగిన్, నెట్‌వర్క్ ఎర్రర్, యాప్ సంబంధిత ఇతర సమస్యలు కూడా ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేస్తున్నారు. 'చాట్ జీపీటీ డౌన్' అంటూ యూజర్లు ఎక్స్‌లో పోస్టులు పెడుతున్నారు. 2022 చివర్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పని చేసే చాట్‌జీపీటీని ఓపెన్ ఏఐ అందుబాటులోకి తెచ్చింది. ఈ చాట్‌బోట్ సాయంతో యూజర్లు తమకు అవసరమైన ఖచ్చితమైన సమాచారాన్ని సెకన్లలోనే అందుకోవచ్చు. ఎలాంటి క్లిష్ట ప్రశ్నకైన ఇది అలవోకగా సమాధానం చెబుతుండటంతో చాలా మంది దీన్ని వాడేందుకు మక్కువ చూపుతున్నారు.

## పహల్గాం దాడి పేరుతో వృద్ధురాలిని బెదిరించి.. రూ.లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సొమ్ము కాజేసేందుకు నేరగాళ్లు కొత్త కొత్త దారులను వెతుక్కుంటున్నారు. తాజాగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పహల్గాం ఉగ్రదాడి పేరుతో ఓ వృద్ధురాలిని సైబర్ నేరగాళు మోసం చేశారు. రూ.లక్షల్లో సొమ్ము కాజేశారు.వివరాల్లోకి వెళితే.. నోయిడా సెక్టార్ 41లో నివాసం ఉండే 76 ఏండ్ల సరళా దేవి అనే వృద్ధురాలికి ఓ ఫోన్‌కాల్ వచ్చింది. తాను పోలీసు ఆఫీసర్‌ను అని, ఉగ్రవాద కార్యకలాపాలపై విచారణ జరుపుతున్నట్లు చెప్పాడు. మీ పేరుతో ముంబైలో ఓ బ్యాంకు ఖాతా తెరిచినట్లు చెప్పారు. ఆ బ్యాంకు ఖాతా నుంచి ఉగ్రవాదులకు నిధులు బదిలీ అయినట్లు చెప్పాడు. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి కూడా ఇదే ఖాతా నుంచి డబ్బు సమకూరినట్లు నమ్మించాడు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చుతున్న కారణంగా మీపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు వృద్ధురాలిని బెదిరించాడు. అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయ్యిందని చెప్పాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సెక్యూరిటీ డిపాజిట్‌గా కొంత సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశాడు.అతడి మాటలకు భయపడిపోయిన వృద్ధురాలు.. దుండగుడు పంపిన క్యూఆర్ కోడ్ ద్వారా పలుమార్లు డబ్బులు పంపింది. జులై 20 నుంచి ఆగస్టు 13 వరకూ విడతల వారీగా మొత్తం రూ.43.70 లక్షలు సెండ్ చేసింది. అంతటితో ఆగని దుండగుడు మరో రూ.15 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన సరళాదేవి లాయర్‌ని సంప్రదించింది. చివరికి మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## వీరికి మరింత చౌకగా ఎయిర్ ఇండియా ప్రయాణం..అదిరే ఆఫర్

**న్యూఢిల్లీ-నవభూమి:**ఎయిర్ ఇండియా సీనియర్ సిటిజన్లకు గుడ్ న్యూస్ తెలిపింది. ఇప్పుడు 60 ఏళ్లు పైబడిన వారు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా, చౌకగా అనుభవించవచ్చు. దేశీయ ప్రయాణాలకే కాదు, అంతర్జాతీయ విమానాలపై కూడా ఆకర్షణీయమైన డిస్కౌంట్లు, అదనపు లగేజ్ అలవెన్స్, డేట్ మార్పుల సదుపాయం లాంటి ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి.సాధారణంగా వయసు పెరిగిన తర్వాత ప్రయాణం కొంత కష్టమే అనుకుంటాం, కానీ ఎయిర్ ఇండియా ఈ ఆఫర్లతో మీ ఆలోచనను మార్చుకోవచ్చు. ఆ వివరాలేంటో ఇక్కడ చూద్దాం. ఈ క్రమంలో మీరు ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా బుకింగ్ చేస్తే బేస్ ఫేర్‌పై 10% డిస్కౌంట్ పొందవచ్చు. ఒకసారి ఉచితంగా డేట్ మార్చుకునే అవకాశం (ఫేర్ డిఫరెన్స్ ఉంటే చెల్లించాలి) ఉంది. అదనంగా 10 కిలోల లగేజ్ లేదా ఒక అదనపు బ్యాగ్ తీసుకెళ్లొచ్చుఎకానమీ క్లాస్: 10 కిలోల అదనపు లగేజ్ (మాక్స్ 40 కిలోల వరకు) లేదా 2 బ్యాగ్స్ (ప్రతి ఒక్కటి 23 కిలోల వరకు)ప్రీమియం ఎకానమీ: 10 కిలోల అదనపు లగేజ్ (మాక్స్ 45 కిలోల వరకు) లేదా 2 బ్యాగ్స్ (23 కిలోల ప్రతీ బ్యాగ్)

## రూ.1900 కోట్ల అర్బన్ కంపెనీ ఐపీఓ.. సెప్టెంబర్ 10 నుంచి షురూ.. ఒక్క షేరు ధర ఎంతంటే?




**ముంబై-నవభూమి:**గృహ, బ్యూటీ సేవలు అందించే ప్రముఖ కంపెనీ అర్బన్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు మార్గం సుగమం అయింది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఆమోదం లభించింది. రూ. 1,900 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఐపీఓకు వస్తోంది. మంచి గ్రోత్ ఉన్న రంగాల్లో వ్యాపారం నిర్వహిస్తోన్న కంపెనీల్లో ఒకటైన అర్బన్ కంపెనీ ఐపీఓ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించిందని చెప్పవచ్చు. ఈ ఐపీఓకు పెద్ద ఎత్తున బిడ్లు దాఖలయ్యే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఐపీఓ గురించిన వివరాలు తెలుసుకుందాం. ఈ ఐపీఓ ద్వారా రూ. 472 కోట్లు విలువైన తాజా ఈక్విటీ షేర్లు జారీ చేస్తున్నారు. అలాగే రూ. 1,428 కోట్లు విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నట్లు అర్బన్ కంపెనీ తెలిపింది. ఇక ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 10, 2025 రోజున ప్రారంభమవుతోంది. సెప్టెంబర్ 12వ తేదీ వరకు కొనసాగుతుంది. ఆసక్తి ఉన్న ఇన్వెస్టర్లు మూడు రోజులు బిడ్డింగ్‌లో పాల్గొనొచ్చు. సెప్టెంబర్ 15వ తేదీన షేర్లు కేటాయింపు ఉంటుంది. ఇక స్టాక్ మార్కెట్ లిస్టింగ్ సెప్టెంబర్ 27వ తేదీన జరుగుతుంది.


**ఒక్కో షేరుకు ఎంతంటే?**

అర్బన్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ ధరల శ్రేణి ప్రకారం ఒక్కో షేరుకు రూ. 98-103 గా నిర్ణయించారు. ఒక లాట్ ద్వారా 145 షేర్లు ఇవ్వనున్నారు. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక లాట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ. 14,935తో బిడ్డింగ్ వేయవచ్చు. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా కోటక్ మహీంద్రా క్యాపిటల్ కో లిమిటెడ్ వ్యవహరిస్తోంది. అలాగే ఎంయూఎఫ్‌జీ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తోంది. ఇక ఈ ఐపీఓలో క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్లకు 75 శాతం షేర్లు కేటాయించారు. 10 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించగా 15 శాతం నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకుకు రిజర్వ్ చేశారు. అర్బన్ కంపెనీ 2014 డిసెంబర్‌లో ప్రారంభించారు. హెూమ్, బ్యూటీ సర్వీసులను ఆన్‌లైన్ ద్వారా అందిస్తోంది. దేశ వ్యాప్తంగా 51 నగరాల్లో ఈ కంపెనీ సేవలు అందిస్తోంది. యూఏఈ, సింగపూర్ దేశాల్లోనూ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వినియోగదారులు తమ ఇంటి క్లీనింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్క్, గృహెూపకరణాల మరమతు, బ్యూటీ చికిత్సలు, మసాజ్ థెరపీ వంటి సర్వీసులు అందిస్తోంది. నేటివ్ బ్రాండ్ పేరుతో హెూమ్ సొల్యూషన్స్ అందిస్తోంది ఈ కంపెనీ. వాటర్ ప్యూరిఫయర్లు, ఎలక్ట్రానిక్ డోర్ లాక్స్ సైతం అందిస్తోంది.

## ఫోన్‌పే ప్లాట్‌ఫామ్‌లో మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్లపై లోన్

**న్యూఢిల్లీ-నవభూమి:**ఫోన్‌పే, ఈరోజు మ్యూచువల్ ఫండ్స్‌పై లోన్‌లు - లోన్స్ అగైన్స్ట్ మ్యూచువల్ ఫండ్స్ ప్రోడక్ట్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది, లెగసీ DSP గ్రూప్ సపోర్ట్ ఉన్న టెక్-ఫోకస్డ్ NBFC% అయిన DSP ఫైనాన్స్‌తో కుదుర్చుకున్న వ్యూహాత్మక భాగస్వామ్యంతో తన యూజర్లకు ఇదివరకే పరిచయమున్న, పూర్తి డిజిటల్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంది, ఈ భాగస్వామ్యం వారసత్వ, క్యాపిటల్ మార్కెట్ల నైపుణ్యాన్ని ఆధునిక ఆవిష్కరణలతో సమ్మిళితం చేస్తుంది. కస్టమర్లు తమ మ్యూచువల్ ఫండ్ పోర్ట్‌ఫోలియోలపై నేరుగా ఫోన్‌పే యాప్‌లోనే, వెంటనే లోన్లను పొందేందుకు ఫోన్‌పే వీలు కల్పిస్తుంది. ఈ కొత్త ఆఫర్‌లో యూజర్లకు మార్కెట్లోనే మెరుగైన వడ్డీ రేటుతో 10 నిమిషాల్లోపే INR 2 కోట్ల వరకు సెక్యూర్డ్ క్రెడిట్ లిమిట్ లభిస్తుంది. ఈ ప్రోడక్ట్ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలి యోను విక్రయించాల్సిన అవసరం లేకుండా లోన్‌ను తీసుకోవడం ద్వారా లిక్విడిటీని పొందే విధానాన్ని మారుస్తుంది. ఫండ్స్‌ను పూచీకత్తుగా ప్లెడ్జ్ చేయడం (తాకట్టు పెట్టడం) వల్ల వెంటనే ఫండ్స్‌ను పొందుతారు, అయితే ఫండ్స్ ఇన్వెస్ట్ అయ్యే ఉంటాయి, SIPలు నిరంతరాయంగా కొనసాగుతాయి. అంతేగాక, సంప్రదాయ లోన్‌లు మాదిరిగా కాకుండా, దీనిలో నెలవారీ అసలు (ప్రిన్సిపల్ అమౌంట్) పేమెంట్లు లేదా EMIలు ఉండవు. యూజర్లు తాము విత్‌డ్రా చేసే అమౌంట్‌కు మాత్రమే వడ్డీ పే చేస్తే సరిపో తుంది. వారు దీన్ని క్రెడిట్ లైన్‌గా ఉపయోగిం చుకోవచ్చు, ప్రిన్సిపల్ అమౌంట్‌ను ఎప్పుడైనా తిరిగి పే చేయవచ్చు, అవసరమైన ప్పుడు మళ్లీ విత్‌డ్రా చేసుకోవచ్చు. ఆన్‌బోర్డింగ్ నుండి మొదలుకుని లోన్ అమౌంట్ జమ కావడం, తిరిగి పే చేయడం, ఫోర్‌క్లోజర్ వరకు మొత్తం లోన్ సైకిల్‌ను ఫోన్‌పే యాప్‌లోనే సజావుగా మేనేజ్ చేసుకోవచ్చు, ఇది స్పష్టమైన యూజర్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంది. ఈ అనుసం ధానం వల్ల యూజర్లు తమ లోన్‌పై పూర్తి నియంత్రణను సాధిస్తారు, వారి మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్లు వారికి అవసరమైన లిక్విడిటీని అందిస్తూనే మార్కెట్ రాబడిని ఆర్జి స్తూనే ఉంటాయి. ఈ ప్రోడక్ట్ లాంచింగ్ సందర్భంగా ఫోన్‌పే లెండింగ్ CEO హేమంత్ గాలా మాట్లాడుతూ, "ఫోన్‌పేలో, ప్రతి భారతీయునికీ ఫైనాన్షియల్ ప్రోడక్ట్‌లకు సులభమైన యాక్సెస్‌ను అందిస్తూ, వారి ఆర్థిక పురోగతిని వేగవంతం చేసుకునే అవకాశాన్ని కల్పించడమే మా విజన్. DSP ఫైనాన్స్‌తో కుదిరిన భాగస్వామ్యంలో భాగంగా మ్యూచువల్ ఫండ్‌లపై లోన్లను అందుబాటులోకి తీసుకురావడమే ఆ దిశగా వేసిన కీలకమైన అడుగు. మా యూజర్లకు తమ ఇన్వెస్ట్‌మెంట్లలో దాగి ఉన్న విలువను అన్‌లాక్ చేయడానికి వీలు కల్పించడం ద్వారా మేము సెక్యూర్డ్ లెండింగ్‌లో విప్లవాత్మక మార్పు లు తీసుకొస్తున్నాము. మ్యూచువల్ ఫండ్‌లను లిక్విడిటీ సోర్స్‌గా (డబ్బును పొందే వనరుగా) మార్చడం ద్వారా, మా యూజర్లు వారి దీర్ఘకాలిక సంపద సృష్టి ప్రయాణంలో రాజీ పడ కుం డా, వారి ఆకాంక్షలను నెరవేర్చగల మరింత సమగ్రమైన ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తున్నాము" అని అన్నారు. ఈ ప్రోడక్ట్ లాం చింగ్ సందర్భంగా DSP ఫైనాన్స్ CEO జయేష్ మెహతా మాట్లాడుతూ, "ఫోన్‌పేతో మా భాగస్వామ్యం వల్ల, సురక్షితమైన లోన్లను అందిం చడంలో DSP ఫైనాన్స్‌కు ఉన్న నైపుణ్యాన్ని, ఫోన్‌పేకు ఉన్న సాటిలేని డిజిటల్ పరిధితో కలగలిపి భారతీయ ఇన్వెస్టర్లకు శక్తివంతమైన సొల్యూషన్‌ను క్రియేట్ చేస్తుంది. మ్యూచువల్ ఫండ్లపై లోన్లతో, యూజర్లు ఇప్పుడు వారి పోర్ట్‌ఫోలియోల పెరుగుదల నుండి ప్రయోజనం పొందుతూనే, తమకు అవసరమైన వెంటనే లిక్విడిటీని పొందవచ్చు.

## రూ.2.40 కోట్ల కవర్ ఉన్నప్పటికీ రూ.61 లక్షల క్లెయిమ్ తిరస్కరణ నిజమేనా ..పోస్ట్ వైరల్



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇన్సూరెన్స్ ఉంటే చాలు... కష్టం వచ్చినప్పుడు కాపాడుతుందనే నమ్మకంతో చాలామంది ప్రజలు లక్షల రూపాయలు ఖర్చు చేసి హెల్త్ పాలసీలు తీసుకుంటారు. కానీ, నిజంగా ఆ పాలసీలు అవసరం వచ్చినప్పుడు మనల్ని కాపాడతాయా అన్న ప్రశ్న చాలా మందికి కలుగుతోంది. ఎందుకంటే ఇటీవల ఒక వైరల్ పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అవిగ్యాన్ మిత్రా అనే వ్యక్తి చేసిన ఈ పోస్ట్‌లో ఓ వ్యక్తి చికిత్స కోసం పెట్టిన రూ.61 లక్షల నగదు రహిత క్లెయిమ్‌ను, ఆయన వద్ద ఉన్న రూ.2.40 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నా సరే, తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు

అవిగ్యాన్ మిత్రా వెల్లడించిన వివరాల ప్రకారం:చంద్ర కుమార్ జైన్ కు రూ. 2.4 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంది (రూ. 1 కోటి బేస్ పాలసీ ం రూ. 1.4 కోట్లు నో-క్లెయిమ్ బోనస్).అయినప్పటికీ, ఇన్సూరెన్స్ కంపెనీ ఒక్కసారిగా లైయాబిలిటీ ఎస్టాబ్లిష్ చేయలేమనే కారణంతో క్యాష్‌లెస్ మంజూరు చేయలేదని చెప్పారు.మీరు ఏళ్ల తరబడి ప్రీమియం కడతారు, భారీ కవర్ తీసుకుంటారు. కానీ అసలు సమయంలో బీమా కంపెనీ మిమ్మల్ని ఒంటరిగా వదిలేస్తుందని అవిగ్యాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చిన్న టెక్నికల్ సమస్య కాదని, హెల్త్ ఇన్సూరెన్స్ ఆయా కుటుంబాలకు కష్ట సమయంలో అండగా నిలవాలన్నారు. ఇది కేవలం చిన్న పొరపాటు కాదు. ఇది ఆరోగ్య భీమా రంగం పట్ల కలిగించిన నమ్మకాన్ని మోసం చేసినట్లేనని అన్నారు.

**కంపెనీ సమాధానం**

ఈ పోస్ట్ వైరల్ కావడంతో నివా బుపా మార్కెటింగ్ అధికారి నిమిష్ అగర్వాల్ స్పందించారు.

జూన్ 27న అడ్మిట్ అయిన జైన్ గారికి మొదట్లో రూ. 25 లక్షల ప్రీ ఆథరైజేషన్ మంజూరు చేశామని చెప్పారు.

అయితే ట్రీట్మెంట్ ఖర్చులు ఇప్పుడు రూ. 70 లక్షలకి మించి పోయాయని, ఇది సాధారణమైనది కాదన్నారు.

రోగి ఇంకా ఆస్పత్రిలో ఉన్నందున, తుది క్లెయిమ్ ఇంకా మంజూరు చేయలేదని, కానీ తిరస్కరించలేదన్నారు.

హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఖర్చులు న్యాయంగా ఉన్నాయా అనేది హాస్పిటల్‌తో కలిసి చర్చించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు.

**ప్రజల ఆగ్రహం**

ఈ అంశంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమవుతోంది. దేశంలో ఇన్సూరెన్స్ పేరుతో మోసం చేస్తున్నారని అనేక రకాలుగా పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మనం బీమా తీసుకునేటప్పుడు దాని నిబంధనలను స్పష్టంగా అర్థం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏ విధంగా ఇన్సూరెన్స్ రాదు, ఎలా వస్తుందనేది ముందే తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

## అమెరికా కంపెనీలు.. భారత్ నుంచి ఏటా ఇన్ని వేల కోట్లు సంపాదిస్తున్నాయా?



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తన అక్కసు వెళ్లగక్కుతున్న సంగతి తెలిసిందే. అక్కడికి వెళ్లే భారత ఉత్పత్తులపై భారీగా దిగుమతి సుంకాల్ని ప్రకటించారు. ఒకవైపు చర్చలు జరుగుతుండగానే.. తొలుత 25 శాతానికి సుంకాల్ని పెంచగా.. మళ్లీ దీనిని రెట్టింపు చేసి 50 శాతానికి చేర్చారు. ఇది ఆగస్ట్ 27 నుంచి అమల్లోకి వచ్చింది. ఇంకా పెంచేందుకు కూడా వెనుకాడనని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల్లో భారత్ అన్నింటికంటే ఎక్కువగా సుంకాలు విధిస్తుందని వ్యాఖ్యానించిన ట్రంప్.. అందుకే 'వారు మాతో భారీగా వ్యాపారం చేస్తున్నప్పటికీ.. మేము పరిమితంగానే వ్యాపారం చేస్తున్నాం.' అని అన్నారు. అయితే ఇక్కడ ట్రంప్ వ్యాఖ్యలకు బదులుగా.. ఢిల్లీ కేంద్రంగా పనిచేసే థింక్ ట్యాంక్ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ కీలక విశ్లేషణ చేసింది. భారత్- అమెరికా వాణిజ్యం గురించి ట్రంప్ వాస్తవాల్ని సరిగా తెలుసుకోవాలని సూచించింది జీఆర్టీఐ. భారత్ కంటే.. అమెరికానే దీని వల్ల ఎక్కువ లాభాలు పొందుతుందని.. ఏటా 35-40 బిలియన్ డాలర్ల మిగులు కలిగి ఉందని తెలిపింది. ఇంకా.. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి, సైనిక ఉత్పత్తుల కొనుగోలు నిర్ణయాలు పూర్తిగా స్వతంత్రమైనవని వెల్లడించింది. 'ఢిల్లీతో మేం తక్కువ వ్యాపారం చేస్తాం. కానీ వారు మాతో విపరీతంగా వ్యాపారం చేస్తున్నారు. మరో విషయం ఏంటంటే.. ఇక్కడ వారు మాకు పెద్ద మొత్తంలో వస్తువుల్ని విక్రయిస్తారు. వారికి అతిపెద్ద క్లయింట్ మేమే. మేం మాత్రం చాలా తక్కువ విక్రయిస్తున్నాం. దశాబ్దాలుగా ఇది కొనసాగుతుంది. భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తుంది కాబట్టే పరిస్థితి ఇలా ఉంది. అందుకే భారత్‌లో మాకు ఎక్కువ వ్యాపారాలు లేవు. భారత్.. ఇంకా చమురు, సైనిక ఉత్పత్తుల్ని రష్యా నుంచి ఎక్కువగా కొనుగోలు చేస్తుంది. అమెరికా నుంచి తక్కువ.' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. జీఆర్‌టీఐ ప్రకారం.. భారత్ అమెరికా నుంచి కంటే.. అమెరికానే భారత్ నుంచి ఎక్కువ ఆదాయం పొందుతుంది. అమెరికా దిగ్గజ టెక్ కంపెనీలు.. గూగుల్, మెటా, అమెజాన్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు.. భారతదేశ డిజిటల్ రంగం నుంచి సంవత్సరానికి 15-20 బిలియన్ డాలర్ల (రూ. 1.70 లక్షల కోట్లకుపైనే) వరకు ఆర్జిస్తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం డేటా ప్రకారం.. యాపిల్‌కు భారత్ నుంచి రూ. 67,100 కోట్ల ఆదాయం వచ్చింది. అమెజాన్ రూ. 40,241 కోట్లు, గూగుల్ రూ. 31,221 కోట్లు, మైక్రోసాఫ్ట్ రూ. 22,900 కోట్లు, మెటా రూ. 22,731 కోట్లు సంపాదించాయి. వీటితో పాటు.. మెక్‌డొనాల్డ్స్, కోకాకోలా ఇతర అమెరికన్ కంపెనీలు కలిపి భారతీయ వెంచర్ల నుంచి ఏటా 15 బిలియన్ డాలర్లకుపైగా (రూ. 1.30 లక్షల కోట్లకుపైగా) సంపాదిస్తున్నాయి. వాల్ స్ట్రీట్ ఆర్థిక సంస్థలు, కన్సల్టింగ్ సంస్థలు 10-15 బిలియన్ డాలర్ల ఫీజులను వసూలు చేస్తున్నాయి. వాల్‌మార్ట్, ఐబీఎం, డెల్ వంటి గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లవాటా 15-20 బిలియన్ డాలర్ల వరకు ఉంది. అదనంగా.. ఫార్మాస్యూటికల్ పేటెంట్లు, హాలీవుడ్ సినిమాలు, స్ట్రీమింగ్ సేవలు, రక్షణ ఒప్పందాల ద్వారా అదనపు ఆదాయం వస్తుంది. భారతీయ విద్యార్థులు.. అమెరికా విశ్వవిద్యాలయాలలో చదువుకోవడం ద్వారా ఫీజుల రూపంలో.. స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఏటా 25 బిలియన్ డాలర్లకుపైగా అందిస్తోంది. వీటి ప్రకారం చూస్తే అమెరికా.. భారత్‌తో వాణిజ్య సంబంధం ద్వారా పెద్దమొత్తంలో లాభం పొందుతోంది.

అయినా భారత్ ఇంకా పలు ఉత్పత్తులపై సుంకాల్ని తగ్గించేందుకు సిద్ధమైనట్లు తెలిసినా.. అమెరికా ఒకవైపు చర్చలు జరుగుతుండగానే సుంకాలు పెంచడం కూడా సరికాదని జీఆర్‌టీఐ అభిప్రాయపడింది. భారత్.. పారిశ్రామిక ఉత్పత్తులు, బాదం, యాపిల్ వంటి కొన్ని వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడానికి సిద్ధంగా ఉందని సమాచారం. మన దేశానికి అమెరికా ఎగుమతుల్లో దాదాపు 95 శాతం వాటా వీటిదే ఉన్నందున.. దాదాపు భారతీయ మార్కెట్లు పూర్తిగా డ్యూటీ ఫ్రీ యాక్సెస్ కల్పిస్తున్నట్లే అవుతుంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా.. ట్రంప్ ఏకపక్షంగా సుంకాలు భారత్‌పై పెంచారని జీఆర్‌టీఐ పేర్కొంది. ఇక్కడ ట్రంప్ తన అహం దెబ్బతినడం వల్లే.. భారత్‌పై తరచుగా ప్రతికూల వ్యాఖ్యలు చేస్తున్నారని చాలా మంది భావిస్తున్నట్లు తెలిపింది. ముఖ్యంగా.. భారత్- పాకిస్థాన్ మధ్య శాంతి నెలకొనేందుకు తాను కృషి చేసినట్లు ట్రంప్ పలు మార్లు ప్రకటించగా.. భారత్ దీనిని ఖండించింది. ఇక్కడ నోబెల్ శాంతి బహుమతి కోసం ఆయన ప్రయత్నిస్తున్న సమయంలో భారత్ ప్రకటనతో.. ట్రంప్ అహం దెబ్బతినడం వల్ల.. ప్రతీకారం తీర్చుకుంటున్నట్లు అభిప్రాయపడింది.

## త్వరగా కోటీశ్వరులు కావాలంటే నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలి..




**న్యూఢిల్లీ-నవభూమి:**ఇటీవల కాలంలో అనేక మంది కూడా ఎక్కువగా మ్యూచువల్ ఫండ్లవైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఎందుకంటే ఇవి ట్రెడిషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పద్ధతులతో పోల్చితే మంచి ఫ్లెక్సిబిలిటీతో పాటు ఎక్కువ రాబడులను అందిస్తాయి. మ్యూచువల్ ఫండ్లలో మనం ఇన్వెస్ట్ చేసే మొత్తం, వ్యవధి తోపాటు అనేక ఆప్షన్లు ఉంటాయి. అయితే మీరు రూ.1 కోటి సొమ్మును త్వరగా సేవ్ చేయాలంటే, నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలి, ఏన్నేళ్లు చేయాలనే తదితర విషయాలను ఇప్పుడు చూద్దాం. అనేది ప్రతి నెలా లేదా పరిమిత కాలంలో ఒక చిన్న మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టే విధానం. ఈ విధానం చిన్న మొత్తాలతో మొదలుపెట్టి, ఎక్కువ మొత్తాన్ని కూడబెట్టే అవకాశాన్ని ఇస్తుంది. దీనిలో పవర్ ఆఫ్ కాంపౌండింగ్ వల్ల మీరు పొందే రాబడుల మీద కూడా లాభాలు వస్తాయి. అంటే మీరు మొదట పెట్టిన మొత్తానికి లాభాలు వస్తే, ఆ లాభాలు కూడా తిరిగి స్కీమ్‌లో చేరి, తర్వాత కాలంలో వాటిపైనా లాభాలు వస్తాయి. దీని వల్ల మీ మొత్తం పెట్టుబడి భారీగా పెరుగుతుంది.

**చేసిన పెట్టుబడికి..**

ఈ నేపథ్యంలో మీరు ప్రతి నెలా రూ.16,500 సిప్ రూపంలో 15 సంవత్సరాలు ఇన్వెస్ట్ చేస్తే, సగటున 15% వార్షిక రాబడి వస్తే, మీకు వచ్చే మొత్తం రూ.1 కోటి దాటే అవకాశం ఉంది. ఇక్కడ మీరు చేసిన పెట్టుబడి రూ.29,70,000 కాగా, మీకు వడ్డీ రూపంలోనే రూ.72,00,032 లభిస్తాయి. అంటే మీకు 15 ఏళ్లలో మీరు ఇన్వెస్ట్ చేసిన దానికి దాదాపు నాలుగింతల మొత్తం (రూ.1,01,70,032) వచ్చే ఛాన్సుంది. సాధారణంగా వార్షిక రాబడి రేటు ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్లలో కనీసం 12 శాతం నుంచి 21 శాతం వరకు వస్తుంది.సిప్ వల్ల లాభాలు ఏంటి

ప్రతి నెలా ఒక నిర్దిష్ట మొత్తాన్ని పెట్టుబడి చేస్తూ పెట్టుబడి చేసే అలవాటు పెరుగుతుంది. దీని వల్ల మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నా, మీరు పెట్టుబడి కొనసాగించవచ్చు.మార్కెట్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. కొన్నిసార్లు ఎక్కువ, కొన్నిసార్లు తక్కువగా ఉంటుంది

## బాబోయ్ మళ్లీ పెరిగిన గోల్డ్ ధరలు..ఈసారి రికార్డ్ స్థాయి ఎంతంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం ధరలు మళ్లీ పైపైకి చేరుతున్నాయి. తాజాగా ఎప్పుడూ లేని విధంగా కొత్త గరిష్ఠాన్ని తాకాయి. సెప్టెంబర్ 3న ఉదయం ఫ్యూచర్స్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర రూ.1,06,199కి చేరింది. అంటే దాదాపు 0.5% పెరిగింది. ఇది ఇప్పుడు దేశీయ మార్కెట్లో ఎప్పటికీ లేని రేటు అని చెప్పవచ్చు. ఈసారి ధరలు పెరగడానికి ప్రధాన కారణం అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించొచ్చనే అంచనాలని నిపుణులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ ఇన్వెస్టర్లు బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు కూడా దీనిపై ప్రభావం చూపిస్తున్నాయి. అమెరికా తన టారిఫ్ విధానంలో మార్పులు చేయబోమని ట్రంప్ చెప్పడంతో ఆర్థిక అనిశ్చితి పెరిగింది. ఈ సందర్భంలో సేఫ్ హావెన్ అన్న పేరుతో బంగారం మళ్లీ ఫేవరేట్ పెట్టుబడి ఆప్షన్‌గా మారింది. దీంతో అనేక మంది పసిడి పెట్టుబడుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు.ప్రస్తుతం ఇన్వెస్టర్లు గోల్డ్ సిల్వర్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ బేస్డ్ అయిన హెూల్డింగ్స్ 1.32% పెరిగి 990.56 టన్నులకు చేరాయి. ఇది ఆగస్ట్ 2022 తరువాత గరిష్ఠం కావడం విశేషం.ఇంకా పెరుగుతుందా..అమెరికాలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర %వి%3,616.70కు చేరింది. ఇది కూడా రికార్డ్ లెవెల్ అని చెప్పవచ్చు. సెప్టెంబర్ 17న అమెరికా ఫెడ్ తమ వడ్డీ విధానంపై నిర్ణయం తీసుకోనుంది. అప్పటికే మార్కెట్లు 92% మేర వడ్డీ రేట్లు 0.25% తగ్గుతాయని ఊహించుకుంటున్నాయి. ఈ వారం శుక్రవారం రానున్న డేటా కూడా చాలా కీలకం కానుంది. అది కూడా ఫెడ్ నిర్ణయంపై ప్రభావం చూపించవచ్చు. మరోవైపు రానున్న రోజుల్లో పసిడి ధరలు మరింత పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.గమనిక: గోల్డ్ లేదా స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు చేయాలని ఆంధ్రజ్యోతి సూచించదు. సమాచారం మాత్రమే అందిస్తుంది. మీకు ఇన్వెస్ట్ చేయాలని ఆసక్తి ఉంటే నిపుణుల సలహా, సూచనలు తీసుకోవడం మంచిది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ గురువారం 04 । సెప్టెంబర్ । 2025

# 40 నిమిషాల సర్‌ప్రైజ్ ఫుటేజీ రెడీ.. పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు పార్టు 2పై క్రిష్ కామెంట్స్



టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషించిన ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు జ్యోతికృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రెండు పార్టులుగా వస్తుండగా.. ఇప్పటికే హరిహరవీరమల్లు పార్ట్-1 జులై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైంది. అయితే భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అభిమానులను నిరాశపరిచింది. మొదట క్రిష్ డైరెక్టర్‌గా వ్యవహరించిన ఈ చిత్రం ఆ తర్వాత అనూహ్యంగా జ్యోతికృష్ణ చేతిలోకి వెళ్లిపోయింది.అయితే అనుష్క నటించిన ఘాటి సినిమా ప్రమోషన్స్‌లో క్రిష్ హరిహరవీరమల్లు పార్ట్-2పై కీలక విషయాలను షేర్ చేసుకున్నాడు. హరిహరవీరమల్లులో నేను చాలా వరకు సన్నివేశాలను ఢిల్లీ దర్బార్‌లో షూట్ చేశాను. ఈ సన్నివేశాలు భారీ స్థాయిలో వచ్చేందుకు అన్నపూర్ణ స్టూడియోలో స్పెషల్ సెట్ వేశాం. కరెంట్ బల్బుపై పవన్ కల్యాణ్ చేసే ఫైట్ సీక్వెన్స్ స్టన్నింగ్‌గా ఉంటుంది. కానీ ఇదంతా కథ ఢిల్లీకి మారినప్పుడు మాత్రమే ఉంటుంది. సుమారు 40 నిమిషాల ఫుటేజీ అద్భుతంగా చిత్రీకరించడం జరిగింది. ఈ ఫుటేజ్ అంతా రెండో పార్టు కోసం రెడీ చేసి ఉంచామన్నాడు క్రిష్.అంతేకాదు పార్ట్ 2లో పవన్ కల్యాణ్ అద్భుతమైన స్టంట్స్ చేశాడు. హరిహరవీరమల్లు ఔరంగజేబు కోర్టుకు వెళ్లి మొఘల్ సామ్రాజ్యంలో ప్రత్యేకంగా రూపొందించబడిన సింహాసనంపై నిలబడి.. అతడికి సవాలు విసిరి కోహినూర్ వజ్రాన్ని ఎత్తుకొస్తాడు. జనాలు ఇప్పటివరకు చూడని చాలా అద్భుతమైన సన్నివేశాలు కూడా ఉంటాయని చెప్పుకొచ్చాడు క్రిష్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

నవచిత్ర



# పింక్ అవుట్ ఫిట్‌లో మెస్మరైజ్ చేస్తున్న బాలయ్య బ్యూటీ!



ప్రస్తుతం సినీ సెలబ్రిటీలు ఎక్కువగా సోషల్ మీడియాను ఫాలో అవుతున్నారు. అందులో భాగంగానే అకేషన్ ఏదైనా సరే అందుకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఇంకొంతమంది ఫాలోవర్స్ ను పెంచుకోవడానికి గ్లామర్ ఫోటోలను షేర్ చేయడమే కాకుండా.. చిత్రవిచిత్రమైన దుస్తులు ధరిస్తూ అలరిస్తున్నారు. ఇంకొంతమంది అందాలు ఆరబోసేలా ఫోటోలు షేర్ చేస్తే.. మరికొంతమంది సాంప్రదాయంగా కనిపించి అబ్బురపరుస్తున్నారు. ఇప్పుడు ఆ జాబితాలోకి బాలయ్య బ్యూటీ ప్రగ్య జైశ్వాల్ కూడా వచ్చి చేరింది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలను ఈ ముద్దుగుమ్మ షేర్ చేసుకుంది. అందులో తన అవుట్ ఫిట్ తో అందరినీ ఆకట్టుకుంది అని చెప్పవచ్చు. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రముఖ నటి, మోడల్ అంజనా బోహ్రా ప్రత్యేకంగా డిజైన్ చేసిన పింక్ కలర్ లెహంగా సెట్ ను ప్రగ్యా జైశ్వాల్ ధరించింది. ముఖ్యంగా పెళ్లికి , పండుగలకు ప్రత్యేకంగా దుస్తులు డిజైన్ చేయడంలో ప్రసిద్ధి చెందిన అంజనా తాజాగా ప్రగ్యా జైశ్వాల్ కోసం.. పింక్ కలర్ పట్టు వస్త్రంపై క్లిష్టమైన ఎంబ్రాయిడరీ, మిర్రర్ వర్క్ తో డిజైన్ చేసిన లెహంగాను రూపొందించింది. ఇది ధరించిన ప్రగ్యా జైశ్వాల్ తన అందాన్ని దుస్తులతో మరింత రెట్టింపు చేసుకుందని చెప్పవచ్చు. పింక్ కలర్ లెహంగా ఈమె మేనిఛాయను మరింత మెరిసేలా చేస్తూ.. చూపరులను కూడా ఆకట్టుకుంది. ప్రస్తుతం ప్రగ్యా జైశ్వాల్ ధరించిన ఈ అవుట్ ఫిట్ అభిమానులను మరింత అలరిస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ప్రగ్యా జైశ్వాల్ కెరియర్ విషయానికి వస్తే.. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో జన్మించింది. పూణె లోని సింబయాసిస్ లా స్కూల్‌లో తన విద్యను పూర్తి చేసింది. అక్కడ చదువుకునే సమయంలోనే వివిధ రకాల అందాల పోటీలలో పాల్గొని సక్సెస్ సాధించిన ఈమె.. కళా, సంస్కృతి రంగంలో ఈమె సాధించిన విజయానికి 2014 జనవరి 22న సింబయాసిస్ సాంస్కృతిక్ పురస్కారం కూడా లభించింది. మోడల్ గా కెరియర్ ను మొదలుపెట్టిన ఈమె ఫెమినా మిస్స్ ఇండియా 2018 పోటీలలో పాల్గొని మిస్ ఫ్రెష్ ఫేస్, మిస్ డాన్సింగ్ క్వీన్, మిస్ ఫ్రెండ్ ఆఫ్ ఎర్త్ వంటి టైటిల్స్ ను దక్కించుకుంది. అలాగే రిలయన్స్ డిజిటల్, ఎఫ్బిబి, మిలీనియమ్ హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్ వంటి పాపులర్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా కూడా వ్యవహరించింది.

# ఐదు పార్టులుగా కళ్యాణి ప్రియదర్శన్ లోక.. ముందే రెడీ అయ్యాయన్న డైరెక్టర్



ఈ రోజుల్లో జనాలను థియేటర్లకు రప్పించాలంటే రెగ్యులర్ స్టోరీలైతే మాత్రం కష్టమేనని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. కథలో కొత్తదనంతోపాటు ఎక్జయిటింగ్ ఎలిమెంట్స్ ఉంటేనే జనాలు సినిమా చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఫిల్మ్ మేకర్స్ కూడా ప్రేక్షకులు అభిరుచులకు అనుగుణంగా తమ ప్రాజెక్టులను డిజైన్ చేసుకుంటున్నారు. ఎంతలా అంటే తమ సినిమాలను ఏకంగా ఫ్రాంఛైజీగా మార్చుకునేంతలా.అలాంటి కేటగిరీలో వస్తుంది థియేటర్లను షేక్ చేస్తున్న తాజా మలయాళ ప్రాజెక్టు 'లోక చాప్టర్ 1 చంద్ర' . డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కల్యాణి ప్రియదర్శన్ , నస్లేన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఆగస్టు 28న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇదిలా ప్రమోషనల్ ఈవెంట్స్‌లో డొమినిక్ అరుణ్ టీం స్టన్నింగ్ వార్తను షేర్ చేసింది. లోక 5 పార్టుల సిరీస్‌గా రాబోతుందని చెప్పారు మేకర్స్.అంతేకాదు ఈ 5 కథలన్నీ ఫస్ట్ పార్ట్ షూటింగ్‌కు ముందే రెడీ అయ్యారని డైరెక్టర్ డొమినిక్ అరుణ్ చెప్పాడు. మొత్తం సిరీస్‌లో ఎవరు విలన్ అనేదానిపై చంద్ర ఓపెనింగ్ సీన్‌లో హింట్ ఇచ్చేశామని కూడా చెప్పాడు. కొత్త జోనర్‌లో నయా స్టోరీ టెల్లింగ్‌తో వచ్చే సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి రుజువు చేస్తోంది లోక. అప్‌కమింగ్ పార్టులు కూడా ఇదే క్వాలిటీతో ప్రేక్షకుల ముందుకొస్తే.. లోఖ భారతీయ సినిమాలోనే బిగ్గెస్ట్ సినిమాటిక్ యూనివర్స్‌గా నిలువబోతుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.మలయాళ మొట్టమొదటి ఫీ మేల్ సూపర్ హీరో సినిమాగా వచ్చిన ఈ చిత్రం 35 కోట్ల రూపాయల బడ్జెట్‌తో తెరకెక్కింది. లోక ఫస్ట్ వీక్‌లోనే బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్ల క్లబ్‌లోకి ఎంటరయ్యే దిశగా దూసుకెళ్తోంది. రాబోయే రోజుల్లో ఈ మూవీ రూ.200 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయిన అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. మరి రానున్న రోజుల్లో ఎలాంటి వసూళ్లను రాబడుతుందో చూడాలి.

# బాస్టియన్‌కు బై బై.. ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న శిల్పా శెట్టి!



బాలీవుడ్ బ్యూటీ శిల్పా శెట్టి దంపతులు ఈ మధ్యకాలంలో వరుసగా వార్తల్లో నిలుస్తున్నారు. ఎప్పుడు ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటూ హాట్ టాపిక్‌గా నిలుస్తున్న ఈ జంట తాజాగా మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా తమ ఫేమస్ రెస్టారెంట్ ని మూసివేస్తున్నట్టు ప్రకటించి హాట్ టాపిక్ గా మారారు. మరి ముంబైలో ఎంతో ఫేమస్ అయిన రెస్టారెంట్ ని శిల్పా శెట్టి దంపతులు ఎందుకు మూసివేస్తున్నారు.. ? అప్పుల కారణంగానే రెస్టారెంట్ ని మూసి వేస్తున్నారా.. ?లేక కొత్త బిజినెస్ లోకి అడుగు పెట్టబోతున్నారా? అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. బాలీవుడ్ బ్యూటీ శిల్పా శెట్టి సినిమాల్లోనే కాదు వ్యాపార రంగంలో కూడా రాణిస్తోంది.అలా ఇప్పటికే పలు వ్యాపారాలను స్టార్ట్ చేసిన శిల్పా శెట్టి.. తన భర్త రాజ్ కుంద్రాతో కలిసి బిజినెస్‌లో సక్సెస్ అయింది. కానీ గత కొద్ది రోజుల నుండి ఈ జంట తరచూ చిక్కుల్లో పడుతోంది. ఈ మధ్యనే ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్త శిల్పా శెట్టి దంపతులు తనను మోసం చేశారని, రూ.60 కోట్లు నష్టపోయానంటూ వాళ్ల మీద కేసు పెట్టిన సంగతి మనకు తెలిసిందే. అయితే ఈ కేసు సంగతి మరువకముందే మరోసారి వార్తల్లో నిలిచారు ఈ జంట. తాజాగా శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాలకు సంబంధించిన 'బాస్టియన్' అనే రెస్టారెంట్ ని గురువారం రోజు మూసివేస్తున్నట్టు తన సోషల్ మీడియా ఖాతా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా ప్రకటించింది శిల్పా శెట్టి. తన బాస్టియన్ రెస్టారెంట్ గురించి చెబుతూ.. "బాస్టియన్ మాకు ఎన్నో జ్ఞాపకాలను అందించింది. ఈ రెస్టారెంట్లో మాకు మర్చిపోలేని అందమైన క్షణాలు ఎన్నో ఉన్నాయి. ఎన్నో సంతోషాలను అందించిన ఈ రెస్టారెంట్ వేదిక ఇకపై మూత పడనుంది. ఈ రెస్టారెంట్లో చివరిసారిగా అనగా గురువారం రోజు ఒక పెద్ద వేడుక నిర్వహిస్తున్నాం. ఈ వేడుకలో మా సన్నిహితులు, వ్యాపార భాగస్వాములు అందరూ పాల్గొంటారు. అంతేకాదు కొత్త అనుభవాలతో త్వరలోనే మీ ముందుకు వస్తాను" అంటూ ప్రకటించింది.అయితే శిల్పా శెట్టి ప్రకటన క్షణాల్లో వైరల్ గా మారడంతో చాలామంది నెటిజన్లు ఇదేంటి ఈ హీరోయిన్ తన రెస్టారెంట్ ని ఎందుకు మూసివేస్తోంది..దానికి కారణాలేంటి అని చర్చించుకుంటున్నారు.. ముంబైలో ఉండే ఫేమస్ రెస్టారెంట్లలో శిల్పా శెట్టికి సంబంధించిన బాస్టియన్ రెస్టారెంట్ కూడా ఒకటి.ఈ రెస్టారెంట్ కు ముంబైలో ఏకంగా ఆరు బ్రాంచ్ లు ఉన్నాయి. అలాంటి ఈ ఫేమస్ రెస్టారెంట్ ని శిల్పా శెట్టి దంపతులు మూసి వేయడానికి కారణం ఏంటో తెలియాల్సి ఉంది. అయితే తాజాగా బాస్టియన్ రెస్టారెంట్ ని మూసివేస్తున్నట్టు తెలిపిన ప్రకటనలో త్వరలోనే కొత్త అనుభవాలతో మీ ముందుకు వస్తానని తెలిపింది కాబట్టి శిల్పా శెట్టి దంపతులు మళ్లీ ఏదైనా కొత్త బిజినెస్ స్టార్ట్ చేయబోతున్నారా అనే అనుమానాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ రెస్టారెంట్ మూసి వేయడానికి అసలు కారణం ఏంటో తెలియాల్సి ఉంది.చాలా రోజుల నుండి సినిమాలకు దూరంగా ఉంటున్న శిల్పా శెట్టి వివాదాల ద్వారా మాత్రం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా నిలుస్తోంది.

# ట్రాన్స్పరెంట్ దుస్తుల్లో హీట్ పెంచుతున్న దిశాపటానీ!



ఒకప్పుడు హీరోయిన్స్ ఫోటోలకు ఫోజులివ్వమంటే నిండుగా చీర కట్టుకొని లేదా లంగా వోణీలు, చుడిదార్ వేసుకొని కనిపించేవారు. కాస్త జనరేషన్ ముందుకు వచ్చాక హీరోయిన్లు కొన్ని వెస్ట్రన్ డ్రెస్ లలో కనిపించేవారు. కానీ ఆ డ్రెస్సులు మోకాళ్ళ కిందికే ఉండేవి. ఇక నడుము అందాలను చూపించి చూపించినట్లుగా ఫోటోలకు ఫోజులిచ్చి అప్పటి హీరోయిన్స్ మెస్మరైజ్ చేసేవాళ్లు. కానీ ఇప్పటి హీరోయిన్లు మాత్రం అంతా ఓపెన్ గానే అందాలు పూర్తిగా కనిపించేలా డ్రెస్సులు వేసుకోవడం అనేది ఫ్యాషన్ గా మారిపోయింది. ఒక హీరోయిన్ ని చూసి మరొక హీరోయిన్ చాలా వెరైటీగా డ్రెస్ లను ఎంచుకుంటున్నారు. కొంతమంది హీరోయిన్లు అయితే ఒక అడుగు ముందుకేసి శరీరం మొత్తం కనిపించేలా ఫోటోలు కూడా తీయించుకుంటున్నారు. ఇక ఎక్కువ శాతం మంది హీరోయిన్లు మాత్రం ప్రైవేట్ పార్ట్స్ బయటికి కనిపించేలా డ్రెస్సులు ధరిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ కూడా లో దుస్తులు కనిపించేలా వేసుకున్న ట్రాన్స్పరెంట్ బ్లూ కలర్ డ్రెస్ కి సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట్లో చక్కర్లు కొట్టడంతో పాటు ఆమె అభిమానులను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి.. దిశా పటానీ తాజా లుక్ కి ఎంతోమంది ఆకర్షితులవుతున్నారు. మృదువైన నీలిరంగు క్రాప్ టాప్ ధరించి దానికి సరిపోయే రాఫ్ట్ స్కర్ట్ వేసుకుంది.. అలాగే ఆమె కర్లీ హెయిర్ తో ఆ డ్రెస్ కి ఆమె ఫేస్ కి మరింత అందం వచ్చింది.. ఈ డ్రెస్ లో చాలా దిశాపటాని హాట్ గా కనిపిస్తోంది. ముఖ్యంగా దిశాపటాని లోదుస్తులు హైలెట్ అయ్యేలా ఈ డ్రెస్ ఉండడం గమనార్హం.. లోదుస్తులు బయటికి కనిపించినా కూడా చాలా ధైర్యంగా ఫోటోలకు ఫోజులిచ్చింది. అలా ఫ్యాషన్ కి అతీతంగా దిశా పటాని రకరకాల డ్రెస్సులు వేసుకుంటూ ఫోటోలకు స్టిల్స్ ఇస్తూ ఉంటుంది.. అలా ఎప్పటికప్పుడు అభిమానులతో టచ్ లో ఉంటూ ఫోటోలతో అభిమానుల మనసు దోచుకుంటుంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం హెూలీగార్డ్స్ సాగా- ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్ అనే ఇంగ్లీష్

# 'కూలీ' నటుడిపై చీటింగ్ కేసు.. షౌబిన్ షాహిర్‌కి షాకిచ్చిన ఎర్నాకులం కోర్టు



మలయాళం నటుడు కూలీ సినిమా ఫేం షౌబిన్ షాహిర్‌పై ఎర్నాకులంలో చీటింగ్ కేసు నమోదైన విషయం తెలిసిందే. 'మంజుమ్మల్ బాయ్స్' సినిమా విషయంలో ఈ కేసు నమోదు అయ్యింది. మంజుమ్మల్ బాయ్స్ సినిమాకు షౌబిన్ షాహిర్‌తో పాటు అతడి తండ్రి, మరొకరు నిర్మాతగా వ్యవహరించారు. అయితే ఈ సినిమాకి సిరాజ్ అనే వ్యక్తి రూ. 7 కోట్ల వరకు పెట్టుబడిని పెట్టాడు. సినిమా విడుదలయ్యాకా లాభాల్లో 40 శాతం వాటా ఇస్తామని నిర్మాతలు హామీ ఇచ్చారని సిరాజ్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే, సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయినప్పటికీ, తనకు ఇంకా వాటా ఇవ్వలేదని.. షౌబిన్ షాహిర్‌తో పాటు అతడి తండ్రి తనను మోసం చేశారని సిరాజ్ ఆరోపించాడు. దీంతో పోలీసులు షౌబిన్‌తో పాటు ఇతరులపై కేసు నమోదు చేశారు.

# మళ్లీ సినిమాలు చేస్తానంటున్న ఇలియానా.. రీ ఎంట్రీ ఎప్పుడంటే!



గోవా బ్యూటీ ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పోకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడ ఇవన్నీ నాకు చాలా ఇష్టం. నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు.అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు. తిరిగి వచ్చే ముందు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావడానికి కొంత సమయం పడుతుంది. ఏ పని చేసినా దానికి పూర్తిగా న్యాయం చేయాలనుకుంటాను అని ఆమె ఇలియానా తెలిపారు.

# చిన్న జట్టుపై పాకిస్తాన్ ఘోర ఓటమి.. నెటిజన్ల ట్రోల్స్..



**షార్జా -నవభూమి:** షార్జా మైదానంలో జరిగినటీ20 మ్యాచ్‌లో ఆశ్చర్యకరంగా ఆఫ్ఘనిస్తాన్ 18 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. ఇది సాధారణ గెలుపు కాదు. ఆఫ్ఘాన్ దేశంలో భూకంపం వల్ల 1400 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన బాధాకర పరిస్థితుల్లో ఆ దేశానికి ఇది ఊపిరి పీల్చుకునే విషయమని చెప్పవచ్చు.మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ఆఫ్ఘనిస్తాన్ ఆరంభంలోనే ఓ వికెట్ కోల్పోయినా, తర్వాత ఇబ్రాహీం జద్రాన్ (65), సెదికుల్లా అటాల్ (64) అద్భుతంగా ఆడారు. వీరిద్దరి మధ్య 113 పరుగుల భాగస్వామ్యం లభించింది. టీ20ల్లో ఆఫ్ఘనిస్తాన్‌కు ఇది రెండో అత్యధిక రెండో వికెట్ భాగస్వామ్యం. ఆ క్రమంలో చివరకు ఆఫ్ఘనిస్థాన్ జట్టు 169 పరుగులు చేసింది.

పాకిస్తాన్ బౌలింగ్ ఎలా ఉందంటే

ఫహీమ్ అష్రఫ్, సయీమ్ ఆయుబ్ మిడిల్ ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. అయినా ఆఫ్ఘనిస్థాన్ జట్టు 169 పరుగులు చేసింది. తడిగా ఉన్న పిచ్, డ్యూ కారణంగా ఇది డిఫెండ్ చేయడానికి తక్కువగా అనిపించింది.

తొలి జట్టులోనే దుమ్ము రేపిన స్పిన్

పాకిస్తాన్ ఛేజింగ్ ఆరంభించగానే ఫారూకీ సైమ్ ఆయుబ్‌ను గోల్డెన్ డక్‌కు అవుట్ చేశాడు. తర్వాత షాహిబ్ జాదా ఫర్హాన్ కూడా ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. ఇక బరిలోకి వచ్చిన ఫఖర్ జమాన్ ఒక దశలో కొంత హిట్ చేసినా, స్టేడియంలో ఆఫ్ఘన్ శిబిరమే సత్తా చాటింది. ఆ క్రమంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్లు ఆటను పూర్తిగా మార్చేశారు. రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, మోహమ్మద్ నబీ కలిసి పాకిస్తాన్ బ్యాటింగ్ తీరును కట్టడి చేశారు.

# రోహిత్ శర్మ షాకింగ్ వెయిట్‌లాస్.. 95 నుంచి 75 కిలోలకు.. ఫాలో అయిన డైట్ ఇదే..



**న్యూఢిల్లీ-నవభూమి:** టెస్ట్ ఫార్మాట్, టీ-20 క్రికెట్‌కు వీడ్కోలు పలికిన హిట్ మ్యాన్ రోహిత్ శర్మ ప్రస్తుతం టీమిండియా తరఫున వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. ఈ ఏడాది జూన్‌లో ఐపీఎల్ ఆడిన రోహిత్ అప్పట్నుంచి మైదానానికి దూరంగా ఉన్నాడు. ఇటీవల బ్రాంక్ టెస్ట్ పాసై తాను సూపర్ ఫిట్‌గా ఉన్నానని నిరూపించుకున్నాడు. అయితే గత మూడు నెలల కాలంలో రోహిత్ ఏకంగా 20 కిలోల బరువు తగ్గాడట కొంతకాలంగా తన ఫిట్‌నెస్ విషయంలో వస్తున్న విమర్శలకు రోహిత్ తన వెయిట్‌లాస్ జర్నీతో చెక్ పెట్టాడట రోహిత్ బరువు 95 కిలోలు. అయితే మూడు నెలలు కఠినమైన డైట్ చేసి ఏకంగా 20 కిలోల వరకు రోహిత్ తగ్గాడట. తాజాగా రోహిత్ శర్మకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోల్లో రోహిత్ సన్నగా కనబడడం చాలా మందిని ఆశ్చర్యపరుస్తోంది రోహిత్ మంచి భోజన ప్రియుడు. దాల్ చావల్, బటర్ చికెన్, వడా పావ్, బిర్యానీలను ఇష్టంగా తింటాడు. అయితే ఫిట్‌నెస్ సాధించే క్రమంలో రోహిత్ వీటన్నింటినీ దూరం పెట్టాడట. రోహిత్ మూడు నెలల పాటు ఫాలో అయిన డైట్ ఇదేనంటూ ఒక డైట్ ప్లాన్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే అది అధికారికంగా కన్ఫామ్ కాదు.

నవక్రీడ

# సెమీస్‌కు పెగుల



**న్యూయార్క్-నవభూమి:** గతేడాది రన్నరప్, నాలుగో సీడ్ జెస్సికా పెగుల వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లోకల్ స్టార్ పెగుల 6-3, 6-3తో చెక్ భామ బార్బరా క్రెజికోవాపై వరుస సెట్లలో సునాయాసంగా నెగ్గింది. తొలి సెట్ రెండో గేమ్‌లోనే క్రెజికోవా సర్వీసను బ్రేక్ చేసిన పెగుల 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, క్రమంగా పుంజుకొన్న బార్బరా ఏడో గేమ్‌లో పెగుల సర్వీసను బ్రేక్ చేసి 3-4తో సమం చేసేలా కనిపించింది. కానీ, మరోసారి బ్రేక్ పాయింట్ సాధించిన పెగుల సెట్‌ను తన ఖాతాలో వేసుకొంది. ఇక రెండో సెట్ మొదటి గేమ్‌లోనే క్రెజికోవాకు చెక్ చెప్పిన జెస్సికా 2-0తో ముందంజ వేసింది. ఐదో గేమ్‌లో మరో బ్రేక్ పాయింట్‌తో పెగుల 4-1తో ఆధిక్యం సాధించింది. అయితే, ఆరో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీసను బ్రేక్ చేసిన క్రెజికోవా 3-4తో పోటీలోకి వచ్చేలా కనిపించింది. ఆ తర్వాతి గేమ్‌లో సర్వీసను నిలబెట్టుకొన్న అమెరికా ప్లేయర్.. 9వ గేమ్‌లో క్రెజికోవా మరోసారి బ్రేక్ చేసి సెట్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**